Postel No. MBN/08/2016-2018


పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :246 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు ఆదివారం 28 డిసెంబర్ 2025 పేజీలు :12 వెల రూ5 /-

## రహస్య జీవోల సంగతేంటి..?



**హైదరాబాద్, డిసెంబర్ 27:**తెలంగాణలో ప్రభుత్వ ఉత్తర్వుల గోప్యతపై హైకోర్టు మరోసారి సీరియస్ అయ్యింది. అన్ని జీవోలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు తెలియాల్సిన నిర్ణయాలను దాచిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టకుండా దాచిపెట్టే సంప్రదాయం మాత్రం మారడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ బ్లాంక్ నంబర్ల సంస్కృతి, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనూ కొనసాగుతుండటం పారదర్శకతపై పెద్ద ప్రశ్నగా మిగిలింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవోల గోప్యత గరిష్ట స్థాయికి చేరిందని చెప్పవచ్చు. ముఖ్యంగా భూ కేటాయింపులు, నిధుల మళ్లింపు, వివాదాస్పద నిర్ణయాలకు సంబంధించిన వేలాది జీవోలను ఆన్‌లైన్ లో - మిగతా3లో

## ఫస్ట్ వీక్ లో కేబినెట్ విస్తరణ ?

**హైదరాబాద్, డిసెంబర్ 27:**తెలంగాణ సీఎం రేవంత్ మరోసారి ఢిల్లీ బాటపట్టారు. శనివారం జరగబోయే అచిఅ సమావేశంలో పాల్గొన్నారు. ఆ తర్వాత పార్టీ పెద్దలతో రేవంత్ భేటీ అవుతారు. ఫుల్ కేబినెట్ కూర్పు కోసం అధిష్టానంతో రేవంత్ చర్చలు జరుపుతారని పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. జనవరి 1 తర్వాత.. విస్తరణ ఉంటుందనే ప్రచారం కూడా ఉంది.రేవంత్ కేబినెట్‌లో ప్రస్తుతం ఇద్దరికి మాత్రమే ఖాళీ ఉంది. ఆ రెండు బెర్త్‌ల కోసం పలువురు కీలక నేతలు పోటీ పడుతున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో మంత్రి పదవి ఆశిస్తున్నారు మల్‌రెడ్డి రంగారెడ్డి. పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షితో పాటు పీసీసీ చీఫ్ గతంలోనే హామీ ఇచ్చారని చెప్తున్నారాయన. గత విస్తరణ సమయంలోనే ఆయనకు పదవి రాకపోవడంపై



బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. కులమే అడ్డంకి అయితే.. బీసీకి మంత్రి పదవి ఇవ్వాలనుకుంటే.. తానే స్వయంగా రాజీనామా చేసి బీసీని గెలిపించుకుంటానంటూ బాహాటంగానే చెప్పారాయన.ఇక.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కూడా గతంలో పార్టీ హామీ ఇచ్చింది. తనకు మంత్రి పదవి ఖాయమైందంటూ ఇప్పటికే ఆయన పలుమార్లు ప్రకటించుకున్నారు. రాజగోపాల్‌రెడ్డి అనుచరులు ఫ్లెక్సీలు కూడా కట్టారు. పంచాయతీ ఎన్నికలు పూర్తైన తర్వాత కూడా తనకు మంత్రి పదవి వస్తుందంటూ బహిరంగంగానే చెప్పారు.మరోవైపు బీసీ కోటాలో ఆదిశ్రీనివాస్, ఎస్టీ కోటాలో బాలు నాయక్ పేర్లు కూడా మంత్రి పదవి రేసులో వినిపిస్తున్నాయి. ఒక బీసీ, ఒక ఓసీకి ఇస్తారా.. లేదంటే, రెండూ ఓసీలకే ఇస్తారా అనేదే ఇప్పుడు సస్పెన్స్. కేవలం విస్తరణకే పరిమితమా.. లేక, శాఖల మార్పులు కూడా ఉంటాయా అనే దానిపైనా పార్టీలో చర్చ జరుగుతోంది.చీఫ్ విప్‌తో పాటు అడ్లూరి స్థానంలో ఖాళీ అయిన విప్ భర్తీపైనా పార్టీ ఫోకస్ పెట్టింది. మంత్రి పదవి దక్కని వాళ్లతో పాటు సీనియర్లు.. విప్ పదవి రేసులో - మిగతా3లో

## జగన్, కేసీఆర్ మధ్య స్నేహసంకటం...

**హైదరాబాద, డిసెంబర్ 27:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మిత్రత్వం, శతృత్వం అనేవి కేవలం వ్యక్తుల మధ్యే కాకుండా, రాష్ట్ర ప్రయోజనాల చుట్టూ తిరుగుతుంటాయి. ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిస్థితి సరిగ్గా అలాగే ఉంది. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌తో జగన్‌కు ఉన్న సాన్నిహిత్యం, ప్రస్తుత నీటి యుద్ధాల నేపథ్యంలో జగన్‌ను తీవ్ర ఆత్మరక్షణలో పడేస్తోంది. కేసీఆర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు అటు చంద్రబాబుకు మేలు చేకూరుస్తూ, ఇటు జగన్‌ను ఇరకాటంలోకి నెట్టేలా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణ ప్రజలకు



కేసీఆర్ ఆరాధ్య దైవం కావొచ్చు, కానీ సగటు ఆంధ్రుడి దృష్టిలో ఆయన రాష్ట్ర విభజనకు ప్రధాన కారకుడు. విభజన వల్ల కలిగిన ఆర్థిక లోటు, రాజధాని లేకపోవడం వంటి సమస్యలన్నీ కేసీఆర్ ఉద్యమ ఫలితమేనని ఏపీ ప్రజలు బలంగా నమ్ముతారు. అటువంటి వ్యక్తితో జగన్ బహిరంగంగా స్నేహం చేయడం మొదటి నుంచీ విమర్శలకు దారితీస్తూనే ఉంది. తాజాగా జగన్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో వెలిసిన కేసీఆర్–జగన్ ఉమ్మడి ఫ్లెక్సీలు ఈ బంధాన్ని మరోసారి చర్చనీయాంశం చేశాయి. రాష్ట్ర ప్రయోజనాల కంటే జగన్‌కు వ్యక్తిగత స్నేహాలే ముఖ్యమా? అనే - మిగతా3లో

## గ్లోబల్ సిటీగా హైదరాబాద్

**హైదరాబాద్, డిసెంబర్ 27:**హైదరాబాద్.. ఈ పేరు కేవలం ఒక నగరానికి మాత్రమే పరిమితం కాదు. ఇది చరిత్ర, సంస్కృతి, ఆధునికత కలగలిసిన ఒక మహా సామ్రాజ్యం. ఒకప్పుడు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ గా ఉన్న ఈ నగరం, 2007లో 'గ్రేటర్' గా అవతరించింది. ఇప్పుడు ఆ గ్రేటర్ సరిహద్దులను కూడా చెరిపేస్తూ, ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి, దేశంలోనే అతిపెద్ద మెగా సిటీలలో ఒకటిగా అవతరించేందుకు సిద్ధమైంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన వార్డుల పునర్విభజన తుది గెజిట్ నోటిఫికేషన్, హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలవనుంది.నిన్నటి వరకు 150 వార్డులకే పరిమితమైన జీహెచ్ఎంసీ పాలన, ఇప్పుడు రెండింతలై 300 వార్డులకు విస్తరించింది. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన తాజా ఉత్తర్వులతో నగర స్వరూపం పూర్తిగా మారిపోయింది. నగర శివార్లలోని 20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో, ఈ విస్తరణ అనివార్యమైంది.అంకెల్లో ఈ మార్పును గమనిస్తే ఆశ్చర్యం కలగకమానదు. సుమారు 650 చదరపు కిలోమీటర్లు ఉన్న జీహెచ్ఎంసీ విస్తీర్ణం, తాజా విలీనంతో ఏకంగా 2,050 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. జనాభా పరంగా చూస్తే, 1.34 కోట్ల మంది ప్రజలు ఇప్పుడు ఒకే గొడుగు



కిందకు, అంటే ఒకే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చారు. ఈ నిర్ణయంతో ఢిల్లీ, ముంబై వంటి మెట్రో నగరాల సరసన హైదరాబాద్ సగర్వంగా నిలబడనుంది.కేవలం భౌగోళిక విస్తరణ మాత్రమే ప్రభుత్వ లక్ష్యం కాదు. దీని వెనుక తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ అనే బృహత్తర ప్రణాళిక ఉంది. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతమంతటినీ ఒకే యూనిట్‌గా మార్చడం ద్వారా ఏకీకృత పాలన, సమాన పన్నుల విధానం, మెరుగైన పౌర సేవలను అందించడమే దీని ఉద్దేశం. రాబోయే 2026–27 జాతీయ జనాభా గణనను దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా అంటే డిసెంబర్ 31 రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను మెరుపు వేగంతో పూర్తి చేసింది. దీనివల్ల - మిగతా3లో



## అసెంబ్లీకి కేసీఆర్...

**హైదరాబాద్, డిసెంబర్ 27:**తెలంగాణ రాజకీయాలు రంజుగా మారబోతున్నాయి. ఇప్పట్లో ఎన్నికలు లేవు.. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియదు. ఇన్నిరోజులపాటు లోకల్ బాడీ ఎలక్షన్లో జనాలు ఎంటర్టైన్మెంట్ పొందారు. ఇంకా ఆ హ్యాంగ్ ఓవర్ నుంచి తెలంగాణ ప్రజలకు కోలుకోలేదు. అయితే అంతకుమించిన డబుల్ ఎంటర్టైన్మెంట్ ఇవ్వడానికి తెలంగాణ పొలిటికల్ లీడర్లు సిద్ధంగా ఉన్నారు..ఈనెల 29 నుంచి తెలంగాణ అసెంబ్లీ ప్రారంభమవుతుంది. ఈ సమావేశాలకు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం ఎర్రవల్లి క్షేత్రంలో మాజీ మంత్రులతో కెసిఆర్ మాట్లాడారు. ఈ నేపథ్యంలో తాను అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్నట్టు వారితో చెప్పారు.. ఆ మాజీ మంత్రులు మీడియాకు లీకులు ఇవ్వడంతో - మిగతా3లో

## అంతా తానై... అన్నింటా తానై

**హైదరాబాద్, డిసెంబర్ 27:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తనకు ఎదురు లేకుండా చేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా ఆయనకు పోటీగా కాంగ్రెస్ లో మరొక నేత కనిపించడం లేదు. ఆ ప్రయత్నంలోనూ ఎవరూ లేరు. అందుకే తరచూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను పదేళ్ల పాటు ముఖ్యమంత్రిని అని ప్రకటించుకుంటున్నారు. పార్టీ పదవులు, ప్రభుత్వ పదవుల విషయంలోనూ రేవంత్ రెడ్డి తన మాట చెల్లుబాటు చేసుకునేలా వ్యవహరిస్తున్నారు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఏ నియామకం జరిగినప్పటికీ అందుకు రేవంత్ రెడ్డి అంగీకరించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఒకరకంగా చెప్పాలంటే తెలంగాణ కాంగ్రెస్ కు, ప్రభుత్వానికి అంతా తానే అయి వ్యవహరిస్తున్నారన్నది వాస్తవం.గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితులు కాంగ్రెస్ పార్టీలో కనిపించేవి. కానీ తర్వాత రోశయ్య, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి హయాంలోనూ గ్రూపులు బాహాటంగా బయటపడేవి. కానీ మళ్లీ 2004 నాటి పరిస్థితులు కాంగ్రెస్ లో కనిపిస్తున్నాయన్నది వాస్తవం. కాంగ్రెస్ లో సీనియర్ నేతల నుంచి మంత్రుల వరకూ ఎవరూ రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని ధిక్కరించే పరిస్థితులు లేవు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా రేవంత్ రెడ్డి కారణంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందని బలంగా నమ్ముతుంది. అదే సమయంలో నాయకత్వం మరొకరికి చేతుల్లోకి బదిలీ చేసే ఆలోచన కూడా వారిలో కనిపించకపోవడం విశేషం. ఎందుకంటే



సాఫీగా సాగుతున్న ప్రభుత్వంలో వేలు పెట్టడం ఇష్టం లేక మౌనంగా ఉంటుందిమరొకవైపు పార్టీలోనూ రేవంత్ రెడ్డి మాట చెల్లుబాటు అవుతుంది. పీసీసీ కార్యవర్గంలోనూ, అలాగే జిల్లా డీసీసీ అధ్యక్షుల ఎంపికలోనూ రేవంత్ చెప్పిన నేతల పేర్లే దాదాపుగా ఫైల్ అవుతున్నాయి. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్, తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా రేవంత్ మాటకు జై కొట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎన్నికల్లో గెలుపు, ఓటముల బాధ్యతను కూడా రేవంత్ రెడ్డి తానే స్వయంగా తీసుకుంటుండటం, ప్రత్యర్థి పార్టీలకు బలంగా సమాధానమిచ్చే మరొక నేత లేరు. అందుకే పార్టీలో వ్యతిరేక గళం విప్పే నేతలు సయితం నేడు సైలెంట్ అయిపోయారు. దీంతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తిరుగులేని లీడర్ గా చెలామణి అవుతున్నారు.

## డ్రగ్స్ కేసులపై బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్

**హైదరాబాద్,డిసెంబరు :** డ్రగ్స్ కేసులపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పండుగల అప్పుడే డ్రగ్స్ కేసులు నమోదు చేస్తారా? అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది..? అని నిలదీశారు. అనేకమంది సెలబ్రిటీల పేర్లు బయటకు వచ్చాయి కదా..? ఏం చేశారని ప్రశ్నించారు. తమతోపాటు కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా డ్రగ్స్ తీసుకున్నారని.. గతంలో నిందితులు వాంగ్మూలం ఇచ్చారు కదా అని గుర్తుచేశారు. ఇవాళ(శనివారం) హైదరాబాద్ వేదికగా మీడియాతో మాట్లాడారు బండి సంజయ్. నిందితుల వాంగ్మూలం ఆడియో, వీడియో రికార్డు చేశారని తెలిపారు. తమ కుటుంబ సభ్యుల భవిష్యత్ నాశనమవుతుందనే భయంతోనే.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ కేసు నీరుగార్చారని ఆరోపించారు. అకున్ సబర్వాల్‌ను డ్రగ్స్ కేసు నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ సేకరించిన



ఆధారాలు, వీడియో స్టేట్‌మెంట్స్‌ను నాటి సీఎస్ సోమేశ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారని ప్రస్తావించారు. గతంలో సేకరించిన ఆధారాలు ఏమయ్యాయి..? అని నిలదీశారు. సోమేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని అన్నారు బండి సంజయ్ కుమార్. డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ లీగల్‌గా విధులు నిర్వహిస్తోందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈగల్ టీమ్‌లో కొంతమంది డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని ఆరోపణలు చేశారు. అకున్ సబర్వాల్‌కి తిరిగి డ్రగ్స్ కేసు బాధ్యతలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

వార్తాతరంగాలు




## సంపాదకీయం

# ప్రజాస్వామ్యం పరిఢవిల్లేనా?

ప్రజాస్వామ్య సౌధం నాలుగు స్తంభాలపై నిలిచి ఉంది. చట్టసభలు, కార్యనిర్వాహక శాఖ, న్యాయ వ్యవస, మీడియా. ఈ నాలుగు స్తంభాలలో ముఖ్యమైన చట్టసభలకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరపవలసిన బాధ్యత ఎన్నికల కమిషన్, ప్రభుత్వాలదే. ముఖ్యంగా లోక్‌సభ శాసనసభలకు ఐదేళ్లకొకసారి లేదా కాస్త ముందుగా గాని ఎన్నికలు నిర్వహిస్తుండగా మిగిలిన స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారు. ఐదేళ్లు నిండిన తర్వాత వీటికి ప్రత్యేక అధికారులు నియమించి పాలన సాగిస్తున్నారే కానీ ఏదో ఒక కుంటిసాకుతో వాటికి ఎన్నికలు జరపడం లేదు. ఫలితంగా వాటికి రావలసిన కేంద్ర నిధులు విడుదల కాక అభివృద్ధి పడకేస్తున్న పరిస్థితి నెలకొంది. ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. ఏదో విధంగా అబద్ధపు ప్రచారాల తోనూ, అలవికాని హామీలతోనూ ఓటర్లను ఆకర్షించవచ్చు. తమ ఓటు షేర్ పెంచుకునే ప్రయత్నం చేయవచ్చు. అధికార పక్షం బలప్రదర్శనకు, అంతో ఇంతో అధికార దుర్వినియోగానికి మంచి అవకాశం. కాగా ప్రతిపక్షాలకు విమర్శల బాణాలు సంధించడానికి, అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే దానికి సువర్ణ అవకాశం. పోటీ చేసే అభ్యర్థులకు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుండి ఫలితాల ప్రకటన వరకు గొప్ప టెన్షన్. తెగించి ఖర్చు చేస్తున్నా అందుకు అనుకూలమైన ఫలితం వస్తుందో లేదో అన్న ఆందోళన వారిని ఆవహించి ఉంటుంది. ఎన్నికల కమిషన్ కంటపడకుండా ఖర్చు చేయాలి. అందరినీ 'సంతృప్తి' పరచుకుంటూ పోవడం అతడికి అత్యవసరం. ఈ మహా ప్రక్రియలో చివరి బకరా ఓటరు. ఆశించి భంగపడటం అతడి నైజం. అందుకే ఈ మధ్య అభివృద్ధి జరుగుతుందని, తమ జీవితాలు బాగుపడతాయని సగటు ఓటరు విశ్వసించడం లేదు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఇచ్చే సొమ్మునే ఆశిస్తున్నాడు, దానికి ఆశపడుతున్నాడు. మన వ్యవస్థలో ఎన్నికల అక్రమాలు, నిబంధనల అతిక్రమణ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. పోటీ అభ్యర్థులను బెదిరించడం, లొంగదీసుకునే ప్రయత్నం చేయడం, కొంతమంది అభ్యర్థులతో లోపాయకారి ఒప్పందాలు నేటి ఎన్నికల ప్రక్రియలో భాగమయ్యాయి. ముఖ్యంగా ఎన్నికల ముందు రోజు జరిగే అక్రమాలకు, దుర్మార్గాలకు అంతులేకుండాపోయింది. పోలింగ్‌నాడు కూడా ఓటరుకు తన ఓటు తాను వేసేంతవరకు నమ్మకం లేదు. అంటే ప్రతిచోట ఎన్నికల ప్రక్రియ అపహాస్యం అవుతుండగా ప్రజాస్వామ్యంపై విశ్వాసం సన్నగిల్లుతున్నది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారుతున్నది. జాతీయ స్థాయిలో కార్పొరేట్లు తమకు అనుకూలమైన ప్రభుత్వాల కోసం వందల వేల కోట్లు పార్టీలకు విరాళాలు ఇస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నాయి. గతంలో పెద్ద పదవులకు అంటే ఎంపి, ఎంఎల్ఎ లాంటి వాటికి విదేశాలలో ఉన్న వారు సైతం దేశానికి వచ్చి ఏదో ఒక పార్టీ టికెట్ సంపాదించి పోటీ చేయడం పదవులు అనుభవించడం మనకు అనుభవమే. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు అభ్యర్థులు విదేశాల నుండి 'దిగుమతి' అవుతున్నారు. కొంతమంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి లేదా పదవి విరమణ చేసి మరీ ఈ సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేశారు. అంటే వారికి 'సేవా తత్పరత' ఎక్కువవుతున్నది. మాతృభూమిని అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నట్లు వారు చెప్పుకోవడం సంతోషమే. కానీ అది ఐదేళ్ల తర్వాత ఆ గ్రామ ప్రజలు ఇవ్వవలసిన తీర్పు మాత్రమే. మన దగ్గర మహిళా అభ్యర్థులు పదవులకు ఎంపికైనా కానీ వారి 'మగమహారాజు'లే పరిపాలిస్తుంటారు. అనధికార పరిపాలకులుగా చలామణి అవుతుంటారు. పదవులు మహిళలకు, అధికారాలు వారి భర్తలకు. కొన్ని సందర్భాలలో సమావేశాలకు సైతం వారి భర్తలే హాజరై చర్చల్లో పాల్గొంటూ నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరించడం శోచనీయం. మాటల్లోని మహిళాభ్యున్నతి గడప దాటడం లేదు. తరతరాలుగా జీర్ణించుకొని పోయిన పురుషాధిక్యం సమాజంలో మహిళలకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పరచుతూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. కొన్నిచోట్ల దళిత గిరిజన సర్పంచులపై ఆ గ్రామంలోని ఆధిపత్య కులాలు తమ పెత్తనం చెలాయిస్తుండటం చూస్తూనే ఉన్నాం. కొంతమంది మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు తమ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఇతర నియోజకవర్గాలను చిన్నచూపు చూస్తారు లేదా నిర్లక్ష్యం చేస్తారు. వీరు రాష్ట్రం మొత్తానికి లేదా దేశం మొత్తానికి బాధ్యులు అనే విషయం మరవడం బాధాకరం. పదవి స్వీకారం నాడు ఏ వ్యక్తికి, ప్రాంతానికి అనుచితంగా లేదా పక్షపాతంతో వ్యవహరించబోమని దైవసాక్షిగా ప్రమాణం చేస్తారు. ప్రజలు ప్రశ్నించడం మానుకున్నారు. ప్రశ్నించిన వాడి ఉనికి ప్రశ్నార్థకమవుతున్నది. అందుకే అవినీతికి అంతులేకుండా పోతున్నది. న్యాయం అందడానికి, పొందడానికి కాలము, డబ్బు ఖర్చవుతున్నాయి. సామాన్యుడి సహనానికి పరీక్షగా మారింది. రాజకీయాలలో డబ్బు జోక్యం ఎక్కువైంది. అందుకే గతంలో లాయర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, మేధావులు, సంఘ సంస్కర్తలు రాజకీయాలు నడపగా నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మద్యం వ్యాపారులు, నేరచరితులు రాజకీయాలను ఆక్రమించారు, విలువలను పాతరేశారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా రాజకీయాల పట్ల ఆకర్షితులవుతున్నారే కానీ వాటిని ప్రక్షాళన చేయలేకపోతున్నారు. అందులో విజయం సాధించలేకపోతున్నారు. రేపటి తరానికి దిశానిర్దేశం చేయలేకపోతున్నారు. రాజకీయ నాయకులకు, ఉద్యోగులకు లాగా ఒక నిర్దిష్టమైన అర్హత లేకపోవడం ఈ వ్యవస్థ దురదృష్టం. ఓటుకు ఈసారి గిరాకీ మరీ పెరిగింది. దూరతీరాలలో ఉన్న వారు సైతం తమ సొంత ఊరుకొచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు అభ్యర్థుల ఖర్చుతో. ఒక పెద్ద మనిషి ప్రత్యేకించి విదేశాల నుండి విమానంలో విచ్చేసి తన హక్కును కాపాడుకొని ఓటు విలువ తెలియజేశాడు. నిన్నమొన్నటి ఎన్నికలలో ఒకచోట ఒక ఓటు విలువ 40 వేలు పలికినట్లుగా చదివాం. కొన్ని చోట్ల కోట్లు చేతులు మారుతున్నట్టుగా చదువుతున్నాం. అంతో ఇంతో ఈ దేశంలో ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టిన టిఎన్ శేషన్ సదాస్మరణీయుడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశంలో జిల్లాకు ఒక శేషన్ కూడా సరిపోడేమో! ఆ పిల్లిమెడలో గంటకట్టేది ఎవరో? ఆశగా ఎదురు చూద్దాం. ఇక గ్రామాల్లో శాంతి నెలకొంటుందని, అవి అభివృద్ధి పథంలో సాగుతాయని కోరుకుందాం.

# నేడు రతన్ టాటా జయంతి

## ప్రతి భారతీయుడికి స్ఫూర్తి రతన్ టాటా జీవితం



పది వేల కోట్ల రూపాయలుగా ఉండవలిసిన ఒక వ్యాపార సామ్రాజ్యాన్ని ఒక్కడు ఒకే ఒక్కడు తన యుక్తి తో,తన వ్యాపార నిపుణతతో ఆరు లక్షల కోట్లకు ఎగబాకేలా చేసాడు. దాదాపు ఏడు లక్షల మందికి ఉపాధినిస్తూ,నూట యాభై ఏళ్ళ చరిత్ర కలిగిన టాటా గ్రూప్ ను అందనంత ఎత్తులో నిలబడేలా చేసాడు. నేడు ఉప్పు నుండి ఉక్కు వరకు టీ నుండి ట్రక్కుల వరకు ఇలా ప్రతి వ్యాపారంలో లోను ఖచ్చితంగా టాటా పేరు వినిపిస్తుంది.ఇంతటి ఘన చరిత్రను టాటా గ్రూప్ కు కట్టబెట్టేలా చేసాడు అతను. అతనే రతన్ టాటా. కొన్ని కోట్ల మంది భారతీయులకు ఆదర్శప్రాయడు ఈ జీవన విజేత. రతన్ టాటా గురించి చూసుకుందాం:1937 డిసెంబర్ 28 న దేశంలోనే ధనిక కుటుంబంలో జన్మించాడు రతన్ టాటా. ఏడేళ్ల వయసులోనే తల్లి తండ్రులిద్దరూ విడిపోవటంతో నాయనమ్మ దగ్గర పెరగవలిసి వచ్చింది. తన చదువును అమెరికాలోనే పూర్తి చేసుకొని ఆర్జెడి టాటా పిలుపు మేరకు జంషెడ్ పూర్ లోని టాటా స్టీల్ కంపెనీలో అప్రెంటీస్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించాడు రతన్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఆలోచనలతో, తన నైపుణ్యంతో టాటా కంపెనీలో ఒక ఉత్తమ ఉద్యోగిగా ఎదిగగలిగాడు రతన్. ఆ విధంగా కొన్ని సంవత్సరాలు ఉద్యోగిగా పనిచేసిన తరువాత 1991 లో ఆర్జెడి టాటా నుండి టాటా గ్రూప్ చైర్మన్ గా భాద్యతలు స్వీకరించాడు రతన్. అప్పట్లో ఈ నిర్ణయాన్ని బోర్డు అఫ్ మెంబెర్స్ లో చాలా మంది వ్యతిరేకించారు. అనుభవం లేని రతన్ చేతిలో ఇన్ని కోట్ల వ్యాపార సామ్రాజ్యం నడవలేదని అందరు వాదించారు. కానీ వారికి ఆనాడు తెలియదు పాపం ఇతడే టాటా గ్రూప్ ను దశదిశలా వ్యాపించే ఘనుడు అవుతాడని... చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత టాటా గ్రూప్ లో సమూల ప్రక్షాళన చేసాడు రతన్. రాత్రి పగలు కష్టపడి పది వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని తన అసాధారణ వ్యాపార నైపుణ్యంతో ఆరు లక్షల కోట్ల విలువ చేసే కంపెనీగా మార్చాడు రతన్. దేశ వాణిజ్య , పారిశ్రామిక పురోగతిలో కీలక పాత్ర పోషించాడు. నేడు టాటా గ్రూప్ 90 కి పైగా దేశాలలో విస్తరించి వందకు పైగా వ్యాపారాలలో తన ముద్రను వేసి, దేశంలోనే కాదు, ప్రపంచం లోనే అత్యుత్తమ కంపెనీలలో ఒకటిగా నిలబడింది. వ్యాపార సామ్రాజ్యంలో ఒక శిఖరంగా ఎదగగలిగింది.ప్రతి మధ్య తరగతి వాడికి సొంతంగా ఒక కారు ఉండాలనే ఉద్దేశంతో కేవలం లక్ష రూపాయలకే టాటా నానో కారును మార్కెట్లోకి తెచ్చి పెను సంచలనాన్నే సృష్టించాడు రతన్.. నానో కారు ఓ సంచలనం: టాటా గ్రూప్ భారత దేశానికి ఎన్నో కొత్త కొత్త వ్యాపారాలను పరిచయం చేసింది. నేడు ఎయిర్ ఇండియా గా పిలబడుతున్న విమానయాన సంస్థను మొదట టాటాఎయిర్ లైన్స్ పేరుతో 1868 లో జంషెడ్ జీ టాటా స్థాపించాడు. కాలక్రమంలో అది కాస్త ప్రభుత్వం చేతిలోకి వెళ్ళింది. ఇప్పుడు మళ్లీ టాటా ల చేతికే వచ్చింది. అలాగే భారత దేశంలో మొట్టమొదటి హోటల్ అయిన తాజ్ హోటల్ ను ప్రారంభించింది కూడా టాటాలే. బ్రిటన్ కు చెందిన టేట్లి అనే కంపెనీని టాటా టీ లో కలుపుకొని ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద టీ కంపెనీ గా టాటా టీ ఎదిగింది. అంతే కాదు మనల్ని పాలించిన బ్రిటిషర్లకే ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగాడు రతన్ టాటా. ఎన్నో విదేశీ కంపెనీలను టాటా గ్రూప్ లో కలుపుకొని టాటా ను ఒక మహా సామ్రాజ్యంగా ఎదిగేలా చేసాడు. 1998 లో టాటా ఇండికా కార్లను ప్రవేశ పెట్టారు. అయితే దురదృష్టవశాత్తు ఆ కార్లు మొదటి సంవత్సరంలోనే ఫెయిల్ అవటం తో రతన్ టాటా ఇండికా కార్ల వ్యాపారాన్ని అమ్మేయాలని భావించాడు. ఇందు కోసం అమెరికా లోని ఫోర్డ్ కంపెనీకి తన టీం తో పాటు రతన్ టాటా కూడా వెళ్లారు. అయితే ఫోర్డ్ కంపెనీ చైర్మన్,రతన్ టాటా ను మీకు కార్లు ఎలా తయారు చేయాలో తెలియనప్పుడు కార్ల బిజినెస్ ఎందుకు స్టార్ట్ చేసారు అని అవమానించాడు. ఈ సంఘటనతో ఆ డీల్ మాట్లాడకుండానే వెనుదిరిగి వచ్చేసారు. కొన్ని సంవత్సరాల తరువాత టాటా ఇండికా నష్టాలనుండి లాభాల లోకి రావటం మొదలు పెట్టింది.కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా , అదే సమయంలో ఫోర్డ్ కంపెనీకి చెందిన జాగ్వార్ ,లాండ్రోవర్ కార్లు భారీగా నష్టాల్లోకి వెళ్లిపోయాయి. ఆ సమయం లోనే రతన్ ఆ రెండు కంపెనీలను నేను కొంటాను అని ఫోర్డ్ కంపెనీకి ఆఫర్ చేసాడు రతన్. అప్పుడు ఫోర్డ్ కంపెనీ చైర్మన్ తన టీం తో అమెరికా నుండి ముంబై కు వచ్చాడు. ఆ విధంగా తనను అవమానించిన వారికే గుణపాఠం చెప్పాడు రతన్. నానో కార్ల ఉత్పత్తి కోసం పశ్చిమ బెంగాల్ లో ఏర్పాటు చేసిన ప్లాంటును అక్కడి రైతులు వ్యతిరేకించడంతో ,ఆ ప్లాంటు మరొక చోటుకు మార్చటంతో వేల కోట్ల నష్టాన్ని చూడవలసి వచ్చింది . పాకిస్థాన్ ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తాజ్ హోటల్ పై జరిపిన ఉగ్ర దాడిలో వందల మంది అతిథులను, తమ ఉద్యోగస్థులను పోగొట్టుకోవాల్సివచ్చింది. ఈ సంఘటన రతన్ ను మానసికంగా ఎంతో బాధించింది. లక్షల కోట్ల విలువ చేసే కంపెనీలకు అధిపతులైనా టాటా వంశీయులు ఇంతవరకు ఏనాడూ ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో నిలవలేదు. ఎందుకంటే టాటా గ్రూప్ నుండి వచ్చే లాభాలలో 66శాతం టాటా ట్రస్టులకు విరాళంగా ఇవ్వటం జరుగుతుంది. దేశ సామజిక పరిస్థితులు మెరుగుపరచటానికి టాటా ట్రస్టులు ఎంతగానో కృషి చేస్తున్నాయి.తాజ్ ఉగ్ర దాడిలో నష్టపోయిన వారికి అన్ని విధాలా సహాయమందించాడు రతన్. బ్రహ్మచారి గా ఉంటూ నలుగురి బాగు కోసం బతుకుతున్న మహనీయుడు రతన్ టాటా. తన ప్రతిభను మెచ్చి పలు దేశాలలోని యూనివర్సిటీలు తనను గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అంతే కాదు భారత ప్రభుత్వం పద్మ భూషణ్, పద్మ విభూషణ్ లతో రతన్ ను గౌరవించింది. కోట్లకు అధిపతి అయినా ఏనాడూ కుసుమంత గర్వాన్ని కూడా ప్రదర్శించలేదు రతన్ టాటా. 84ఏళ్ళ వయసులోనూ సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటూ కోట్ల మంది భారతీయుల హృదయాలను గెలుచుకున్నాడు రతన్.నేడు రతన్ టాటా అంటే ఒక వ్యక్తి కాదు,ఒక సంస్థ , ఒక బ్రాండ్. వీటన్నిటికీ మించి సృజనాత్మకత , దార్శనికత ఉన్న ఒక గొప్ప మానవతావాది.ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రతన్ టాటా 2024 అక్టోబరు 9న 86 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. రక్తపోటు అకస్మాత్తుగా పడిపోవడంతో అక్టోబరు 7న బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆయనకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వైద్యులు చికిత్స అందించిన లాభం లేకుండా పోయింది. నేడు 130 కోట్ల మంది భారతీయులు మనసారా సగర్వంగా ఇతడు మా భారతీయుడు అని చెప్పుకునే వారిలో ముందు వరుసలో ఉంటాడు రతన్ టాటా. అతని సాగించిన జీవన ప్రయాణం నేడు మనందరికీ స్ఫూర్తిదాయకం.

# సౌత్ కొరియాలో బేబి బోసన్ పథకం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:**ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల ఒక సమస్యగా మారుతుంటే, ఒక దేశంలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. అక్కడ జనాభా తగ్గిపోతుండటం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. యువత పెళ్లిళ్ల మీద ఆసక్తి చూపడం లేదు, అసలు డేటింగ్ అంటేనే భయపడుతున్నారు. దీంతో దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని గ్రహించిన అక్కడి ప్రభుత్వం ఒక వినూత్నమైన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎవరైనా సరే డేటింగ్ మొదలుపెడితే చాలు వారికి నగదు బహుమతులు ఇస్తామని ప్రకటించింది. ఒకవేళ పెళ్లి చేసుకుంటే మరింత పెద్ద మొత్తంలో పారితోషికం, పిల్లల్ని కంటే ఏకంగా లక్షల్లో ప్రోత్సాహకాలు అందిస్తామని ఆఫర్ చేస్తోంది. ఇంతకీ ఆ దేశం ఏది? అక్కడ యువత ఎందుకు ఇలా తయారయ్యారు?ఈ వింతైన పరిస్థితులు ఎదుర్కొంటున్న దేశం మరెదో కాదు.. అది 'దక్షిణ కొరియా' . ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యల్ప జననాల రేటు నమోదవుతున్న దేశం ఇదే. ఇక్కడ జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోవడం, ఉద్యోగాల్లో విపరీతమైన పోటీ ఉండటం వల్ల యువత పెళ్లి అనే బంధానికి దూరంగా ఉంటున్నారు. పెళ్లి చేసుకుంటే బాధ్యతలు పెరుగుతాయని, ఆర్థికంగా ఇబ్బందులు వస్తాయని వారు భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వం జోక్యం చేసుకుని, ఒకరినొకరు కలుసుకోవడానికి ప్రోత్సహించడమే కాకుండా, పెళ్లి చేసుకున్న జంటలకు గృహ రుణాలు, ఇతర సౌకర్యాల్లో భారీ రాయితీలు ఇస్తోంది. కొన్ని నగరాల్లో అయితే డేటింగ్ కోసం ప్రత్యేకమైన ఈవెంట్లను కూడా ప్రభుత్వం నిర్వహిస్తోంది.దక్షిణ కొరియాలో జననాల రేటు ఎంతలా పడిపోయిందంటే.. ఒక మహిళ తన జీవితకాలంలో కనే పిల్లల సగటు సంఖ్య 0.7 కంటే తక్కువకు చేరుకుంది. జనాభా స్థిరంగా ఉండాలంటే ఈ సంఖ్య కనీసం 2.1 ఉండాలి. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో దేశంలో వృద్ధుల సంఖ్య పెరిగిపోయి, పని చేసే యువత కరువయ్యే ప్రమాదం ఉంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వం 'బేబీ బోనస్' పథకాలను అమలు చేస్తోంది. బిడ్డ పుట్టినప్పటి నుంచి వారు పాఠశాలకు వెళ్లే వరకు ప్రతి నెలా కొంత నగదును తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తోంది. అయినప్పటికీ అక్కడి యువత మాత్రం కెరీర్, స్వేచ్ఛకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.కేవలం ఆర్థిక పరమైన ఇబ్బందులే కాకుండా, సామాజిక కారణాలు కూడా ఈ పరిస్థితికి కారణమని నిపుణులు చెబుతున్నారు. కఠినమైన పని వేళలు, పిల్లల పెంపకానికి అయ్యే ఖర్చు, మారుతున్న ఆలోచనా విధానం వల్ల కొరియా యువత ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చు చేసినా, యువత మనస్తత్వంలో మార్పు రాకపోవడం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది.ఒకప్పుడు అభివృద్ధిలో దూసుకుపోయిన ఈ ఆసియా టైగర్, ఇప్పుడు జనాభా సంక్షోభంతో కునారిల్లుతోంది. ప్రపంచంలోని ఇతర దేశాలకు కూడా ఇది ఒక హెచ్చరిక లాంటిదే అని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి ప్రేమకు, పెళ్లికి డబ్బు ఆశ చూపడం అనేది కొరియాలో ఒక అనివార్యమైన చర్యగా మారింది. మరి ప్రభుత్వం ఇస్తున్న ఈ ఆఫర్లను చూసి అయినా అక్కడి యువత తమ మనసు మార్చుకుంటారో లేదో చూడాలి

# ఆస్ట్రేలియాలో ఖలిస్తాన్ ఉద్యమం

**సిడ్నీ, డిసెంబర్ 27:** ఆస్ట్రేలియా.. ఇటీవలే ఆ దేశంలో తండ్రీ కొడుకులైన ఇద్దరు ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఇందులో 15 మంది మరణించారు. కాల్పులు జరిపిన ఇద్దరిలో ఒకరిని పోలీసులు కాల్చి చంపేశారు. ఇక తాజాగా సిక్కు వేర్పాటు వాద సంస్థ అయిన ఖలిస్తాన్‌కు చెందిన కొంత మంది ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో భారత జాతీయ పతాకాన్ని కత్తితో చీల్చారు. భారత్ వ్యతిరేక ఖలిస్తాన్ అనుకూల నినాదాలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఖలిస్తాన్ సంస్థ మొన్నటి వరకు కెనడా కేంద్రంగానే ఇలాంటి భారత వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించింది. కెనడా మాజీ ప్రధాని ట్రూడో ప్రభుత్వం కూడా వారికి అండగా నిలిచింది. ఇప్పుడు ఖలిస్తాన్ ఆస్ట్రేలియాలో భారత వ్యతిరేక నినాదాలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే హమాస్ అనుకూల ఉగ్రవాదులు ఆస్ట్రేలియాలో పెరిగారు. తాజాగా ఖలిస్తాన్ మద్దతుదారుల ఆందోళన కలకలం రూపింది. భారత్‌లో సిక్కు వేర్పాటు వాదమే లక్ష్యంగా ఖలిస్తాన్ పనిచేస్తోంది. ఖలిస్తాన్ దేశం కావాలని డిమాండ్ చేస్తోంది.ఘటన ఆస్ట్రేలియాలోని భారతీయ కమ్యూనిటీలో విభజనలను పెంచుతోంది. ఒక వర్గం దేశభక్తి ప్రదర్శిస్తుంటే, మరొక వర్గం విదేశీ ఆధారాలతో వ్యతిరేకత చూపుతోంది. ఇది భవిష్యత్ ఎన్నికలు, సామాజిక సంబంధాలపై దీర్ఘకాల ప్రభావం చూపనుంది. భారత ప్రభుత్వం దౌత్య మార్గాల ద్వారా స్పందించాల్సిన అవసరం ఏర్పడింది. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో భారతీయ వ్యతిరేక ప్రభావం పెరుగుతున్న సమయంలో, ఇలాంటి సంఘటనలు ద్వైపాక్షిక సంబంధాలను ప్రభావితం చేయవచ్చు. విదేశీ భూమిపై జరిగిన ఈ ప్రదర్శనలు భారత్ విధానాలను అంతర్జాతీయ స్థాయిలో సవాలు చేస్తాయి. ఐక్యత కాపాడుకోవడానికి కమ్యూనిటీలు చర్చలు ప్రారంభించాలి. ఆస్ట్రేలియా అధికారులు సామాజిక సామరస్యాన్ని కాపాడటానికి జాగ్రత్తలు తీసుకోవాలి.

# సర్పంచుల ఆత్మగౌరవం కాంగ్రెస్ తోనే

**కే ఎల్ ఆర్**

**రంగారెడ్డి:**గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మరోసారి స్పష్టం చేశారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. గత బీఆర్ఎస్ హయాంలో నిధులు లేక గ్రామాల అభివృద్ధి శూన్యం. న్న పల్లెకు రూ.5లక్షలు, పెద్ద పంచాయతీలకు రూ.10లక్షలు సీఎం రేవంత్ కానుక అని అన్నారు.తుక్కుగూడ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మహేశ్వరం, కందుకూరు మండలాల సర్పంచులు కేఎల్ఆర్ ను కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులకు పలు సూచనలు చేశారు కిచ్చెన్న రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని లక్ష్మారెడ్డి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతీ పంచాయతీకి రూ. 5 లక్షలు నుంచి రూ. 10 లక్షలు నిధులను ౹ాఆఈ నుంచి కేటాయించడం హర్షనీయమని కిచ్చెన్న అన్నారు. గత బీఆర్ఎస్, కేసీఆర్ హయాంలో సర్పంచులు నిధులు లేక... చేసిన బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకున్నారని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. ??గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ ను, సీఎం రేవంత్ రెడ్డి గారి ప్రజాపాలనను ఆశీర్వాదించారని ఐఖీ అన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. ??మహేశ్వరం, కందుకూరు మండలాలకు అదనపు నిధులు తెచ్చేందుకు ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క తో మాట్లాడుతానని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.

# అసెంబ్లీకి కేసీఆర్...

- మొదటి పేజీ తరువాయి

ఈ వార్త తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో విపరీతమైన చర్చకు దారితీస్తోంది. అసెంబ్లీకి వచ్చి, తెలంగాణ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని కెసిఆర్ ప్రణాళిక రూపొందించారని తెలుస్తోంది.కాళేశ్వరం దగ్గర నుంచి మొదలుపెడితే ఫోన్ ట్యాపింగ్ వరకు ప్రతి వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ను ఇరుకున పెట్టడానికి ప్రణాళికలు రూపొందించారు రేవంత్ రెడ్డి. అయితే ప్రతి కేసులోనూ ఆరంభ శూరత్వం మాత్రమే కనిపిస్తోంది. అయితే ఈసారి ఫోట్యాపింగ్ వ్యవహారంలో కెసిఆర్ ను గట్టిగా ఫిక్స్ చేయాలని రేవంత్ రెడ్డి భావించారు. అందువల్లే ఈ కేసును సజ్జనార్ కు అప్పగించారు. దీంతో ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ప్రభాకర్ రావు నుంచి మొదలు పెడితే తిరుపతన్న వరకు అందరిని విచారించింది. కెసిఆర్ కు నోటీసులు కూడా



పంపింది.ఇటీవల కేసీఆర్ చాలా రోజుల తర్వాత మీడియా ముందుకు వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అంతేకాదు, ముఖ్యమంత్రి సొంత జిల్లాలో నిర్మించే పాలమూరు, రంగారెడ్డి పథకంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం తోలు తీస్తానని హెచ్చరించారు. అవసరమైతే ఉద్యమం కూడా చేపడతానని స్పష్టం చేశారు. అటు రేవంత్ రెడ్డి కూడా ఈ విమర్శలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ముందు నీకు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. దీంతో కేసీఆర్ అసెంబ్లీకి రావాలని ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. వాస్తవానికి 2023లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత కెసిఆర్ రెండు పర్యాయాలు మాత్రమే అసెంబ్లీకి వచ్చారు. సుదీర్ఘకాలం ఆయన వ్యవసాయ క్షేత్రానికి పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు అసెంబ్లీకి కేసీఆర్ రావడం చర్చకు దారితీస్తోంది. ఒకవేళ కెసిఆర్ గనక సభలో పూర్తిస్థాయిలో ఉంటే.. చర్చ అర్థవంతంగా సాగుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# ఫస్ట్ వీక్ లో కేబినెట్ విస్తరణ ?

- మొదటి పేజీ తరువాయి

ఉన్నారు. అదే సమయంలో డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్‌ను నియమించేందుకూ రేవంత్ కసరత్తు చేస్తున్నారు. అన్ని పదవులు భర్తీ చేసి.. కొత్త ఏడాదిలో ఫుల్ కేబినెట్‌తో ముందుకెళ్లాలని రేవంత్ భావిస్తున్నారు. మరి.. ఎవరికి ఏ పదవి దక్కుతుందనేది వెయిట్.. అండ్ సీ.

**43 లక్షల మందికి చేయూత పెన్షన్లు..**

బోగస్ పెన్షన్లు. ఇది ఎప్పటి నుంచో ఉన్న చర్చ. కానీ ఎవరూ కొలిక్కి తేలేని సమస్యగా మిగిలిపోయింది. అయితే రేవంత్ సర్కార్ సామాజిక భద్రతా పెన్షన్లలో అక్రమాలను అరికట్టేందుకు ఫోరెన్సిక్ ఆడిట్‌ను చేపట్టింది. పైలట్ ప్రాజెక్టులో ఇప్పటికే 10 శాతం అనర్హులు పెన్షన్లు పొందుతున్నట్లు గుర్తించారట. ఈ ఆడిట్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి..అర్హులైన పేదలకే లబ్ధి చేకూర్చాలనేది ప్రభుత్వం టార్గెట్‌గా చెబుతున్నారునాలుగు జిల్లాలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టును చేపట్టింది సర్కార్. ఇందులో భాగంగా దాదాపు 20 వేల మంది పెన్షనర్ల వివరాలను పరిశీలించగా..షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయట. ఈ శాంపిల్స్‌లోనే దాదాపు 2 వేల మంది అంటే 10 శాతం అనర్హులుగా తేలారట. వీరిలో చనిపోయిన వారి పేరుతో పెన్షన్లు తీసుకుంటున్న వారు, 50 ఏళ్లు కూడా నిండకుండానే వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్న యువకులూ ఉన్నారట. అంతేకాకుండా, ఎలాంటి శారీరక వైకల్యం లేకపోయినా నకిలీ సర్టిఫికెట్లతో దివ్యాంగ పెన్షన్లు పొందుతున్నట్లు బయటపడింది అంటున్నారు. దీంతో నెలకు కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం మిస్ యూజ్ అవుతోందని ప్రభుత్వం భావిస్తోందట.పైలట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన తనిఖీల్లోనే ఇన్ని బోగస్ పెన్షన్లు బయటపడితే.. రాష్ట్రవ్యాప్తంగా ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తే ఇంకా ఎన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తయిన తర్వాత అనర్హులుగా తేలిన వారందరినీ లబ్ధిదారుల జాబితా నుంచి



తొలగించడమే కాకుండా, ఇప్పటివరకు వారు అక్రమంగా పొందిన సొమ్మును రికవరీ చేయాలనే ఆలోచనలో కూడా ప్రభుత్వం ఉందట. అనర్హులను ఏరివేయడం ద్వారా మిగిలే నిధులను, కొత్తగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని, పెన్షన్లనూ పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.తెలంగాణలో ప్రస్తుతం 43 లక్షల మందికి చేయూత పెన్షన్లు అందిస్తుంది రేవంత్ సర్కార్. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..స్పెషల్ కేర్ తీసుకుని.. ఎయిడ్స్, దివ్యాంగులు, డయాలసిస్ పేషెంట్లకు కలుపుకుని కొత్తగా దాదాపు 20వేలకు పైగా పెన్షన్లు ఇస్తోంది. ఇలా వృద్ధులు, వితంతువులు, నేతన్నలు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులకు నెలకు 2,016 చొప్పున పెన్షన్ అందిస్తుండగా..దివ్యాంగులకు నెలకు 4,016 చెల్లిస్తున్నారు. ఇక డయాలసిస్ రోగులు సహా ఇతర దీర్ఘకాలిక రోగులకు నెలకు 5 వేల నుంచి 10 వేల వరకు పెన్షన్లు అందిస్తున్నారు. అయితే కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకారం సాధారణ పెన్షన్లను 4 వేలకు, దివ్యాంగుల పెన్షన్ ను 6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది కాంగ్రెస్. పెన్షన్లను పెంచే ముందు.. బోగస్ పెన్షన్ దారులకు షాక్ ఇవ్వాలని డిసైడ్ అయ్యిందట రేవంత్ సర్కార్.ఫోరెన్సిక్ ఆడిట్ అమలు చేస్తూ..ఫేషియల్ రికగ్నైజేషన్ టెక్నాలజీని వాడనుంది సర్కార్. ప్రస్తుతం పంచాయతీ సెక్రటరీ లేదంటే..పోస్ట్ ఆఫీసుల ద్వారా పెన్షన్లను ఇస్తున్నారు. ఇక పట్టణ ప్రాంతాల్లో అయితే నేరుగా.. లబ్ధిదారుని ఖాతాలో జమ అవుతుంది. ఇలా డైరెక్ట్ గా అకౌంట్లో పెన్షన్ నగదు జమ కావాలంటే..ప్రతి ఏడాది లైవ్ సర్టిఫికేట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అయితే..ఇక్కడ కింది అధికారుల కక్కుర్తితో.. చాలామంది నకిలీ లైవ్ సర్టిఫికేట్స్ అందించి..ఇప్పటికి పెన్షన్లు తీసుకుంటున్నట్లు సర్కార్ దృష్టికి వచ్చిందట. చనిపోయిన వారి పేరుపైనా ఇప్పటికీ కొందరు పెన్షన్లు తీసుకుంటున్నారట. దీంతో ఫేషియల్ రికగ్నైజేషన్ టెక్నాలజ్ తో..నిజమైన బెనిఫిషరీ ఎవరో తేలిపోనుందిఅంతేకాదు.. లబ్ధిదారుల్లో వృద్ధులు, నడువ లేని వారు ఉంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని..ప్రతి ఇంటికి వెళ్లి ఫేషియల్ రికగ్నైజేషన్ రికార్డ్ చేయనున్నారట. ఫిబ్రవరిలోపు ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేయాలని భావిస్తున్నారట సీఎం రేవంత్. లెక్క తేలిన తర్వాత..ఇటీవల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిన నేపథ్యంలో కొత్తగా అర్హత పొందిన వారి నుంచి పెన్షన్ దరఖాస్తులు స్వీకరించనుందట సర్కార్. వచ్చే బడ్జెట్ లో కొత్త పెన్షన్లకు ప్రత్యేక కేటాయింపులు చేయనున్నారట.ప్రస్తుతం ఉన్న బోగస్ పెన్షన్ దారుల లెక్క తేలిన తర్వాత.. అర్హులకు కొత్తగా పెన్షన్ మంజూరు చేయడంతో పాటు ఇప్పటికే పెన్షన్ అమౌంట్ ను పెంచాలనేది ప్రభుత్వ ఆలోచనగా చెబుతున్నారు. ఆ తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాన్నది రేవంత్ వ్యూహంగా కనిపిస్తోంది. మరి పెన్షన్ల ఏరివేతతో వచ్చే సవాళ్లను కాంగ్రెస్ సర్కార్ ఎలా ఫేస్ చేయబోతోందో చూడాలి.

# బంగ్లాదేశ్లో హిందువులపై దాడులను ఖండిస్తూ హైదరాబాద్లో నిరసన ర్యాలీ..

**హైదరాబాద్:**బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ తెలంగాణ భజరంగ్ సేన అధ్యక్షుడు లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో హైదరాబాద్లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ భజరంగ్ సేన ఆధ్వర్యంలో కాచిగూడ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులు బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న దౌర్జన్యాలను ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం బంగ్లాదేశ్ జెండాను దగ్దం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓం ప్రకాష్ మాట్లాడుతూ బంగ్లాదేశ్లో హిందువు అయిన దిపుదాస్ అనే వ్యక్తిని అతి క్రూరంగా హత్య చేసిన ఘటనను ఇక్కడ ఉన్న సెక్యులర్ వాదులు ఖండించకపోవడం దారుణమన్నారు.గాజా, పాలస్తీనాలో దాడులు జరిగితే రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే వారు, బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న దుష్కృత్యాలు వారికి కనిపించడంలేదా? అంటూ ప్రశ్నించారు. హిందూ సమాజ హక్కుల పరిరక్షణకోసం మానవ హక్కుల ఉల్లంఘనలపై గళమెత్తాలని పిలుపునిచ్చారు. బంగ్లాదేశ్లో జరుగుతున్న పరిణామాలపై అంతర్జాతీయ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న దౌర్జన్యాలను ఖండిస్తూ వచ్చే జనవరి మొదటి వారంలో ఢిల్లీలోని బంగ్లాదేశ్ ఎంబసీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# రైల్వే చార్జీల పెంపు స్వల్పమే!

- ప్రయాణికుల సంఘాలు

**హైదరాబాద్ సిటీ:** రైల్వేశాఖ కొత్తగా ప్రతిపాదించిన చార్జీల పెంపు ప్రభావం స్వల్పంగానే ఉందని ప్రయాణికుల సంఘాలు భావిస్తున్నాయి. శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చార్జీల ప్రకారం సికింద్రాబాద్ నుంచి చెన్నై, విశాఖపట్నం వైపు వెళ్లే పలు రైళ్లలో స్లీపర్, ఏసీ తరగతుల్లో రూ.10నుంచి గరిష్ఠంగా 15వరకు చార్జీలు పెరగడం పట్ల పేద, మధ్య



తరగతి ప్రయాణికుల నుంచి పెద్దగా వ్యతిరేకత కనిపించడం లేదని ఆయా సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. కిలోమీటర్‌కు స్వల్పంగా (1 లేదా 2పైసల) పెంపు ఉన్నప్పటికీ, సబ్‌అర్బన్ ప్రయాణికులు, సీజన్ టికెట్ దారులపై భారం పడకుండా చర్యలు తీసుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు.

**స్లీపర్, ఏసీ తరగతుల్లో..**

కొత్త స్లాబుల ప్రకారం సెకండ్ క్లాస్ సీటింగ్ ప్రయాణికులకు 216కి.మీ నుంచి 750 కిమీ దూరానికి టికెట్‌పై రూ.5, 751–1,250 కిమీ దూరానికి రూ.10, 1,251–1,750 కిమీ దూరానికి రూ.15, 1,751–2,250 కిమీ దూరానికి రూ.20 చొప్పున చార్జీలు పెరిగాయి. సికింద్రాబాద్ నుంచి చెన్నై, సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే పలు రైళ్లలో దాదాపు అన్ని తరగతుల్లోనూ పెరిగిన చార్జీ రూ.10నుంచి 15లోపే ఉండడం గమనార్హం.

# ప్రాణం మీదకు తెచ్చిన చైనా మాంజా..

- యువకుడి మెడకు తీవ్ర గాయం.. 19కుట్లు వేసిన వైద్యులు

**సికింద్రాబాద్:** నిషేధిత చైనా మాంజా మరోసారి వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ ఇంటర్ విద్యార్థి మెడకు మాంజా చిక్కుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన జీహెచ్‌ఎంసీ పరిధి కీసర డివిజన్ కేంద్రంలో శుక్రవారం జరిగింది. కీసరలో నివసించే



పిన్నింటి సుధాకర్‌రెడ్డి కుమారుడు జశ్వంత్‌రెడ్డి.. సెలవు రోజు కావటంతో ద్విచక్రవాహనంపై కీసర దాయర రోడ్డులో ఉండే తమ పొలం వద్దకు బయలుదేరాడు. గ్రామ శివారులోకి చేరుకోగానే, చెట్లపై నుంచి తెగి రోడ్డుకు అడ్డంగా వేలాడుతున్న మాంజాను గమనించకుండానే ముందుకు వెళ్లాడు. దీంతో ఆ దారం యశ్వంత్ మెడకు చుట్టుకుని రాపిడికి లోనై కోసుకుపోయి తీవ్ర రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. గాయం లోతుగా ఉండడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించి, సుమారు 19 కుట్లు వేశారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నిషేధం ఉన్నప్పటికీ మాంజా అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్న విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# జగన్, కేసీఆర్ మధ్య స్నేహసంకటం...

- మొదటి పేజీ తరువాయి

ప్రశ్నను సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఇది ఒక అస్త్రంగా మారింది.కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు తమ రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా పోరాడుతున్నారు. ఈ తరుణంలో కేసీఆర్ ప్రెస్ మీట్ పెట్టి.. "చంద్రబాబు తెలంగాణకు రావలసిన నీటిని అడ్డుకుంటున్నారు" అని ఆరోపించడం విశేషం. నిజానికి ఇది కేసీఆర్ చంద్రబాబుపై చేసిన విమర్శ అయినప్పటికీ, ఏపీ కోణంలో చూస్తే ఇది చంద్రబాబుకు లభించిన ఒక ప్రశంస. ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం చంద్రబాబు గట్టిగా నిలబడుతున్నారని, అందుకే పక్క రాష్ట్ర నేత ఆయనను తప్పుబడుతున్నారని ఏపీ ప్రజల్లో ఒక సానుకూల సంకేతం వెళ్లింది. ఒక రకంగా చెప్పాలంటే, ఏపీ ప్రయోజనాల పరిరక్షకుడిగా చంద్రబాబును కేసీఆర్ తన వ్యాఖ్యల ద్వారా ధ్రువీకరించారు.కేసీఆర్ ఏపీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేస్తున్నా, నీటి వాటాల విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య గొడవ జరుగుతున్నా జగన్ మౌనంగా ఉండడం లేదా కేసీఆర్‌తో దోస్తీ కొనసాగించడం వైసీపీకి మైనస్‌గా మారుతోంది. ఒకవైపు చంద్రబాబు రాష్ట్రం కోసం పోరాడి కేసీఆర్ చేత విమర్శలు చేయించుకుంటుంటే, జగన్ మాత్రం అదే కేసీఆర్‌తో ఫ్లెక్సీలు కట్టించుకుంటున్నారా? అనే చర్చ సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు కూడా కేసీఆర్–జగన్ స్నేహాన్ని గొప్పగా ప్రచారం చేయడం వ్యూహాత్మక తప్పిదంగా కనిపిస్తోంది. ఇది క్షేత్రస్థాయిలో ఉన్న తటస్థ ఓటర్లలో ప్రతికూల భావనను కలిగిస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రులను విమర్శించిన వ్యక్తితో చేతులు కలపడం జగన్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే ప్రమాదం ఉంది.రాజకీయాల్లో వ్యూహాలు వేర్వేరుగా ఉండవచ్చు, కానీ అవి రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు కాకూడదు. జగన్ తన రాజకీయ ఉనికి కోసం కేసీఆర్ అండను కోరుకుంటున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ఈ ఫ్లెక్సీలు, ప్రస్తుత పరిణామాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. జగన్ తన వైఖరిని స్పష్టం చేయకపోతే, జగన్ హయాంలో కేసీఆర్ మాట కోసమే ఏపీ ప్రయోజనాలను పణంగా పెట్టారు అనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లే అవకాశం ఉంది.కేసీఆర్ తన ప్రసంగంలో జగన్ పేరు ఎత్తకపోయినా, చంద్రబాబుకు క్రెడిట్ ఇవ్వడం ద్వారా పరోక్షంగా జగన్‌ను కార్నర్ చేశారు. రాజకీయంగా ఇది జగన్‌కు పెద్ద సవాలే. రాష్ట్ర సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న నీటి సమస్యల విషయంలో మౌనం వహించడం లేదా విభజన కారకులతో స్నేహం చేయడం వల్ల రాజకీయంగా మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంది. ఏపీలో మళ్లీ పట్టు సాధించాలంటే, జగన్ తన స్నేహం కంటే రాష్ట్ర ప్రయోజనాలే మిన్న అనే సంకేతాన్ని ప్రజల్లోకి బలంగా పంపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# గ్లోబల్ సిటీగా హైదరాబాద్

- మొదటి పేజీ తరువాయి



భవిష్యత్తులో కేంద్రం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లు భారీగా పెరిగే అవకాశం ఉంది.డిసెంబర్ 9న విడుదలైన ముసాయిదాపై ప్రజల నుంచి వెల్లువెత్తిన స్పందన, నగర పౌరుల చైతన్యానికి నిదర్శనం. రికార్డు స్థాయిలో 5,945 అభ్యంతరాలు రాగా, ప్రభుత్వం వాటిని సానుకూలంగా పరిశీలించింది. ఫలితంగా 30కి పైగా వార్డుల పేర్లు మారాయి. స్థానిక ప్రజల మనోభావాలకు అనుగుణంగా బాగ్ అంబర్‌పేట్, వనస్థలిపురం, మోండా మార్కెట్ తదితర చారిత్రక పేర్లను తిరిగి ఖరారు చేశారు. అలాగే నాలాలు, ప్రధాన రహదారులనే సరిహద్దులుగా మార్చుతూ, పాలనా సౌలభ్యం కోసం వార్డుల భౌగోళిక స్వరూపాన్ని సవరించారు.ఇంతటి భారీ ప్రక్రియలో రాజకీయ విమర్శలు సహజం. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు ఈ విభజనను తమకు అనుకూలంగా ఓటర్లను విభజించుకోవడమేనని విమర్శించాయి. ఈ వ్యవహారం హైకోర్టు మెట్లెక్కినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జెడ ప్రకారం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం స్పష్టం చేయడంతో ప్రభుత్వానికి లైన్ క్లియర్ అయ్యింది. ఇది ప్రభుత్వానికి లభించిన నైతిక, న్యాయపరమైన విజయంగా భావించవచ్చు.నగరం విస్తరించినంత మాత్రాన సరిపోదు, పాలన ప్రజల ముంగిట ఉండాలి. 300 వార్డులను సమర్థవంతంగా నిర్వహించడం ఇప్పుడు ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు. దీనికోసం ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12కి, 30 సర్కిళ్లను 60కి పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. అంటే ప్రతి 5 వార్డులకు ఒక సర్కిల్ ఆఫీస్ ఉండేలా ప్రణాళిక రచిస్తున్నారు. ఇది అమలైతే, పౌర సమస్యల పరిష్కారంలో జాప్యం తగ్గి, జవాబుదారీతనం పెరుగుతుంది.

# రహస్య జీవోల సంగతేంటీ..?

- మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉంచకుండా 'కాన్ఫిడెన్షియల్' కేటగిరీలో దాచేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఇది చీకటి పాలన అని, తాము అధికారంలోకి వస్తే ప్రతి జీవోను ప్రజల ముందు ఉంచుతామని హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరీ ఆశాజనకంగా ఏమీ లేదని గణాంకాలు చెబుతున్నాయి.తాజా గణాంకాల ప్రకారం, గత 13 నెలల్లో విడుదలైన 19,000 పైచిలుకు జీవోలలో కేవలం 17–18 శాతం మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు 82 శాతం జీవోలు ఇంకా రహస్య ఫోల్డర్లలోనే మగ్గుతున్నాయి. గత ప్రభుత్వంలో 50–60 శాతం దాచిపెట్టేవారని అనుకుంటే, ప్రస్తుత గణాంకాలు అంతకంటే ఎక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. బదిలీలు, ఆర్థిక వ్యయం వంటి అంశాలను ప్రజల కంట పడకుండా ఉంచేందుకు రహస్య జీవోల అస్త్రాన్ని ప్రభుత్వాలు వాడుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 ప్రకారం, ప్రభుత్వాలు తమ నిర్ణయాలను స్వచ్ఛందంగా బహిర్గతం చేయాలి. కానీ తెలంగాణలో మాత్రం జీవో కాపీ కావాలంటే కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ప్రజా ధనం, ప్రజా ప్రయోజనం ముడిపడి ఉంటాయి. అటువంటప్పుడు ఆ నిర్ణయాలను దాచాల్సిన అవసరం ఏమిటి అనే ప్రశ్న సామాన్యుడిలో ఉదయిస్తోంది. పారదర్శకత అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోతుందా అని పౌర సమాజం నిలదీస్తోందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనైనా ప్రస్తుత ప్రభుత్వం తన తీరు మార్చుకుంటుందా అనేది వేచి చూడాలి. గత ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ అధికారంలోకి వచ్చిన వారు, అవే తప్పులను కొనసాగించడం అంటే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమే అవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరి ప్రభుత్వం అన్నింటినీ పబ్లిక్ కు అందుబాటులో ఉంచుతుందా?

# బైకు దొంగను పట్టుకున్న స్థానికులు...

ఘట్కేసర్:స్థానికులు దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పటేల్నగర్ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి సుమారు 2:45 గంటల సమయంలో ఒక వ్యక్తి కాలనీలో పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని చోరీ చేయడానికి ప్రయత్నించాడు. దొంగ బైక్ స్టార్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలో శబ్దం రావడంతో బయటకు వచ్చా అప్రమత్తమై వెంటనే అతడిని పట్టుకున్నారు. వెంటనే ఘట్కేసర్ పోలీస్ స్టేషన్కు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొంగను తమ అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వార్తాతరంగాలు

ఆదివారం 28 డిసెంబర్ 2025

# కడియంను తప్పించేశారు..



**వరంగల్, డిసెంబర్ 27:**స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని అనర్హత వేటు నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కడియం శ్రీహరి 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి స్టేషన్ ఘన్ పూర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే ఆయన తర్వాత తన కుమార్తె కావ్యతో కలసి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయాన్ని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు గుర్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అప్పటి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారంటూ అప్పటి ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. దీంతో పాటు కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఫొటోలను కూడా వైరల్ చేస్తున్నారు.బీఆర్ఎస్ నుంచి గత ఎన్నికల్లో గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటీషన్లను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలతో స్పీకర్ గడ్డం ప్రసాదరావు విచారణ ప్రారంభించారు. ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే తొలి నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై అనర్హత వేటు పడుతుందని భావించారు. దానం నాగేందర్ నేరుగా 2024 లో జరిగిన ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయగా, కడియం శ్రీహరి కుమార్తె కావ్య వరం

# కేటీఆర్ తన తప్పులు తెలుసుకోవాలి....

**దానం నాగేందర్**



**హైదరాబాద్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గెలిపించడం , ఓడించడం అనేది ప్రజలు చూసుకుంటారని... మొదట కేటీఆర్ చేసిన తప్పులను తెలుసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిని ఏక వచనంతో మాట్లాడింది బిఆర్ఎస్ నాయకులే అని దానం అన్నారు. ముఖ్యమంత్రి పదవికి గౌరవం ఇవ్వాలని , అది మరిచి విమర్శలు చేస్తే , ప్రతి విమర్శలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని దానం హెచ్చరించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ తో కలిసి దానం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... కేటీఆర్ వ్యక్తిగత విమర్శలు పక్కన పెట్టి , కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. ఇద్దరు మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్నారని... వాళ్ళు కేంద్ర మంత్రుల లేక రాష్ట్ర మంత్రుల స్పష్టత ఇవ్వాలన్నారు. హోంశాఖ సహాయ మంత్రి అయిన బండి సంజయ్ పరిధిలోనే దర్యాప్తు సంస్థలు ఉంటాయని... అవినీతిపై ఆధారాలు ఉంటే విచారణ చేపట్టాలని దానం తెలిపారు.

**కార్యకర్తలే నా బలం**

తన బలం కార్యకర్తలే అని... ఈ స్థాయిలో తాను ఉన్నానంటే వారి వల్లే అని దానం అన్నారు. తాను రాజీనామా చేయడానికి , ఉపఎన్నికల్లో పోటీ చేయడానికి ధైర్యం తన కార్యకర్తలే అని తెలిపారు. వారి అండతోనే 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని ... ఉపఎన్నిక వస్తే కూడా గెలుస్తా అని దానం స్పష్టం చేశారు.

# బిఆర్ఎస్ వైపు చూస్తున్న రామగుండం ప్రజలు...

**బిఆర్ఎస్ పార్టీ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ..**



**గోదావరిఖని:** సమస్యలపై పోరాడుతున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి సమక్షంలో పలువురు చేరికలు.. రామగుండం నియోజకవర్గ ప్రజలు బిఆర్ఎస్ వైపు కెసిఆర్ ని ముఖ్యమంత్రిగా ఎప్పుడు చూద్దామా అని ఎదురుచూస్తున్నారు.

రామగుండంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చేస్తున్న అరాచకపు పాలన చరమగీతం పాడేందుకు సన్నద్ధులై ఉన్నారని రాష్ట్రంలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా చేసేందుకు ఎదురుచూస్తున్నారని బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి పేర్కొన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో శనివారం జరిగిన కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్ ను హరీష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా సమస్యలపై బలంగా పోరాడుతున్న బిఆర్ఎస్ పార్టీ లోకి ఈ ప్రాంత(టిఆర్ఎస్.డి) కార్పొరేషన్ ప్రెసిడెంట్ నీలం బిక్షపతి తదితరులు వ్యాల్ల హరీష్ రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ... రామగుండంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రజలను మానసికంగా వేధిస్తూ షాపులు ఇండ్లు కూల్చివేస్తూ అరాచక పాలన సాగి స్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో తగిన మూల్యం అధికారులు చెల్లించుకుంటారని, ఇప్పటికే రామగుండం ప్రజలు బిఆర్ఎస్ పార్టీ వైపు, రాష్ట్రంలో కేసీఆర్ ను ముఖ్యమంత్రిగా చూసేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు. రామగుండంలో ఎమ్మెల్యేను చిత్తుగా ఓడించేందుకు ప్రజలు నిర్ణయం తీసుకున్నారని, భవిష్యత్తులో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాడేందుకు ప్రజలు సహకరించి కలిసి రావాలని కోరారు. ఇకనుండి రామగుండంలో ఎలాంటి ఆపద వచ్చిన ఏ చిన్న షెడ్డును అభివృద్ధి పేరిట కూల్చివేతకు అధికారులు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు తీసుకువచ్చిన నోటీసు ఇవ్వకుండా ఇబ్బంది పరిస్తే ఎదురు తిరగాలని మీకు అండగా న్యాయపరంగా పోరాడేందుకు అండగా నిలుస్తానని హరీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎక్కడ ఉన్న చిరు వ్యాపారులు సింగరేణి స్థలాల్లో నిర్ణయించుకున్నా ఇండ్లు దుకాణాలను తొలగించే అధికారం సింగరేణి కి, మున్సిపల్ అధికారులకు కూడా లేదని అన్నారు. కార్మికులు ఈ ప్రాంత అభివృద్ధి దృష్ట్యా భూమి పొరల్లోకి వెళ్ళు రక్తాన్ని చిందిస్తూ వెనుకాడకుండా దేశానికి వెలుగులు పంచుతున్నారని ఈ ప్రాంత అభివృద్ధికి ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జహీద్ పాషా, మాజీ కార్పొరేటర్లు ఎన్వి రమణారెడ్డి, బొబ్బిలి సతీష్, మెరుగు చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ నర్సింగ్, మహిళ ఉద్యమకారిణి పర్శ స్వాతి, యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మడిశెట్టి రవీందర్, అల్లి గణేష్, శ్రీ హరి, బోట్ల పోషం, నీలం భిక్షపతి, నడిపల్లి సాయి, ఎండీ.అతహరుద్దిన్, రహమాన్, గొర్రె నర్సింగ్, గొర్రె శంకర్, యువరాజ్ నేత, ఉదయ్, శ్రీనివాస్ రావు, బొడ్డుపల్లి రాజు, మోబిన్, కొండ సురేష్, పోయిల రవి, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ కేసీఆర్, కేటీఆర్..



**హైదరాబాద్, డిసెంబర్ 27:**తెలంగాణ రాజకీయ యవనికపై పెను ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సిట్ అధికారుల విచారణ ముగిసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెండు వారాల పాటు ఆయన్ను తమ కస్టడీలో ఉంచుకుని విచారించిన సిట్, గడువు ముగియడంతో ఇవాళ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి ఆయన్ను విడుదల చేసింది. అయితే, ప్రభాకర్ రావు విడుదలతో ఈ కేసు ముగిసిపోలేదని, అసలు కథ ఇప్పుడే మొదలైందన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. ప్రభాకర్ రావు నుంచి రాబట్టిన సమాచారం ఆధారంగా దర్యాప్తు సంస్థ తదుపరి అడుగులు వేయబోతోంది. గులాబీ బాస్ కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ట్రబుల్ షూటర్ హరీశ్ రావుల మెడకు ఈ కేసు ఉచ్చు బిగుస్తోందనే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ నెల 12న సిట్ ఎదుట లొంగిపోయిన ప్రభాకర్ రావును అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. ప్రధానంగా ఆయన ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో జరిగిన అక్రమ నిఘా, ఫోన్ల ట్యాపింగ్, హార్డ్ డిస్కుల ధ్వంసం వంటి అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. విచారణలో ఆయన తొలుత అధికారులకు సహకరించలేదని, సమాధానాలు దాటవేసే ప్రయత్నం చేశారని సమాచారం. దీంతో సిట్ అధికారులు తమ వ్యూహాన్ని మార్చి, ఇప్పటికే కస్టడీలో ఉన్న మరో నిందితుడు, మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుతో కలిపి ప్రభాకర్ రావును విచారించారు. ప్రణీత్ రావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ప్రభాకర్ రావును ప్రశ్నించినప్పుడు, కొన్ని కీలక విషయాలపై ఆయన మౌనం వహించారని, మరికొన్నింటికి పొంతన లేని సమాధానాలు చెప్పారని తెలుస్తోంది.సిట్ ప్రధానంగా ఫోకస్ చేసిన అంశం.. ప్రభాకర్ రావు రీ-అపాయింట్మెంట్. ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత కూడా, నిబంధనలకు విరుద్ధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయన్ను ఎస్ఐబీ చీఫ్‌గా ఎందుకు నియమించింది? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. కేవలం రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టడానికే ఈ నియామకం జరిగిందా అనే కోణంలో సిట్ ఆరా తీసింది. దీనికి తోడు, అప్పటి మంత్రి హరీశ్ రావుతో ప్రభాకర్ రావు తరచూ ఎందుకు భేటీ అయ్యారన్న ప్రశ్నపై ఆసక్తికర చర్చ నడిచింది. "మావోయిస్టుల ముప్పు, నక్సల్స్ కార్యకలాపాల గురించి వివరించడానికే హరీశ్ రావును కలిసేవాడిని" అని ప్రభాకర్ రావు సమర్థించుకున్నట్లు తెలిసింది. అయితే, మావోయిస్టుల అంశం హోంమంత్రి లేదా సీఎం పరిధిలోకి వస్తుంది తప్ప, ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్ రావుకు ఇందులో సంబంధం ఏముంటుందన్నది సిట్ అనుమానం. దీని వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయన్నది అధికారుల ప్రాథమిక అంచనా.ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో నడుస్తున్న హాట్ టాపిక్ ఇదే. ప్రభాకర్ రావు వంటి సీనియర్ అధికారి, ప్రభుత్వంలోని పెద్దల ఆదేశాలు లేకుండా ఇంతటి భారీ ఆపరేషన్ నిర్వహించే సాహసం చేస్తారా? అనేది సామాన్యుడికి కూడా వచ్చే సందేహం. ఈ కేసులో 'కింగ్ పిన్'లు తెరవెనుక ఉన్నారని, అధికారులు కేవలం పావులేనని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే సిట్ తదుపరి చర్యలు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుల వైపు మళ్లినట్లు స్పష్టమవుతోంది.విశ్వసనీయ సమాచారం ప్రకారం, ప్రభాకర్ రావు విచారణలో వెల్లడైన అంశాలు బీఆర్ఎస్ అగ్రనేతలకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ప్రతిపక్ష నేతలు, సొంత పార్టీలోని రెబల్స్, జర్నలిస్టులు, వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసి, ఆ సమాచారాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకున్నారన్న ఆరోపణలకు బలం చేకూర్చే సాక్ష్యాలను సిట్ సేకరించినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే, అతి త్వరలోనే కేటీఆర్, హరీశ్ రావులకు, ఆ తర్వాత కేసీఆర్‌కు కూడా విచారణ నోటీసులు జారీ చేసే అవకాశాలను కొట్టిపారేయలేం.

# ఎకనామిక్ కారిడార్ రెడీ...

## ఏప్రిల్లో ప్రారంభానికి ముహూర్తం.....



**హైదరాబాద్, డిసెంబర్ 27:**హైదరాబాద్ నగరాన్ని మధ్య భారతదేశంతో కలిపే హైదరాబాద్-ఇండోర్ ఆర్థిక కారిడార్ పనులు తుది దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ఈ రహదారి అందుబాటులోకి రానుంది. దీనివల్ల ప్రస్తుతం పట్టే 18 గంటల ప్రయాణ సమయం కేవలం 11 గంటలకు తగ్గుతుంది. తెలంగాణలో 100 కిలోమీటర్ల మేర సాగే ఈ రహదారి.. సంగారెడ్డి నుండి బోధన్ మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. పారిశ్రామిక నగరమైన ఇండోర్‌ను ఐటీ హబ్ హైదరాబాద్‌తో నేరుగా అనుసంధానించడం ద్వారా వాణిజ్య రంగానికి పెద్ద పీట వేయనున్నారు. నర్మదా నదిపై వంతెనలు, సొరంగాల నిర్మాణం పూర్తి కావస్తుండటంతో.. త్వరలోనే ఈ వేగవంతమైన ప్రయాణ సౌకర్యం ప్రజలకు అందుబాటులోకి రానుంది.హైదరాబాద్ నగరాన్ని మధ్య భారతదేశంలోని పారిశ్రామిక కేంద్రమైన ఇండోర్‌తో అనుసంధానించే హైదరాబాద్-ఇండోర్ ఆర్థిక కారిడార్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది మొదటి భాగంలో.. అంటే ఏప్రిల్ నాటికి ఈ రహదారి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నుంచి ఇండోర్ వెళ్లడానికి పట్టే సమయం 18 గంటల నుంచి కేవలం 11 గంటలకు తగ్గుతుంది. అంటే దాదాపు 7 గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ఈ 695 కిలోమీటర్ల పొడవైన రహదారి మహారాష్ట్రలోని నాందేడ్, అకోలా వంటి నగరాల మీదుగా సాగుతుంది. తెలంగాణలో ఈ రహదారి సుమారు 100 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మన రాష్ట్రంలో బోధన్, ఎల్లారెడ్డి మీదుగా సంగారెడ్డికి చేరుకుని.. అక్కడి నుంచి జాతీయ రహదారి 65 ద్వారా హైదరాబాద్‌కు అనుసంధానమవుతుంది.హైదరాబాద్ నగరం ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. ఈ కొత్త ఆర్థిక కారిడార్ రాకతో నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇండోర్ నగరం ఉత్తర భారతదేశానికి ప్రధాన రవాణా కేంద్రంగా ఉంది. ఈ రహదారి ద్వారా హైదరాబాద్‌కు ఇండోర్‌తో నేరుగా సంబంధం ఏర్పడటం వల్ల వస్తువుల రవాణా సులభతరం అవుతుంది. ముఖ్యంగా ఫార్మా ఉత్పత్తులు, ఐటీ పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ సమయంలో ఉత్తరాది రాష్ట్రాలకు చేరవేయవచ్చు. దీనివల్ల హైదరాబాద్ పరిసరాల్లో మరిన్ని గిడ్డంగులు (గోడౌన్లు), రవాణా కేంద్రాలు ఏర్పడతాయి.తెలంగాణలో ఈ కారిడార్ సంగారెడ్డి వద్ద ముగుస్తుంది. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాంతీయ రింగ్ రోడ్డు కూడా సంగారెడ్డి మీదుగానే వెళ్తుంది. దీనివల్ల ఈ ఆర్థిక కారిడార్ నుంచి వచ్చే వాహనాలు నగరం లోపలికి రాకుండానే ఇతర జిల్లాలకు వెళ్లే వెసులుబాటు కలుగుతుంది. ఇది నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే కాకుండా.. సంగారెడ్డి, బోధన్ వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి భారీ ఊతం ఇస్తుంది.ఈ రహదారి వెంబడి కొత్త పారిశ్రామిక మండలాలు ఏర్పడే అవకాశం ఉంది. తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలైన బోధన్, ఎల్లారెడ్డి వంటి చోట్ల చిన్న తరహా పరిశ్రమలు స్థాపించడానికి పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతారు. వేగవంతమైన రవాణా సౌకర్యం ఉండటం వల్ల తయారీ రంగానికి కొత్త ప్రాణం పోసినట్లవుతుంది.హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ గురుద్వారాకు వెళ్లే భక్తులకు.. అలాగే మధ్యప్రదేశ్ వెళ్లే పర్యాటకులకు ఈ రహదారి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రయాణ సమయం తగ్గడం వల్ల పర్యాటకుల రాకపోకలు పెరిగి పర్యాటక రంగం ద్వారా ఆదాయం లభిస్తుంది. చివరిగా.. ఈ ప్రాజెక్టులో భాగంగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో నిర్మిస్తున్న భారీ సొరంగాలు.. నర్మదా నదిపై వంతెనల నిర్మాణం వల్ల పనులు కొంత ఆలస్యమయ్యాయి. అయినప్పటికీ.. ఏప్రిల్ 2026 నాటికి ఈ రహదారిని ప్రారంభించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా గెలిచిన సర్పంచ్ లకు సన్మాన కార్యక్రమం

**ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్:**ఈకార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి,ఎమ్మెల్సీ బలమురి వెంకట్, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, హుజూరాబాద్ ఇంచార్జి ఓడితల ప్రణవ్, మాజీ ఎమ్మెల్యే లు కోడూరీ సత్యనారాయణ,ఆరేపల్లి మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సుడ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల నరేందర్ రెడ్డి, ఆర్టీఏ సభ్యులు పడాల రాహుల్,రింకు,ఇతర ముఖ్య నేతలు..

**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.**

కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన సర్పంచ్ లకు అభినందనలు ప్రభుత్వం,పార్టీ మీకు అండగా ఉంది.కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రతినిధులుగా మీకు బాధ్యతలు ఉంటాయి గ్రామానికి సంబంధించిన అన్ని విషయాల్లో ప్రజలు మిమ్మల్ని చూస్తారు.ప్రభుత్వ పథకాలు రావడంలో, ఇతర కష్టాల సమయంలో మీరు అండగా ఉండాలి. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ సహకార సంఘాల,ఎన్నికల్లో శాసన సభ,పార్లమెంట్ ఎన్నికల్లో మీరు ఉండాలిఎన్నికలు జరగకుండా ఆగిపోయిన నిధులు వస్తాయి..ముఖ్యమంత్రి గ్రామాలకు నిధులు ఇస్తామని చెప్పారు. శాసన సభ్యుల నిధులు ఇస్తారు.వేసవికాలంలో గ్రామాలకు తాగునీటి కి ఇబ్బందులు లేకుండా సమీక్ష చేసుకొని సమస్య పరిష్కారం చేసుకోవాలి.గ్రామాల్లో శానిటేషన్, స్ట్రీట్ లైట్స్, ప్లాంటేషన్, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు విద్యకు ప్రాధాన్యత కల్పిస్తుంది.స్కూల్ లో విద్యార్థులు, టీచర్లు వస్తున్నారా అని చూసుకోవాలి మీ గ్రామాలకు ప్రైవేట్ పాఠశాల బస్సులు రాకుండా చూసుకొని ప్రతి పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలలో చదివేలా చూడాలి. మంచి అనుభవమున్న టీచర్లు, మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం ది.మన జిల్లాకు సంబంధించిన కాళేశ్వరం కూలిపోతే ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సి వస్తుందని పక్కదారి పట్టిస్తున్నారు.మహాత్మా గాంధీ పేరు మీద ఉన్న ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు..పేరు తీసేసి జీ రామ్ జీ అని పేరు పెడుతున్నారు.నెహ్రూ, ఇందిరా గాంధీ ల పేర్లు వారి చరిష్మా చెరిపేయాలని చూస్తున్నారు.వాళ్ళు వేసిన ప్రాజెక్టులు, కేంద్ర సంస్థలు, గరిభి హటావో లాంటి పథకాలు ఈ దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లాయి.జాతిపిత మహతా గాంధీ స్వాతంత్ర్యం కోసం పోరాడితే ఆయనను చంపిన గాడ్సే ను ఆరాధిస్తున్నారు.నేడు ఉపాధి హామీ కార్యక్రమాల దగ్గర గాంధీ చౌరస్తా ల వద్ద గాంధీల ఫొటోలు పెట్టుకొని నేడు ప్రతి గ్రామంలో నిరసన తెలపాలి.జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఐక్యంగా పని చేద్దాం.మీకు అండగా ఉంటాం..మీ వెంట ఉంటాం కాంగ్రెస్ కుటుంబం ఉంది మరింత శ్రమించండి.ఓడిపోయిన వాళ్ళతో సమావేశం ఏర్పాటు చేస్తాం వారికి కూడా పార్టీ పరంగా అండగా ఉంటాం.గెలిచిన సర్పంచ్ లకు ముఖ్యమంత్రి, పీసీసీ పక్షాన అభినందనలు శుభాకాంక్షలు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి



**ద్వారకా తిరుమల:**భీమడోలు మండలం సూరప్పగూడెం సమీపంలో శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో డెకరేషన్ పనులు చేస్తూ జీవిస్తున్న ముగ్గురు యువకులు మృతి చెందారు. ద్వారకాతిరుమల ప్రాంతానికి చెందిన సైదు రఫీ , అదే ప్రాంతానికి చెందిన కొయ్యగూర శ్రీరామ్ బన్నీ , తిమ్మాపురం గ్రామానికి చెందిన మాండ్రాజు చరణ్ 26, ముగ్గురు యువకులు ఫ్లవర్ డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరు ముగ్గురు కలిసి డెకరేషన్ పువ్వులు హోల్సేల్ గా కొనేందుకు శనివారం తెల్లవారుజామున ఏలూరు వచ్చారు తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

# ఎల్లప్పుడూ అప్రమత్తంగా వుండాలి

**పోలీసు పరేడ్ లో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్**

**సిద్దిపేట:**పరేడ్ గ్రౌండ్స్లో పోలీస్ పరేడ్ను నిర్వహించడం జరిగింది. అదనపు డిసిపి ఏఆర్. సుభాష్ చంద్రబోస్ ఈ పరేడ్ను పర్యవేక్షించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం అత్యంత ప్రధానమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి నిరంతర సాధన అవసరమని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు చేరువగా ఉంటూ, తక్షణ సహాయం అందించడంలో ముందుండాలని సిబ్బందిని కోరారు.

# లోకకళ్యాణార్థమే నారసింహుడి కళ్యాణం...







**మహిమాన్విత శక్తితో కరుణించాలి...**

**మేళ తాళలు వేదమంత్రోచ్ఛరణల తో కళ్యాణం...**

**హాజరైన ఎమ్మెల్యే దంపతులు...**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 27( స్కై న్యూస్)** లోక కళ్యాణార్థమే యాదాద్రి లక్ష్మీ నరసింహుడి ఆలయ అర్చకులు కళ్యాణం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సరితా రాజేష్ రెడ్డి తెలిపారు శనివారం ధార్మిక కార్యక్రమాలలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన లక్ష్మీనరసింహుడి కల్యాణ మహోత్సవానికి భక్తులు పరిసర గ్రామాల ప్రజలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ విగ్రహాల ఊరేగింపుకు కాలనీవాసులు ప్రజలు భక్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించగా వేద పండితులు మేళ తాళాల మధ్య మంత్రోచ్చారణలతో నిర్వహించిన కళ్యాణం కమనీయంగా కనుల విందుగా సాగింది. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ యాదాద్రి పాలకమండలి తెలంగాణ రాష్ట్రంలో రెండు ప్రాంతాలలో కళ్యాణ నిర్వహించాలని నిర్ణయించుకొని మొదటగా భూపాలపల్లిలో అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో కళ్యాణం నిర్వహించడం ఈ ప్రాంత ప్రజల పూర్వజన్మ సుకృతం అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందిన తాను లక్ష్మీ నరసింహడి కళ్యాణం ఈ ప్రాంత ప్రజల మధ్య నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మహిమాన్విత శక్తి స్వరూపులు లక్ష్మీనరసింహస్వామి కరుణాకటాక్షాలు ఈ ప్రాంత ప్రజలపై ఉండాలని ప్రజలంతా సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో జీవించే విధంగా మనసారా కరుణించాలని స్వామిని ప్రార్థించారు. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయడం జరుగుతుందని నిత్య దూప దీప నైవేద్యాలతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కోరారు అనంతరం పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి యాదాద్రి పాలకమండలి సభ్యులు మరియు మాజీ కౌన్సిలర్ బాదం సునీత నరేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విడుదొడ్డి సురేష్ మరియు మాజీ కౌన్సిలర్లు ముఖ్య నేతలు భక్తులు అశేషంగా పాల్గొన్నారు

# వైఖరి విడనాడకపోతే ఇంటిని ముట్టడిస్తాం...



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 27 (స్కై న్యూస్)** నియోజకవర్గంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరరావు తన నియంతృత్వ ధోరణి విడనాడకపోతే ఈనెల 30న హలో బహుజన చలో వట్టిపల్లి గ్రామాన్ని నిర్వహించి ఆయన ఇంటిని ముట్టడిస్తామని బీఎస్పీ జోనల్ ఇంచార్జ్ బండి పృథ్వీరాజ్ హెచ్చరించారు శనివారం గ్రామాన్ని సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రాజేశ్వరరావు ప్రజల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తూ దుర్భాషలాడుతూ భూములు ఆస్తులు కలిగి ఉన్నాడని వెంటనే అట్టి భూములను ఆస్తులను పేదలకు గతంలో అమ్మిన రిజిస్ట్రేషన్ చేయకుండా వేధిస్తున్నాడని ఆరోపించారు. గ్రామంలో ప్రజలకు అమ్మిన భూములను ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకపోతే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు గ్రామానికి చెందిన ఆంజనేయులుకు సర్వే నెంబరు ఒకటిలో 380 గజాల ప్లాటును దాదాపు 30 సంవత్సరాల క్రితం విక్రయించడం జరిగిందని అతను కూడా బ్యాంకులో పాస్బుక్ పొదువ పెట్టి రుణాన్ని కూడా తీసుకోవడం జరిగిందని ఇట్టి భూమిని స్వాధీనం చేసుకున్నందుకు కుట్రలు చేస్తున్నాడని ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేసిన స్వామికి సపోర్ట్ చేశారని దాన్ని దృష్టిలో ఉంచుకొని దళితులను బూతులు తిడుతున్నారని వివరించారు ఆస్తులు కుదోపెట్టి రుణాలు తీసుకున్న వారిని మోసం చేయడం తగదని అన్నారు ఎవరి ఆస్తులను వారికి రిజిస్ట్రేషన్ చేయకపోతే తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. పోలీస్ మరియు రెవెన్యూ అధికారులు పేదలపై బడుగు బలహీన వర్గాల వారిపై అక్రమ కేసులు నమోదు చేయవద్దని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కళ్యాణ్ అచ్చంపేట అసెంబ్లీ ఇన్చార్జి కృపానందం మండల అధ్యక్షుడు బాలనాగులు నాయకులు నాగరాజు శివ రాజశేఖర్ గ్రామస్తులు ఎత్తకు విష్ణు కుమార్ చెన్నయ్య తిరుపతయ్య వెంకటేష్ సాయిలు తదితరులు పాల్గొన్నారు

# హక్కులను హరించే కొత్త జీవోను సవరించాలి...

**జీవో 252 తో పాత్రికేయ సమాజానికి తీరని నష్టం.....**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 27( స్కై న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కులను హరించే విధంగా జారీ చేసిన జీవో నెంబర్ 252 సవరించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు హెచ్ 143 మరియు తెలంగాణ జర్నలిస్టు ఫోరం మరియు తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ జర్నలిస్ట్ సంఘాలు శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ నిరసన, ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జర్నలిస్టు పాలసీని ప్రకటిస్తూ జారీ చేసిన జీవో 252 జర్నలిస్టు సమాజానికి తీరని నష్టం కలిగిస్తుందని ఆ సంఘాల నాయకులు అన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 జిల్లా అధ్యక్షుడు ఎం చంద్రశేఖర రావు, రాజేష్ గౌడ్, శేఖరా చారి,తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్, సత్యం తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడేషన్ పాలసీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో డెస్క్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు రద్దు చేయడం, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులక్రిడేషన్లను కుదించడం ద్వారా జర్నలిస్టుల హక్కులను హరించడమే అవుతుందన్నారు. రెండు కార్డుల సిద్ధాంతంతో జర్నలిస్టుల మధ్య చిచ్చుపెట్టే విధానాన్ని మానుకోవాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. లోపా భూ ఇష్టమైన జీవో 252 తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్రంలో గతంలో 23 వేల మంది జర్నలిస్టులకు ఇచ్చిన విధంగా ప్రస్తుతం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తూ అక్రిడేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టుల హక్కులకు అనుగుణంగా ఉన్న గత జీవో 239 స్ఫూర్తికి గండి కొట్టే విధంగా ప్రస్తుతం తీసుకొచ్చిన కొత్త జీవో 252 ఉందనీ దానిని సవరించాల్సిన అవసరం ఎంతైనా






ఉందన్నారు.ఈ జీవోను వెంటనే రద్దు చేసి జర్నలిస్టులు అందరికీ ఒకే విధానాన్ని కొనసాగించాలన్నారు .అక్రిడేషన్లకు కోతలు పెట్టడం జర్నలిస్టుల మధ్య చిచ్చు పెట్టడం వంటి చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జీవో నెంబర్ 252 ద్వారా పత్రికలు, పత్రికా రంగానికి ఎలక్ట్రానిక్ మీడియా రంగానికి కేబుల్ టీవీ జర్నలిస్టు రంగానికి కూడా సమస్యగా పరిగణమించే ప్రమాదం ఉన్నందున ఈ జీవో ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి జీవో 252ను సవరించి జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలను అడ్డుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలను సాగిస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏవో చంద్రశేఖర్ కు జీవో 252 ను రద్దు చేయాలని, రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 జాతీయ నాయకులు జెమిని సురేష్, హాదేకార్ ఉమా శంకర్, రాష్ట్ర నాయకులు వంగ శ్రీనివాస్ గౌడ్, నాగశేషి లతోపాటు ఫోటో వీడియో జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు కపిలవాయి రాజు లతోపాటు సీనియర్ జర్నలిస్టులు రామ లక్ష్మయ్య, అహ్మదుల్లా ఖాన్, మహమ్మద్ సాజిద్, ఆవుల భాస్కర్ బాబు, పులిజాల సత్యం, బాలస్వామి, లాలయ్య, సుధాకర్ రెడ్డి, రామకృష్ణ, మాసయ్య, సునిగిరి సురేష్, మహమ్మద్ సాదిక్, మహమ్మద్ ఇర్ఫాన్, రమేష్, మహమ్మద్ రహీం, విజేందర్ రెడ్డి, డెస్క్ జర్నలిస్టులు నరసింహ యాదవ్, కేబుల్ టీవీ జర్నలిస్టులు 19% జ% శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్ట్ ల ధర్నాకు టిడబ్ల్యూజెఎఫ్ మద్దతు**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 ఆధ్వర్యంలో జీవో 252 ను నిరసిస్తూ శనివారం నిర్వహించిన నిరసనకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ప్రత్యక్ష ఆందోళనలో ఆ సంఘం నాయకులు టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కో కన్వీనర్ రవికాంత్ పులిజ్వాల, కిషోర్ వెంకట్ శివ తిరుపతి, సైదులు, మహమ్మద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ ఆశీస్సులు అందరిపై ఉండాలి...

**హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాకు చాదర్ సమర్పణ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 16:-** రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ పట్టణంలో ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రముఖ పుణ్యక్షేత్రం అజ్మీర్ లోని హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ ఉర్సు ఉత్సవాల సందర్భంగా భక్తులు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా కలిసారు ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గా కోసం చాదర్ ను భక్తుల సమక్షంలో సమర్పించారు ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమర్పించిన చాదర్ ను హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ చిష్తీ రహమతుల్లాహ్ అలైహ్ అజ్మీర్ షరీఫ్ దర్గాకు తీసుకు వెళు న్నట్లు నిర్వాహకులు తెలిపారు, ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ భక్తులపై ప్రజలందరిపై హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఎమ్మెల్యే శంకర్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సయ్యద్ హబీబ్, మహమ్మద్ హమీద్, జాంగిర్, సయ్యద్ షబ్బీర్ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ముబారక్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు

# లోకపల్లి తిమ్మప్ప ఆలయానికి రోడ్డు వేయాలి...

**:ఫారెస్ట్ అధికారికి వినతి**



**నారాయణపేటడిసెంబర్27స్కైన్యూస్:**నారాయణపేట మండలం లోకపల్లి కలియుగ దైవం లోకపల్లి శ్రీతిమ్మప్ప స్వామి ఆలయానికి అసంపూర్తిగా ఉన్న రొడ్డును వేయాలని గ్రామ సర్పంచ్ చంద్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు శనివారం జిల్లా అటవీ అధికారికి వినతి పత్రం సమర్పించారు. లోకపల్లి నారాయణపేట జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో కొండపై వెలసిన తిమ్మప్ప స్వామి జాతర ఉత్సవాలు 2026 ఫిబ్రవరి 1,2,3 తేదీలలో జరుగుతాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థమై దేవాలయము కొండ క్రింది భాగం నుండి దేవాలయం వరకు దాదాపు 400 మీటర్లు గల రోడ్డు సౌకర్యము ఇదివరకే భక్తులు ఇచ్చిన కానుకలచే, గ్రామస్తుల కృషితో బిటి రోడ్డును ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు. కానీ దేవాలయము వెనుక భాగంలో అటవీ శాఖ పరిధిలోగల ఈకో పార్క్ పనుల నిమిత్తము భారీ వాహనాలు వెళ్లడం ద్వారా ఆ రోడ్డు మార్గం గుంతలు పడడం ద్వారా స్వామివారి దర్శనార్థమై వచ్చే భక్తులకు గాని, పార్క్ సందర్శనార్థమై వచ్చే ప్రజలకు గాని వాహనా లు కింద పడడం ,మరి కొన్ని వాహనాలు ప్రమాదాలకు గురి అవుతున్నాయని తెలిపారు. వాటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే స్వామివారి జాతర ఉత్సవాలకు భక్తుల కు ఆటంకం ఏర్పడకుండా రోడ్డు వేయించాలని డి ఎఫ్ ఓ కమాలుద్దిన్ ను కోరారు.అందుకు స్పందించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కమలావుద్దీన్ సానుకూలంగా స్పందించి ప్రస్తుతం రోడ్డు మార్గానపడ్డ గుంతలను పూర్తి చేయడం, దేవాలయము వెనుక సిసి మార్గమును పూర్తి చేయుటకు చర్యలు తీసుకుం టామని తెలిపారు.ఈ కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్ వార్డు మెంబర్స్ లడ్డి రమేష్, గ్రామ పెద్దలు బండ గుండ పెద్ద రాంరెడ్డి, బోస్లె శ్రీనివాసరావు, వేముల మధుసూదన్ రెడ్డి మరియు గ్రామ యువకులు దేశాయి హరికృష్ణ, వడ్డే రాము పిల్లి వెంకటేష్, రామకృష్ణారెడ్డి, కాశతారక్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన పశు వైద్య శిబిరం...



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 27 (స్కైన్యూస్)** మండల పరిధిలోని మల్కాపూర్ నర్సాయిపల్లి గ్రామాలలో నిర్వహించిన పశు వైద్య శిబిరం విజయవంతమైనట్లు మండల పశువైద్యాధికారులు డాక్టర్ కల్పన డాక్టర్ అశోక్ తెలిపారు శనివారం జిల్లా పశు వైద్య మరియు సమర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ కోసం ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరంలో 2522 గొర్రెలకు మరియు 621 మేకలకు ఉచితంగా మందులలో సరిపడా చేసినట్లు తెలిపారు. గ్రామాలలో నిర్వహించే పశు వైద్య శిబిరాలలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేయించి శక్తిని పెంచడంతోపాటు ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో సిబ్బందితోపాటు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు గొర్రెల కాపరులు పాల్గొన్నారు

# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ





**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 26** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు అచ్చంపేట ఎంపీడీవో పాలకొండ మధుసూదన్ గౌడ్ కుటుంబ సభ్యులు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయ ఆవరణలో అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారిని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్నాడ ప్రకాష్ గౌడ్, మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, గూనెల్లి రమేషప్ప, ఎంసాని నర్సింలు, జి. వసంతరావు, జనార్ధన్ గౌడ్, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్, శంకర్ గౌడ్, యాదగిరి, రఘునందన్ రెడ్డి, క్యాసెట్ శ్రీనివాస్, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, జగన్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్ రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు ఆదివారం 28 డిసెంబర్ 2025

## నూతన విద్యుత్ లైన్‌తో శ్యామ్ రావు తండాకు శాశ్వత విద్యుత్ పరిష్కారం...



**రంగారెడ్డి జిల్లా స్పై న్యూస్, డిసెంబర్ 26 :–** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధిలోని నిడుదవెల్లి గ్రామపంచాయతీ శ్యామ్ రావు తండాలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. తండాకు నూతన విద్యుత్ లైన్ పనులకు గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ శనివారం శ్రీకారం చుట్టారు ఇంతకుముందు తండాకు కేవలం కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో తరచూ అంతరాయాలు ఏర్పడేవి. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాశ్వత పరిష్కారానికి అవసరమైన రీ–కండక్టింగ్ వైర్ అందించేందుకు చర్యలు చేపట్టారు దీంతో నూతన విద్యుత్ లైన్ పనులు ప్రారంభమయ్యాయి. తండాలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుండటంతో, సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్‌లకు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ లక్ష్మయ్య, ఆపరేటర్ నరసింహ, యువకులు బోడ మల్లేష్, బద్దు నాయక్, శేఖర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శనేశ్వర స్వామికి తిలతైల అభిషేక పూజలు...



**బిజినేపల్లి డిసెంబర్ 27 (స్పై న్యూస్):**శ్రీ విశ్వవసు సంవత్సరం పుష్య మాసం శుక్లపక్షం సప్త,అష్టమి శనివారం నాడు బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహ దోష నివారణకు స్వామి వారికి తిలతైలా అభిషేకలు భక్తితో వైభవంగా జరిగాయి. శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ శనీశ్వర స్వామి జన్మ నక్షత్రం పుష్యమి కావడంతో ఈ పుష్య మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయనఅన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రిత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు ఈ పుష్య మాసంలో జనవరి నెలలో 3,10,17 తేదీలలో శనివారాలు వస్తాయని, అదేవిధంగా పుష్యమి నక్షత్రం ఉన్న రోజు, అమావాస్య రోజు స్వామివారిని కోలవడం ఇంకా విశేష ఫలితం అని, స్వామివారినీ ఇష్టమైన నువ్వుల నూనె,నువ్వులు బెల్లము,జమ్మి ఆకు,నల్లని వస్త్రాలు,నీలిరంగు జిల్లేడు పూలతో పూజించడంతో, దానం చేయడంతో స్వామివారి అనుగ్రహం ప్రాప్తిస్తుందని అన్నారు.ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు,అర్చనలు, దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచే నిర్వహించారు.అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈకార్యక్రమం లో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, కమిటీ సభ్యులు రాజేష్, ప్రభాకరచారి,పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి,శ్రీకాంత్ రెడ్డి,ఆలయ ఆర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమమహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## రైతు మృతి పై వదంతులు వ్యాపింప చేయకండి....



జిల్లాలోని మానవపాడు మండలం కలుకుంట్ల గ్రామం రైతు వేదిక వద్ద బుధవారం మధ్యాహ్నం ఉండవల్లి మండలం బొంకూరు గ్రామానికి చెందిన రైతు జమ్మన్న వృద్ధాప్య, రక్తపోటు కారణంగా అకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచెందితే దీనిపై పలు వదంతులను వ్యాపింపచేయడం తగదని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని మీడియాల్లో రైతు మృతిపై వచ్చిన వార్తలపై కలెక్టర్ స్పందిస్తూ జమ్మన్న పండించిన 23 క్వింటాళ్లతో పాటు ఆయన బంధువు రఘు 120 క్వింటాళ్ల మొక్కజొన్నను తీసుకొని ఈ నెల 20న మానవపాడు మండలం కలుకుంట్ల గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి అతని బంధువు రఘు తీసుకువచ్చారన్నారు. మొక్కజొన్న తేమ శాతం ఎక్కువగా ఉండడంతో కేంద్రం సమీపంలోనే ఎండబెట్టడం జరిగిందన్నారు. మొక్కజొన్న తేమ 14 శాతం ఉన్నప్పుడు ఈనెల 23న కేంద్రం ఇన్చార్జి కొనుగోలు చేశారన్నారు. కొనుగోలు తర్వాత మొక్కజొన్న ధర చెల్లింపు కోసం బయోమెట్రిక్ లో వేలిముద్ర వివరాలు ఇవ్వాలని కేంద్రం నిర్వాహకులు రఘుకు తెలియజేశారన్నారు. దాంతో రఘు ఈనెల 24న బొంకూరు గ్రామం నుంచి జమ్మన్నను వెంటబెట్టుకొని కలుకుంట్ల గ్రామానికి మధ్యాహ్నం చేరుకున్నారన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద జమ్మన్న ఒక గంట సేపు మాత్రమే ఉండడం జరిగిందని, కానీ మీడియాలో జమ్మన్న నాలుగు రోజులుగా కొనుగోలు కేంద్రం వద్ద వేచి ఉండాల్సి వచ్చిందనే వార్తల్లో వాస్తవం లేదన్నారు. బుధవారం బొంకూరు నుంచి కలుకుంట్ల రైతు వేదిక వద్దకు రాగానే జమ్మన్నకు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి గుండెపోటు రావడంతో మృతి చెందడం జరిగిందన్నారు. వెంటనే మృతుడి బంధువులు అంబులెన్స్ పిలిపించి జమ్మన్న మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారన్నారు. జమ్మన్నకు రక్తపోటు ఉండడంతో కొంతకాలంగా చికిత్స తీసుకుంటూ మందులు వాడుతున్నట్లు తెలిసిందని కలెక్టర్ తెలిపారు. జమ్మన్న మృతిపై పలు మీడియాలో వచ్చిన సమాచారం సరైనది కాదని పేర్కొన్నారు.

## రాష్ట్ర బిజెపి చీఫ్ ను కలిసిన జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శులు...



**నారాయణపేట డిసెంబర్ 27:( స్పైన్యూస్)** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావును హైద్రాబాద్ పార్టీ కార్యాల యంలో నారాయణపేట జిల్లా బిజెపి ప్రధాన కార్యద ర్శులు లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్, డోకూర్ తిరుపతి రెడ్డి,బలరాం రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ జిల్లాలో పంచాయితీ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయని అభినందిచి రానున్న మున్సిపల్ ,పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు పార్టీని బలోపేతం చేయాలని మార్గదర్శనం చేసినట్లు తెలిపారు.

# పారదర్శకతతో కేసులను దర్యాప్తు చేయాలి

**హక్కులను కాపాడడం పోలీసుల బాధ్యత**

**జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు.**

నాగర్ కర్నూల్ డిసెంబర్ 27 (స్పై న్యూస్) జిల్లాలో పోలీసులు స్టేషన్లలో నమోదైన కేసులను పారదర్శకతతో దర్యాప్తు చేయడంతో పాటు నేరస్తులు కాని వారి హక్కులను కాపాడాలని జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు కోరారు శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వార్షిక నేరాల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల స్థితిగతులను తెలుసుకొని వాటిపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ అధికారులు నేరాలను నియంత్రించేందుకు దోషులకు కఠినంగా శిక్షలు పడేలా కేసులను విచారణ సకాలంలో చేపట్టి ప్రజా భద్రతకు కఠినంగా చర్యలు తీసుకోవాలని



ఆదేశించారు. పోలీస్ అధికారులు ప్రజల నమ్మకాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని నేరస్తులకు శిక్షలు పడేలా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సమీక్షా



సమావేశంలో డిఎస్పి శ్రీనివాస్ అచ్చంపేట డిఎస్పి శ్రీనివాసులు సిఐలు మహేష్ అశోక్ రెడ్డి నాగరాజు తోపాటు ఎస్సైలు పోలీస్ అధికారులు పాల్గొన్నారు

# షాద్ నగర్ పట్టణ ముఖ్య కూడాలి లో యువకుడి అర్ధనగ్న ప్రదర్శన

**ప్రాణాలు పోతుంటే వేడుక చూస్తారా**

**అధికారుల తీరుపై ఆగ్రహం**

**ఒంటరిగానే ఉద్యమిస్తున్న ఆర్ఎన్ రాము**

**రంగారెడ్డి జిల్లా క్రైన్ న్యూస్, డిసెంబర్ 27:–** రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ పట్టణంలో రెండు రోజుల క్రితం పట్టణ ముఖ్య కూడలిపై ఒంటరిగా ఉద్యమించిన ఆర్ ఎన్ రాము శనివారం మరో అడుగు ముందుకు వేశాడు పట్టణ చౌరస్తా పై ఫ్లక్కార్డులు ప్రదర్శిస్తూ అర్థనగ్న ప్రదర్శనకు దిగాడు పట్టణ కూడలిపై రోడ్డు విస్తరణ లేక ప్రాణాలు పోతున్నాయని ఎంతమంది ప్రాణాలు తీసుకుంటే ఈ రహదారిని బాగు చేస్తారో అధికారులు చెప్పాలని ప్రశ్నించాడు పట్టణానికి చెందిన తండ్రి, కూతురు మచ్చేందర్, మైత్రిలు గత జులై 26వ తేదీన నడి చౌరస్తాలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించారని గుర్తు చేశారు చాలామంది క్షతగాత్రులై వికలాంగులుగా మారారని పేర్కొన్నారు ఇంత జరుగుతున్న స్థానిక మున్సిపాలిటీ అధికారులు గాని, ఇతర ఏ శాఖల అధికారులు కానీ స్పందించడం లేదని ధ్వజమెత్తారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు ఎన్నిసార్లు తిరిగిన పనులు జరగడం లేదన్నారు త్వరలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించక పోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తానని ఆయన హెచ్చరించాడు ఆర్ ఎన్ రాము చేస్తున్న ఆందోళనలో అర్థముందని పట్టణానికి చెందిన తయ్యబ్, భుజంగ రెడ్డి అన్నారు.



రాము ఆందోళన పై ఆయన స్పందిస్తూ పట్టణ కూడలి ప్రమాదాలకు నిలయంగా మారిందని పలు ప్రమాదాలు జరుగుతున్న అధికారులు స్పందించడం లేదని అన్నారు ఇది మంచి పద్ధతి కాదని వెంటనే రోడ్డును విస్తరించాలని ఆయన డిమాండ్ చేశారు మరో పట్టణవాసి స్పందిస్తూ ఒక్కసారి సిగ్నల్ పడితే వందలాది వాహనాలు నిలిచిపోతాయని, ఈ వాహనాలన్నీ ఒక్కసారిగా ప్రయాణించిన నేపథ్యంలో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉందని అన్నారు అధికారులు ఇకనైనా స్పందించి ఈ రహదారిని బాగు చేస్తే ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు

# విబిజి రామ్ జి బిల్లును రద్దు చేయాలి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్**

**రంగారెడ్డి జిల్లా స్పై న్యూస్, డిసెంబర్ 26 :–** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, షాద్ నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు విబిజి రామ్ జి సరైనది కాదని బిల్లును వెంటనే ఉపసహరించుకోవాలన్నారు దేశంలో సంపద సృష్టించే అసంఘటిత రంగ కార్మికులు వ్యవసాయ కూలీలు రైతులకు నష్టం కలిగిస్తూ కార్పొరేట్ సంస్థలైన అంబానీ ఆదానీ లాంటి వారి కోసం వారి లాభాల కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆయన విమర్శించారు యూపీఏ వన్ ప్రభుత్వంతో కొట్లాడి కమ్యూనిస్టు పార్టీలు పేదల కోసం అమలు చేయించిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టంలో మహాత్మా గాంధీపేరును మార్చి ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే విధంగా దాని కనుమార్గ చేసే విధంగా గాంధీ పేరుని మార్చి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజుగార్ అజీవిక మిషన్ పేరుతో విబీజీ రామ్ జీ కొత్త బిల్లును తెచ్చిందని దాన్ని వెంబడే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఉపాధి హామీ ని కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై నడిచే ఒక కేంద్రీకృత బడ్జెట్ పరిమితులతో కూడిన పథకంగా మారుస్తుందని అదేవిధంగా ప్రతిపక్ష రాష్ట్రాలకు వ్యతిరేకంగా నిధులను ఆయుధంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని ఈ బిల్లు అత్యంత ప్రమాదకరమైందని కేంద్రం బడ్జెట్ పై పరిమితిని విధిస్తుందని అన్నారు రాష్ట్రాలు 100శాతం నిధులు



సమకూర్చాల్సి ఉంటుందని రాష్ట్రాలు ఇది ఉపాధి హామీ ఎక్కువగా అవసరమయ్యే పేద రాష్ట్రాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని అన్నారు కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లు అదేవిధంగా రైతులకు వ్యతిరేక చట్టాలు ఇప్పుడు వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకమైనటువంటి విబి జి రాంజీ బిల్లును కేంద్రం తీసుకువచ్చిందని వీటిని ఉపసంహరించుకోకపోతే గ్రామస్థాయి వరకు పోరాటాన్ని తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు.

# ప్రజాపాలన పేరుతో జర్నలిస్టులకు శిక్ష ఎందుకు?

**రెండు కార్డుల విధానం దేనికి**

**జర్నలిస్టుల నడుమ చీలిక చిచ్చు అవసరమా**

**జర్నలిస్టుల కుటుంబాలే మీకు భారమయ్యాయా**

**మా కార్డుల కోతతో మీకు మిగిలే కోట్లు ఎన్ని**

**పొమ్మనలేక జర్నలిజానికి పొగ పెడతారా**




**252 జీవోను సవరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి**

**ఇళ్ల స్థలాలు హెల్త్ కార్డులు జారీ చేయాలి**

**జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సమస్యలపై వినతిపత్రం**




**కొత్తగూడెం డిసెంబర్27( స్పై న్యూస్):** జర్నలిస్టులపై ఎందుకుకీ కక్ష.ప్రజా పాలన పేరుతో మాకెందుకు శిక్ష అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టియుడబ్ల్యుజే (టీజేఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కల్లోజీ శ్రీనివాస్, కార్యదర్శి మహమ్మద్ షఫీ, రాష్ట్ర కమిటీ సభ్యులు గుర్రం రాజేష్, చంద్ర నరసింహారావు, వట్టి కొండ రవిలు సూటిగా ప్రశ్నించారు. జర్నలిస్టులను విభజించే విధంగా ఉన్న 252 జీవోను సవరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం (టియుడబ్ల్యుజే–టీజేఎఫ్ హెచ్143) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన బయటయింపు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జర్నలిస్టుల అక్రిడేషన్ల జీవో కొంత అసంతృప్తికరంగా ఉందన్నారు. ఆ జీవోను సవరించి విడుదల చేయాలన్నారు. అక్రిడేషన్ల కార్డుల జారీలో కోత ఎందుకని ప్రశ్నించారు. జర్నలిస్టులను విభజించి పాలిస్తారా అంటూ అసహన వ్యక్తం చేశారు. రెండు కార్డుల విధానానికి స్వస్తి పలకాలన్నారు. ప్రజా పాలనలో పాత్రికేయులను పగబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల నడుమ చీలిక చిచ్చు ఎందుకు పెడతారు అంటూ మండిపడ్డారు. జర్నలిస్టుల కుటుంబాలే మీకు భారమయ్యాయా అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. మా కార్డుల కోతతో మీకు మిగిలే కోట్లన్ని చెప్పాలని ప్రశ్నించారు. పొమ్మనలేక జర్నలిజానికి పొగ పెడతారా అంటూ తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన జర్నలిస్టుల గుర్తింపును రద్దు చేస్తారా..? అంటూ ప్రశ్నించారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు సాధించేవరకు ఆందోళన కొనసాగిస్తామని, 252 జీవోను సవరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలపై జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ కు వినతిపత్రం అందజేశారు. అల్లం నారాయణ ఆధ్వర్యంలోని జర్నలిస్టులకు న్యాయం..గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్ర తొలి ప్రెస్ అకాడమీ చైర్మన్, టి యు డబ్ల్యు జే (టీజేఎఫ్ హెచ్143) రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు వారి కుటుంబాలకు సంపూర్ణ న్యాయం జరిగిందని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. అల్లం నారాయణ ప్రెస్ అకాడమీకి చైర్మన్గా ఉన్న సమయంలో జర్నలిస్టులకు వారి కుటుంబాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కరోనా కాలంలో వ్యాధి



భారిన పడ్డ ప్రతి జర్నలిస్టుకు ఆర్థిక సహాయం అందించిన ఘనత అల్లం నారాయణకే దక్కుతుందన్నారు. అంతేకాకుండా మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు వారి పిల్లల చదువులకు ఆర్థిక సహాయం చేసినట్లుగా చెప్పారు. మీడియా వృత్తిలో ఉన్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ఆధ్వర్యంలో పెద్ద మొత్తంలో అక్రిడేషన్ కార్డులు జారీ కావడం జరిగిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు అతిపెద్ద మొత్తంలో అక్రిడేషన్లు జారీ చేయించిన ఘనత అల్లం నారాయణదే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కాగితపు వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి అచ్చి ప్రభాకర్ రెడ్డి, , టెంజు కార్యదర్శి శ్రీహరి, జిల్లా ప్రచార కార్యదర్శి చింతల చిరంజీవి, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రత్నకుమార్ రిషి యోహాన్ కృష్ణారావు జిల్లా కమిటీ కార్యవర్గసభ్యులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# కొత్త జీవోతో జర్నలిస్టులకు ఎలాంటి నష్టం లేదు

**టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి**

**నారాయణపేట, డిసెంబర్ 27:( స్కైన్యూస్)**రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన నూతన అక్రెడిటేషన్ జీవో వృత్తిపరమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం కలిగించేదిగా లేదని, దీనిపై కావాలని జరుగుతున్న దుష్ప్రచారాలను జర్నలిస్టులు విశ్వసించవద్దని టియుడబ్ల్యూజే (ఐజేయు) నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. శనివారం నారాయణపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, జర్నలిస్టుల అక్రెడిటేషన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్గదర్శకాలు గతంలో ఉన్న లోపాలను సరిదిద్దే దిశగా రూపొందించబడ్డాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి మరింత బలమైన విధానాలు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందని, ఈ అంశంపై టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కమిటీ స్పష్టమైన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలులో ఉన్న అక్రెడిటేషన్ జీవోలో ఉర్దూ జర్నలిస్టుల పట్ల వివక్ష, చిన్న పత్రికలపై చిన్న చూపు స్పష్టంగా కనిపించిందని ఆయన గుర్తు చేశారు. ఈ వివక్షతను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలోనే నూతన జీవోలో అవసరమైన మార్పులు, సవరణలు చేపట్టినట్లు తెలిపారు. నూతన జీవోపై కొందరు ఉద్దేశ్యపూర్వకంగా అసత్యాలను ప్రచారం చేస్తూ, సంక్షేమ పథకాలు కేవలం కొద్ది మంది విలేకరులకు మాత్రమే వర్తిస్తాయని వక్రీకరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని, వృత్తిపరమైన జర్నలిస్టులందరికీ సంక్షేమ పథకాలు సమానంగా వర్తిస్తాయని స్పష్టం చేశారు. అవసరమైతే ఈ అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వడానికి టియుడబ్ల్యూజే (ఐజేయు) సిద్ధంగా ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమ చర్యలపై ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రితో ఎప్పటికప్పుడు



చర్చించే అవకాశం ఉందని రాష్ట్ర కమిటీ సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాజకీయ ఉద్దేశాలతో కొందరు శక్తులు జర్నలిస్టులను రెచ్చగొట్టి ఆందోళనలకు ప్రేరేపించడం అత్యంత విచారకరమని వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల పట్ల సానుకూల దృక్పథంతో ఉన్న ప్రజా ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వంలా వివక్ష చూపే అవకాశం లేదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమాన్ని పరిరక్షించే దిశగానే ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. అంతిమంగా, నూతన జీవోపై పనిగట్టుకుని జరుగుతున్న దుష్ప్రచారాన్ని జర్నలిస్టులు నమ్మవద్దని, వాస్తవాలను గుర్తించి ఐక్యతతో ముందుకు సాగాలని కోయిలకొండ నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సింగరేణి భవన్ లో డైరెక్టర్ ఫా గౌతమ్ పొట్రు కలిసిన మాజీ మంత్రి హరీష్ రావు..

**నవంబర్ 24, 25న జరిగిన మెడికల్ బోర్డుని మరోసారి నిర్వహించి అందరిని అన్ఫిట్ చేయాలి..హరీష్ రావు మాజీ మంత్రి**







**కొత్తగూడెం డిసెంబర్ 27 (స్కై న్యూస్ ):** తెలంగాణ బొగ్గు గని కార్మికు సంఘం గౌరవాధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ నాయకత్వంలో డైరెక్టర్ పని కలిసిన మాజీ మంత్రి హరీష్ రావు ఫా తో మాట్లాడుతూ సింగరేణిలో నవంబర్ నెల 24,25న జరిగిన మెడికల్ బోర్డు మరోసారి నిర్వహించాలని, మారు పేర్ల సమస్యను పరిష్కరించి వారికీ న్యాయం చేయాలని సింగరేణి డైరెక్టర్ ఫా గౌతమ్ పొట్రు ని కోరడం జరిగింది. హరీష్ రావు మాట్లాడుతూ ఎప్పుడో1998లో బందు పెట్టేన తండ్రి కొడుకులు ఉద్యోగాలను 2018 నుండి కేసీఆర్ గారు కారుణ్య నియామకాల పేరుతో తండ్రుల ఉద్యోగాలు పిల్లలకి దాదాపు 15000 ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. కానీ రెండు సంవత్సరాల క్రితం ఎలక్షన్ల ముందు కార్మికుల ముందుకు కాంగ్రెస్ పార్టీ వారు వచ్చి కెసిఆర్ నెలకొక బోర్డు పెడితే మేము రెండు బోర్డు లు నిర్వహిస్తామని 250 గజాల స్థలం ఇప్పిస్తామని, 30 లక్షలు వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని పెర్క్స్ మీద ఇన్కంటాక్స్ రద్దు చేపిస్తామని ఇవేగాక అనేక హామీలు ఇచ్చి కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాత రికగ్నైజేషన్లు, రీప్రజెంటేషన్ ఏఐటియుసి, ఐఎన్టీయూసీ యూనియన్స్ మెడికల్ బోర్డును పోగొట్టే ప్రయత్నం చేస్తుందని ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని కార్మికులు ఎటు పోయినా ఎటు వంటి ఇబ్బంది పడ్డ పర్లేదు అని తమ సొంత ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయని అన్నారు. వీరి వెంట తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపుకృష్ణ, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, భూపాలపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య, మెడికల్ బోర్డుకు సంబంధించిన బాధితులు పాల్గొన్నారు.

# పోరాటాల వ్యూహాలకే జనం బాట

**దీర్ఘకాలిక సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి**

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 27( స్కై న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న స్వల్పకాలిక సమస్యలను పరిష్కరిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు జాగృతి ఆధ్వర్యంలో జనంబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వివరించారు శనివారం జిల్లాలో నిర్వహించిన పర్యటన సందర్భంగా వట్టెం రిజర్వాయర్ ముంపు బాధితులతో సమస్యలు తెలుసుకొని రిజర్వాయర్ పనులను పరిశీలించారు. గతంలో పాలకులు నల్లమట్టి కోసం సేకరించిన 9 ఎకరాల భూమిని కాంట్రాక్టర్లు ఇతర అవసరాల కోసం వినియోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల నుండి నల్ల మట్టిని తరలిస్తుండడం అలాంటి భూమిని వెంటనే పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడిన జలాల పంపిణీలో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతికి పాల్పడుతూ రాజకీయాలు చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో రెండు సంవత్సరాలుగా తట్టెడు మట్టి కూడా తవ్వలేదని పిలుచుకుపడ్డారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి హరీష్ రావు కాంట్రాక్టర్ తో కుమ్మక్కై చేసిన నిర్వాకం వల్ల మూడు మూటలే పనిచేస్తున్నాయని నేటికీ నీళ్లు అందలేదన్నారు





అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాలుగా ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని విరుచుకుపడ్డారు. నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు గడిచిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని నిడదీశారు రాజకీయ గురువు చంద్రబాబు మెప్పుకోసం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్వీర్యం చేశారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 30 లక్షల ఎకరాలకు సాగునీరు దక్కవలసి ఉండగా 6 లక్షల 50 వేల ఎకరాల కు మాత్రమే నీళ్లు అందుతున్నాయని అన్నారు. 2019 ఎన్నికలలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 13 స్థానాలను టిఆర్ఎస్ కు కట్టబెట్టిన ప్రయోజనం లేదన్నారు.



గత ప్రభుత్వ హయాం లో అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనలు చేస్తున్నారే తప్ప నిరూపించడం లేదన్నారు. రైతుల భూములను వారికి అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి నిలిపాలని కోరారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలలో కూడా ఎక్కువ శాతం భూములు అసైన్డ్ భూములు ఉన్నాయని అనేకమంది పేద రైతులు జీవనాధారమైన భూములను ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందని కొందరిపై దౌర్జన్యంగా భూములను స్వాధీనం చేసుకున్నారని విషయంలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 80,000 క్యూసెక్కుల నీళ్లను జలదోపిడికి పాల్పడ్డారని వివరించారు ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రయాణికులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు**



**నారాయణపేట డిసెంబర్ 27: (స్కైన్యూస్)** ప్రయాణికులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణ పేట బస్టాండ్లో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బస్టాండ్ లో బస్ కొరకు వెయిట్ చేస్తుంటే తమ విలువైన వస్తువులు బ్యాగులు జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఎవరైనా తినుబండారాలు ఇస్తే తీసుకోరాదని మాటలు కలిపి దొంగతనాలకు పాల్పడుతుంటారని తగు జాగ్రత్తలు పాటించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా డయల్100 ఫోన్ చేయాలని సూచించారు.అలాగే సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు ఇతరులకు ఇవ్వకూడదని తెలిపారు. సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ హెల్మెట్, సీటుబెల్ట్ వాడకం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అవగాహన కల్పించారు.ప్రజలు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలకలు, క్రెయాన్స్ వితరణ



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 27( స్కై న్యూస్ )**లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐతోల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, క్రెయాన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు ఉపయోగించుకొని మంచిగా చదువుకొని మంచి భవిష్యత్ పొందాలని, నాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక పాఠశాలకు మంచి నీటి సౌకర్యం కొరకు వాటర్ ట్యాంకులు ఇవ్వడం జరిగిందని, ఇంకా ఏవైనా ఇతర అవసరాలు ఉంటే తీరుస్తామని తెలిపారు.కార్యక్రమంలో మహిళా సభ్యులు నాగరాణి, అరుణ, పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థులకు చిత్రకళ పోటీలు









**హైదరాబాద్:( స్కై న్యూస్) డిసెంబర్ 27** ఎల్బీనగర్ డివిజన్ బియన్ రెడ్డి గౌతమ్ మోడల్ స్కూల్ హస్తినాపురం లో శనివారం నో బ్యాగ్ డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఫినా పేరుతో 1 నుంచి 9 వ తరగతి విద్యార్థులకు చిత్రీకరణ, కళా ఖండాలు తయారీపై పోటీలు నిర్వహించారు.చిన్నారులలో మానసిక వికాసం,సృజనాత్మకత, చిత్ర కళ పై ఆసక్తిని పెంపొందించుటకు ఈ రోజు ఉదయం నుంచి వివిధ ప్రాజెక్టులు తయారుచేసే మధ్యాహ్నం నుంచి ప్రదర్శనకు ఏర్పాటుచేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఎంతో ఉత్సాహంగా ఈ ప్రదర్శన చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శన ను ఈ ప్రాంత బ్రాంచులకు డీన్ శ్రీనివాస్ గారు, బ్రాంచ్ ప్రిన్సిపాల్ దివ్యమౌనిక సందర్శించి విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందించారు. ఉత్తమ ప్రాజెక్టు లకు బహుమతులు కూడా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులకు ఇతర సిబ్బందికి అలాగే పిల్లలకు సహకరించిన తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలిపారు.

## పూజారిపై దాడి చేసిన వారిని శిక్షించాలి....

**బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్**



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 27( స్కై న్యూస్)** పాలెం అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పూజారి సురేష్ శర్మ పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ డిమాండ్ చేశారు శనివారం అర్చకులు పూజారి సురేష్ శర్మను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సంఘటనపై డీఎస్పీ శ్రీనివాస్ నిష్పక్షపాతంగా విచారణ జరిపించి చర్యలు తీసుకోకపోతే పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు

## అథ్లెటిక్, త్రో బాల్ , సిమ్మింగ్ మీట్ రీజినల్ పోటీలు

**డబ్ల్యూపిఎస్ జిప వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్**

**సింగరేణి డిసెంబర్ 27 (స్కై న్యూస్ ):**కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు ఆదేశానుసారం కొత్తగూడెం ఏరియాలో డబ్ల్యూపిఎస్ %G% జిప వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారంన అథ్లెటిక్, త్రో బాల్ %G% సిమ్మింగ్ మీట్ రీజినల్ పోటీలు కొత్తగూడెం మరియు కార్పొరేట్ ఏరియా వారికి ప్రకాశం స్టేడియం %G% సిఈఆర్ క్లబ్ నందు ప్రారంభించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సీనియర్ పిఓ మతిన్ ఇంచార్జ్ (హానరరీ సెక్రటరీ), కొత్తగూడెం ఏరియా ఎఐటియుసి యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కే. రాములు, ఐఎన్టియుసి యూనియన్ ప్రతినిధి సిహెచ్ సాగర్ ప్రారంభించినారు.సీనియర్ పిఓ మతిన్ ఇంచార్జ్ (హానరరీ సెక్రటరీ), మాట్లాడుతూ, క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని, కొత్తగూడెం ఏరియాకి రీజనల్ లెవెల్ పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనపరిచి



కంపెనీ లెవెల్, కోల్ ఇండియాలో పాల్గొన్ని అధిక సంఖ్యలో బహుమతులు గెలిచి, కొత్తగూడెం ఏరియా ప్రతిభ చూపాలని క్రీడలో పాల్గొనుటకు వచ్చిన క్రీడాకారులకు ఈ సందర్భంగా తెలియజేశారు.యూనియన్ ప్రతినిధులు అథ్లెటిక్, త్రో బాల్ %G% సిమ్మింగ్ మీట్ రీజినల్ పోటీలలో పాల్గొనుటకు వచ్చిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో సీనియర్ పిఓ మతిన్



ఇంచార్జ్ (హానరరీ సెక్రటరీ), తో పాటు కొత్తగూడెం ఏరియా ఎఐటియుసి యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కే. రాములు, ఐఎన్టియుసి యూనియన్ ప్రతినిధి సిహెచ్ సాగర్ స్పోర్ట్స్ కో- ఆర్డినేటర్ భుక్యా భీముడు, జనరల్ కాప్టెన్ బి. వెంకటేశ్వర్లు, అథ్లెటిక్ మీట్ కెప్టెన్ కే శ్రీనివాసరెడ్డి క్రీడలలో పాల్గొన్న క్రీడాకారులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్మించిన శివ శక్తి భవన్ అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభోత్సవం....

### ముఖ్యఅతిథిగా హాజరైన చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య





**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 26 :-** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం,మొయినాబాద్ మండలంలోని కనకమామిడి గ్రామంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్మించిన శివ శక్తి భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఓం శాంతి సందేశంతో ఆధ్యాత్మిక చైతన్యం ధ్యానం మానసిక ప్రశాంతతను ప్రజల్లో పెంపొందిస్తూ సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తున్న గొప్ప సేవా సంస్థగా నిలిచిందని పేర్కొన్నారు ఆధ్యాత్మిక విలువలు పెరిగినప్పుడే సమాజంలో శాంతి ఐక్యత సౌభ్రాతృత్వం పెరుగుతాయని తెలిపారు శివ శక్తి భవన్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడటం ఎంతో అభినందనీయమని ప్రజల జీవితాల్లో సానుకూల మార్పుకు దోహదపడతాయని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బ్రహ్మకుమారీస్ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దుండగులను వెంటనే శిక్షించాలి....



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 27 (స్కైన్యూస్)** మానసిక వికలాంగురాలు పై హత్యాచారం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఇండియా జిల్లా మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ డిమాండ్ చేశారు ఉమ్మడి జిల్లాలోని భూత్పూర్ మండల పరిధిలో మానసిక వికలాంగుల సమీప బంధువులైన ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేయడం దారుణమని వెంటనే వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు

# టీకాల అవిష్కరణకు ఆద్యుడు

ఆంత్రాక్స్, రబీస్ తదితర వ్యాధులకు మందులను కనిపెట్టడంలో మూలపురుషుడై అవిరళ కృషి సల్పిన సూక్ష్మజీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్. 19 వ శతాబ్దంలో గాలి సోకడం వల్ల అంటువ్యాధులు వస్తాయని నమ్మేవారు. గాలిలో రోగకారక క్రిములని మోసుకొచ్చే వస్తువుల వల్ల అంటు వ్యాధులు కలుగు తాయని అప్పుడు ఎవరికీ తెలీదు. సొంత కుంటుంబంలో జరిగిన విషాద సంఘటనలు, పాశ్చర్ తన పరిశోధనలను కలరా, మశూచి వ్యాధులకు మూలమైన వ్యాధి కారకాలను కనుగొనే దిశలో కొనసాగేట్లు చేశాయి. నేడు మనం చిన్న పిల్లలకు కలరా, మశూచి, పోలియో రాకుండా ముందుగానే వేయిస్తున్న 'టీకాలు' ఆ మహానుభావుని ఆలోచనే. వ్యాధి వచ్చినప్పటి కంటే రాకుండా తీసుకోనే జాగ్రత్తలే మేలని ముందుగా "వ్యాక్సి నేషన్" ద్వారా వ్యాధులను రాకుండా ముందుగానే కట్టడి చేయవచ్చని సూచించాడు. అంతేకాదు వ్యాధి సోకినా దానిని నియంత్రించి, రూపుమాపే మందులను కూడా కనుగొనేందుకు మార్గం చూపించాడు. పాశ్చర్ తన ప్రయోగాలను ఉపయోగించి సూక్ష్మజీవులు వాస్తవానికి ఇతర సూక్ష్మజీవుల నుండి ఉత్పత్తి అవుతాయని, ఊరికే గాలిలోంచి ఊడిపడవని నిరూపించారు. నేడు లక్షలాది అంటు రోగాలను తగ్గించేందుకు మన ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో మందులున్నాయి. దానికి ఎంతో కృషి సల్పిన, నేటికీ నిత్యం శ్రమిస్తున్న ఎంతో మంది సూక్ష్మ జీవశాస్త్రవేత్తలకు లూయీ పాశ్చర్ వంటి వారు ఏర్పరిచిన శాస్త్రీయ విధానమే మూలాధారం. లూయీ పాశ్చర్ (డిసెంబరు 27, 1822 – సెప్టెంబరు 28, 1895) ప్రముఖ ఫ్రెంచి జీవ శాస్త్రవేత్త. వ్యాధులకు కారణం సూక్ష్మక్రిములను కనుగొని రోగ నివారణకు పాశ్చర్ బాటలు వేశారు. టీకాల ఆవిష్కారానికి ఇతడు ఆద్యుడు. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారుచేశాడు. రాబర్ట్ కోచ్, ఫెర్డినాండ్ కాన్తో పాటు జీవశాస్త్ర వ్యవస్థాపక త్రయంలో ఒకరు. పాలు ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టే పద్ధతిని ప్రవేశ పెట్టిన వ్యక్తిగా సుపరిచితుడు. ఈ పద్ధతిని నేడు "పాశ్చరైజేషన్" అంటారు. కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. పాశ్చర్ కొన్ని అద్భుత ప్రయోగాలు చేసి సూక్ష్మ జీవులు ఒకదాన్నుండి ఒకటి పుడతాయని, గాల్లోంచి ఊడి పడవని నిరూపించాడు. ఆయన ప్రతిపాదించిన రోగకారక క్రిమి సిద్ధాంతం వైద్య శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన భావనగా చెప్పుకోవచ్చు. అంతేకాక



ఆయన వ్యాధి యొక్క వ్యాప్తిని అరికట్టేందుకు ఆస్పత్రులలో చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రతా పరమైన పద్ధతులు ప్రవేశ పెట్టాడు. పాశ్చర్ అత్యంత సునిశితమైన, క్రమబద్ధమైన ప్రయోగాలు చేసి ఎన్నో ప్రమాద కరమైన సూక్ష్మజీవులను కనుగొన్నారు. ఆ సూక్ష్మజీవులని అరికట్టే వాక్సీన్ లు రూపొందించి మనుషులనే కాక, జంతువులను కూడా ఎన్నో భయంకరమైన వ్యాధుల నుంచి కాపాడారు. పాశ్చర్ 1822 సంవత్సరం డిసెంబరు 27న ఫ్రాన్స్ లోని డోల్ గ్రామంలో జన్మించాడు. పాశ్చర్ పాఠశాలకు వెళ్ళకుండా కొంతవరకు విద్యావంతుడయ్యాడు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారివి, స్నేహితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఉపాధ్యాయ జీవితాన్ని గడపాలను కొనేవాడు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్ లో అడుగుపెట్టాడు. డాక్టరేట్ పూర్తిచేసి 1848లో స్ట్రాస్ బర్గ్ విశ్వ విద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కూతురు మేరీ లారెంట్ ను పెళ్ళిచేసుకోగా, అయిదుగురు పిల్లలు పుట్టినా, టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒకరు, ముగ్గురు మరణించారు. పాశ్చర్ అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి "స్టీరియో కెమిస్ట్రీ" అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తరువాత తన పరిశోధనలను పులియడం (ఫెర్మెంటేషన్ ) వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మక్రిములపై అనాదిగా ఉన్న భావాలను ఖండించి కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. ద్రాక్షసారా (వైన్) వల్ల వచ్చే వ్యాధులు, నిల్వచేసే పద్ధతులు, వెనిగర్ తయారీ మొదలైన అనేక అంశాలపై కొత్త విషయాలు కనుగొన్నాడు.రేబీస్ అనేది వైరస్ ల వల్ల కలిగే ఓ భయంకరమైన వ్యాధి. అది కుక్కల నుండి మనుషులకి సోకుతుంది. ఈ వైరస్ బాక్టీరియాల కన్నా అతి చిన్నదైన వస్తువు. కనుక పాశ్చర్ వాడిన సూక్ష్మదర్శినిలో ఇది కనిపించ లేదు. ఆ వైరస్ వ్యాధితో కేంద్ర నాడీ వ్యవస్థ పై ప్రభావితం చేస్తుంది. పాశ్చర్ ఆ వ్యాధి సోకిన జంతువుల వెన్నుపాము నుంచి ద్రవం సంగ్రహించి, వివిధ పద్ధతుల చేత ఆ ద్రవం యొక్క రోగ తీవ్రతని క్షీణపరిచి, ఆ ద్రవాన్ని తిరిగి కుక్కల మీదకి ఎక్కించి రేబీస్ కి వాక్సీన్ ని రూపొందించారు. కోళ్లకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధిపై పరిశోధన జరిపి వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులను బలహీనపరచి ఇతర కోళ్ళకు ఎక్కించి వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి తర్వాత కాలంలో రోగం రాకుండా రక్షిస్తుందని నిర్ణయానికి వచ్చారు. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశువులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధి మీద ప్రయోగించాడు.ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. అందువలన మనిషులు గాని, జంతువులు గాని అంటు వ్యాధితో మరణిస్తే ఆ శవాన్ని దహనం చేయాలని చెప్పారు. భూమిలో పాతిపెడితే శరీరంలోని క్రిములు బయటకు వచ్చి వాటివలన ఇతరులకు ఆ వ్యాధులు వ్యాపిస్తాయని వివరించాడు. పాశ్చర్ తన పూర్తి జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకు అంకితం చేశారు. సంకల్ప బలం, నిరంతర శ్రమతో విజయాన్ని సాధించవచ్చని పాశ్చర్ విశ్వాసం. పాశ్చర్ సూక్ష్మ జీవశాస్త్రంలో అత్యుత్తమ గౌరవమని పిలిచే లీవెన్ హాక్ బహుమతిని 1895లో పొందాడు. రెండు సార్లు గుండె పోటు, తరువాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న పరమపదించారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకర్ధంగా ఆయన మరణించిన రోజైన సెప్టెంబరు 28న ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపు కుంటారు.

## ప్రజాపాలనలో వేగవంతంగా పనులు గ్రామ సర్పంచ్ సప్న శివకుమార్



**చిన్న చింతకుంట డిసెంబర్ 27 (స్కై న్యూస్):** చిన్న చింతకుంట మండలం చిన్న వడ్డేమాన్ గ్రామంలో ఐదవ వార్డులో కరెంటుపోలు లైన్ సమస్య ఉన్నందువలన గ్రామ సర్పంచ్ స్వప్న శివకుమార్ దృష్టికి తీసుకువెళ్లిన తక్షణమే కరెంట్ ఏఈ తో మాట్లాడి వెంటనే సమస్యను పూర్తి చేయాలని ఆదేశించారు. వెంటనే పనులు ప్రారంభించి విద్యుత్ సమస్యను తీర్చిన అధికారులు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గ్రామ ఉప సర్పంచ్ గ్రామ అధ్యక్షులు గ్రామ యుత్ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీనివాస కళ్యాణం లో పాల్గొన్న పటేల్ జనార్ధన్ రెడ్డి



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 27 (స్కై న్యూస్):**మల్దకల్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నాగరాజు శర్మ సంధ్యారాణి ల స్వగృహంలో నిర్వహించిన శ్రీనివాస కళ్యాణం ఉత్సవానికి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పటేల్ జనార్ధన్ రెడ్డి దంపతులు స్వామి పూజలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## కన్నుల పండుగగా శ్రీనివాస కళ్యాణం



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 27(స్కై న్యూస్):**మల్దకల్ మండల కేంద్రంలోని నాగరాజు శర్మ స్వగృహంలో శనివారం శ్రీనివాస కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు ప్రసన్న చారి వేదమంత్రాలతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దీరేంద్ర దాస్ మధుసూదనా చారి రవిపట్వారి అరవిందరావు బాబురావు వెంకోబారావు మనసాని నాగరాజు సురేందర్ పటేల్ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒక రోజు పనిచేసినా బీమా వర్తిస్తుంది.. ఆ చట్టం అందించే ఆశ్రిత హితలాభం

వారి ఎదురుగా కూర్చున్న వ్యక్తిని చూపిస్తూ, 'వీరు ఫలానా జౌళిమిల్లు అధికారి. వారు పంపించిన ఆర్.సి. వెనక్కి పంపారట...' అశ్చర్యపోయారు బి.ఎస్.శ్రీకృష్ణమూర్తి. అప్పుడు వారు కార్మిక రాజ్య బీమా సంస్థ (కారాబి) మదురై ఉప ప్రాంతీయ కేంద్రం సంయుక్త నిర్దేశకుడు. నేను ఉప నిర్దేశకుడిని. ఆర్. సి. (రిటర్న్ ఆఫ్ కాంట్రిబ్యూషన్) అంటే, యాజమాన్యాలు కారాబి పరిధిలోకి వచ్చే తమ కార్మికుల బీమా చందా చెల్లింపుల వివరాలతో సమర్పించే అర్ధ వార్షిక నివేదిక. నిజానికి అలా తిప్పిపంపకూడదని, కొత్తగా ఆ శాఖకు బదిలీ అయిన నన్ను, మా హితలాభ శాఖ సిబ్బంది హెచ్చరించారు. ఐతే, అలా చేయడానికి బలమైన కారణముంది. ఆ యాజమాన్యం పంపిన ఆర్.సి. లో చాలామంది పేర్లైతే ఉన్నాయి గాని వారి, వారి బీమా సంఖ్యలు లేవు. అదే చెప్పాను. 'దానిదేముందండి. వారంతా రోజువారీ వేతనంపై పని చేస్తారు. ఒకరోజు పని ఉంటే రెండోరోజు లేకపోవచ్చు. ఐనా, వారి తరఫున కూడా చందా చెల్లించాం కదా' అని అధికారి జవాబు. కదా! అన్నట్టు చూసారు శ్రీకృష్ణమూర్తి. 'మరి అలాంటి వారికి పనిలో ప్రమాదం జరిగినా కారాబి నుండి హితలాభం కోరమని వ్రాతమూలకంగా తెలపగలరా' అని సందేహం వ్యక్తపరిచాను. ఎలాగైతే ఆర్.సి. తిప్పి పంపే అధికారం మాకు లేదో, అలా హామీ ఇచ్చే అవకాశం వారికీ లేదు. కథ సుఖాంతమైంది. నేను మదురైలో పనిచేస్తుండగా, ఆ మిల్లులో ఏ పెను ప్రమాదం జరగలేదు కానీ, నేను అక్కడ పనిచేస్తున్నప్పుడే శివకాశిలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. డాన్ ఫైర్ వర్క్స్ బాణాసంచా కర్మాగారంలో 1991 సెప్టెంబర్ 20న జరిగిన అగ్నిప్రమాదంలో 39 మంది కార్మికులు మరణించారు. మరో 65 మంది గాయపడ్డారు. దాంతో పరిశ్రమలలో భద్రతాలోపాలు పైన, ముఖ్యంగా బాణాసంచా కర్మాగారాలలో ప్రమాదకర పరిస్థితుల్లో బాలకార్మికులు కూడా పనిచేయాల్సి రావడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యకమయింది. అప్రమత్తమైన ప్రభుత్వం మాజీ ఐఏఎస్ అధికారి తంగరాజును విచారణ అధికారిగా నియమించింది. వారి ముందు ఒకరోజు విచారణలో డాన్ ఫైర్ వర్క్స్ కారాబి చట్టం క్రింద నమోదయిందని, కానీ మరణించిన వారిలో 17 మంది సహా, కొందరిని యాజమాన్యం బీమావ్యక్తులుగా నమోదు చేయించలేదని బయటపడింది. సహజంగానే అందరిలో ఆందోళన వ్యక్తమయింది. నేను కలగజేసుకుని కారాబి చట్ట నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగిన నాటికి, నమోదు చేయబడని కార్మికులు కూడా, వారిని ఆ రోజే పనిలో పెట్టుకున్నా, బీమా వ్యక్తులు( ఇన్స్యూర్ పర్సన్) గానే పరిగణించబడతారని, వారి కుటుంబాలకి నిబంధనల ప్రకారం ఆశ్రిత హితలాభం ( డిపెండెంట్స్ బెనిఫిట్) చెల్లించబడుతుందని, తెలియపరిచాను. అందరూ ఆశ్చర్యపడ్డారు. ఆ ప్రమాదంలో మరణించిన వారందరి ఆశ్రితులకు, ప్రమాదం జరిగిన 30 రోజుల్లోగా, మరణించిన కార్మికుల నెల జీతాలలో దాదాపు 90 శాతం, మొదటి నెల ఆశ్రిత హితలాభం అందజేయబడింది. సెప్టెంబర్ 14, 1997 న విశాఖపట్నంలోని ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్లో జరిగిన అగ్నిప్రమాదంలో 56 మంది మరణించారు. 150 పైగా గాయపడ్డారు. వీరిలో అత్యధికులు కాంట్రాక్ట్ కార్మికులు. ప్రమాదం జరిగేనాటికి యాజమాన్యం కారాబి చట్టం క్రింద నమోదు చేయని 37 మందితో సహా, ఆ ప్రమాదంలో మరణించిన కార్మికుల ఆశ్రితులందరికీ కూడా నెల రోజులలోగా మొదటి నెల ఆశ్రిత హితలాభం చెక్కులు అందజేయబడ్డాయి. పనిలో చేరిన రెండో రోజునో, మూడో రోజునో ప్రమాదానికి గురై ఒక కార్మికుడు మరణించడం నేను 1998 లో కేరళ రాష్ట్ర కారాబి ప్రాంతీయ నిర్దేశకుడిగా పనిచేస్తున్నప్పుడు ఉద్యోగ మండల్లో ఉన్న ది ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్కోర్ లిమిటెడ్ కర్మాగారంలో సంభవించింది. ఆ కార్మికుని ఆశ్రితులకు కూడా మొదటి నెల హితలాభం నెల దాటకుండానే చెల్లించబడింది. 1940ల నాటి మన దేశ సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, కారాబి (కార్మిక రాజ్య బీమా సంస్థ) చట్టం ఆశ్రితులు పదాన్ని విపులార్ధంలో నిర్వచించింది. మరణించిన ఉద్యోగి భార్య, 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన కుమారులు, వివాహం కాని కుమార్తెలు, వితంతు తల్లి ఆశ్రితులు (డిపెండెంట్స్)గా పరిగణించబడతారు. వీరెవరూ లేనిపక్షంలో, ఆ ఉద్యోగిపై వాస్తవంగా ఆధారపడి జీవిస్తున్నారని నిర్ధారించబడిన భర్త, తండ్రి, తల్లి, ఉద్యోగి తల్లిదండ్రులు మరణించిన పక్షంలో తాత, అమ్మమ్మ, నానమ్మతోపాటు వివాహం కాని లేదా విధవ సోదరి, తలిదండ్రులు ఇద్దరూ మరణించినటువంటి, చనిపోయిన కుమారుడు లేదా కుమార్తె యొక్క పిల్లలు, వివాహం కాని మైనర్ సోదరుడు లేదా సోదరి కూడా ఆశ్రితులు నిర్వచనం పరిధిలోకి వస్తారు. ఈ చట్టం ప్రకారం నెల నెలా అందే ఆశ్రిత హితలాభంతో పాటు, ఆశ్రితులకు ఉచితంగా సంపూర్ణ వైద్య చికిత్స కారాబి ఆసుపత్రుల ద్వారా అందుతుంది. అతి తక్కువ చందాతో ఇట్లాంటి బీమా సదుపాయాలు సమకూర్చే చట్టం అమలు కంటే అతిక్రమణలే సాధారణం కావడం అందరం సిగ్గుపడాల్సిన విషయం.

## తెలుగు సినీమా అధ్యక్షుడు రేసులో గద్దల రమేష్



**పాల్వంచ డిసెంబర్ 27 (స్కై న్యూస్ ):**తెలుగు సినీ%ఁ%టీ.వీ. అవుట్ డోర్ యూనిట్ టెక్నీషియన్ యూనియన్ అధ్యక్షులు ఎన్నికలు 04 జనవరి 2026ఆదివారం జరగబోయే ఎన్నికల్లో తెలుగు ఫిలిం టెక్నీషియన్ యూనియన్ మెంబర్ గద్దల రమేష్ శనివారం నామినేషన్ హైదరాబాదులోని ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫీసులో నామినేషన్ వేసినారు.

# సర్వ రోగ నివారిణి నల్ల వెల్లుల్లి?



మన వంటింట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ లేనిదే ఏ కూర పూర్తి కాదు. వెల్లుల్లి అనగానే మనకు వెంటనే మెరిసే తెల్లటి రెబ్బలు గుర్తొస్తాయి. కానీ, ఇప్పుడు మార్కెట్లో 'నల్ల వెల్లుల్లి' అందరినీ ఆకర్షిస్తోంది. మన వంటింట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ లేనిదే ఏ కూర పూర్తి కాదు. వెల్లుల్లి అనగానే మనకు వెంటనే మెరిసే తెల్లటి రెబ్బలు గుర్తొస్తాయి. కానీ, ఇప్పుడు మార్కెట్లో 'నల్ల వెల్లుల్లి' అందరినీ ఆకర్షిస్తోంది. ఇది ఏదో కృత్రిమంగా రంగు వేసిన పదార్థం కాదు.. అలాగని ఇది ఒక కొత్త రకమైన మొక్క కూడా కాదు. మనం నిత్యం వాడే సాధారణ వెల్లుల్లి నుండే దీనిని తయారు చేస్తారు. దీని రంగు, రుచి, వాసన అన్నీ తెల్ల వెల్లుల్లికి భిన్నంగా ఉంటాయి. తెల్ల వెల్లుల్లిని కొన్ని వారాల పాటు నిర్దిష్టమైన ఉష్ణోగ్రత మరియు తేమ ఉన్న గదుల్లో ఉంచడం ద్వారా ఈ నల్ల వెల్లుల్లి తయారవుతుంది. దీనినే 'ఫర్మెంటేషన్' (పులియబెట్టడం) ప్రక్రియ అని అంటారు. ఈ సమయంలో వెల్లుల్లిలోని రసాయనాలు మారిపోవడంతో అవి నల్లగా మారుతాయి. తెల్ల వెల్లుల్లిలా ఘాటుగా ఉండదు. ఇది చాలా మెత్తగా, తీపి, పులుపు కలిసిన రుచితో ఉంటుంది. తిన్న తర్వాత నోటి నుండి వచ్చే ఆ ఘాటైన వెల్లుల్లి వాసన ఇందులో అస్సలు ఉండదు. తెల్ల వెల్లుల్లి కంటే నల్ల వెల్లుల్లిలో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు రెండు రెట్లు ఎక్కువగా ఉంటాయి. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. తద్వారా గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇందులో ఉండే యాంటీ కార్సినోజెనిక్ గుణాలు క్యాన్సర్ కణాల వృద్ధిని అడ్డుకుంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఇన్ఫెక్షన్లు, అలర్జీల బారి నుండి శరీరాన్ని రక్షించడానికి ఇది ఒక సహజ సిద్ధమైన ఔషధంగా పనిచేస్తుంది. రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. దీనిని నేరుగా కూడా తినవచ్చు లేదా సాస్‌లు, సలాడ్లు మరియు పిజ్జాలపై టాపింగ్‌గా వాడుకోవచ్చు. విదేశాల్లో దీనిని సూప్‌లు, మాంసాహార వంటకాల్లో రుచి కోసం ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. మన దేశంలో కూడా దీని ప్రాముఖ్యత ఇప్పుడు నెమ్మదిగా పెరుగుతోంది. అమ్మమ్మల కాలం నుండి వెల్లుల్లిని ఔషధంగా వాడుతూనే ఉన్నాం. కానీ, ఇప్పుడు ఆధునిక టెక్నాలజీతో రూపుదిద్దుకున్న ఈ నల్ల వెల్లుల్లి మాత్రం 'సూపర్ ఫుడ్' గా గుర్తింపు పొందింది. కేవలం రుచి కోసం మాత్రమే కాకుండా, ఆరోగ్యం కోసం కూడా దీనిని డైట్‌లో చేర్చుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## ఇలా తయారు చేసిన పాలు తాగితే.. బంపర్ బెనిఫిట్స్..



చలికాలంలో చల్లటి వాతావరణం కారణంగా వేడివేడిగా మసాలా ఫుడ్స్ తినడం అంటే దాదాపుగా అందరూ ఇష్టపడుతుంటారు. టైమ్ దొరికితే చాలు.. వెచ్చగా కప్పుకుని హాయిగా పడుకుంటారు..ఇంతవరకు బాగానే ఉన్నా శీతాకాలంలో సీజనల్ వ్యాధులు దాడి చేసే అవకాశం ఎక్కువుంటుంది. అందుకే ఈ సీజన్ లో ఆహారంలో తగిన జాగ్రత్తలు అవసరం అంటున్నారు నిపుణులు. చల్లటి వాతావరణంలో రోగాలను దరిచేరకుండా ఉండేందుకు గోల్డెన్ మిల్క్ రోజు ఒక గ్లాసు తాగితే హెల్త్ కు ఎంతో మంచిదని చెబుతున్నారు. శీతాకాలంలో చల్లదనానికి శరీరం వేడిని త్వరగా కోల్పోతుంది. గోల్డెన్ మిల్క్(పసుపు పాలు) తాగడం వల్ల లోపలి నుండి వేడి పుట్టి, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. వణుకు పుట్టించే చలిని తట్టుకునే శక్తిని ఇస్తుంది. ఈ సీజన్‌లో తరచూగా వచ్చే జలుబు, గొంతు నొప్పి, దగ్గు వంటి సమస్యలను తగ్గించడానికి పసుపులోని కర్కుమిన్ ఉపయోగపడ్తుంది. ఫ్లూ వంటి జ్వరాలను తగ్గించడానికి కూడా సహాయపడుతుంది. ఇది యాంటీవైరల్ కవచంలా పనిచేస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.చలి తీవ్రత పెరిగినప్పుడు కీళ్ల నొప్పులు, వాతం ఎక్కువవుతాయి. పసుపులోని శక్తివంతమైన యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు కండరాలు పట్టెయ్యకుండా సహాయపడుతుంది. కీళ్ల వాపును తగ్గించి, నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుందని ఆయుర్వేదంలో చెప్పబడింది.చలిగాలి వల్ల చర్మం పొడిబారి ఇర్రిటేటింగ్ గా ఉంటుంది. పసుపు పాలలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వు, పసుపులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని లోపలి రిపేర్ చేసి తేమను కాపాడతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. చలి ఎక్కువుంటే నిద్ర సరిగా పట్టదు. రాత్రి పడుకునే ముందు ఈ గోల్డ్ మిల్క్ ఒక్క గ్లాసు తాగితే, పాలలోని ట్రిప్టోఫాన్ అనే సహజమైన అమైనో యాసిడ్ మెదడును రిలాక్స్ చేస్తుంది. పసుపు శరీరం లో నొప్పులను తగ్గించి ఘాఢమైన నిద్రకు సహాయపడుతుంది.

# కలోంజి ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు



కలోంజి లేదా నల్ల జీలకర్ర గింజలు నల్లగా.. చూడటానికి పరిమాణంలో చిన్నగా ఉండవచ్చు.. కానీ దాని ప్రయోజనాలు అపారమైనవి. రోగనిరోధక శక్తిని పెంచడం నుండి గుండె, జీవక్రియ, వాపును నియంత్రించడం వరకు, ఇది శరీరానికి అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుస్తుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. మన వంటగదిలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్న అనేక పదార్థాలు, దినుసులు ఉంటాయి.. అలాంటి వాటిలో.. కలోంజి (నల్ల జీలకర్ర లేదా నిగెల్లా గింజలు) ఒకటి.. కలోంజి శతాబ్దాలుగా ఆయుర్వేదంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఇది అసాధారణంగా అనిపించినప్పటికీ, దానిలో దాగి ఉన్న ఔషధ గుణాలు దీనిని సూపర్‌ఫుడ్‌గా చేస్తాయి. హెల్త్‌లైన్ ప్రకారం, ఈ నల్ల గింజలలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు, యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని అనేక తీవ్రమైన వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడతాయి. అలాగే.. కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం నుండి రోగనిరోధక శక్తిని పెంచడం, మంటను తగ్గించడం వరకు దీని ప్రయోజనాలు ఉంటాయి. కలోంజి గింజల్లో లభించే సమ్మేళనాలు యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. కొన్ని శాస్త్రీయ అధ్యయనాలు సాధారణ మందులకు స్పందించని బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా నల్ల గింజలు ప్రభావవంతంగా ఉన్నాయని చూపించాయి. హెల్త్‌లైన్ ప్రకారం, సరైన మొత్తంలో తీసుకుంటే.. ఇది ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి, శరీరం రోగనిరోధక రక్షణను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. నల్లగా ఉండే కలోంజి గింజల్లో థైమోక్వినోన్, కార్వాక్రోల్, టి-అనెథోల్, 4-టెర్పినోల్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ సమ్మేళనాలు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడంలో సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ కణాలను దెబ్బతీస్తాయి.. క్యాన్సర్, గుండె జబ్బులు, అకాల వృద్ధాప్యం వంటి దీర్ఘకాలిక సమస్యలకు దారితీయవచ్చు. ఈ రాడికల్స్ వల్ల కలిగే ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి ఈ గింజలు సహాయపడతాయి. నల్ల జీలకర్రలోని కొన్ని సమ్మేళనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించవచ్చని, కొన్ని సందర్భాల్లో వాటిని తొలగించవచ్చని అధ్యయనాలు చూపించాయి. దీని యాంటీఆక్సిడెంట్, బయోయాక్టివ్ సమ్మేళనాలు క్యాన్సర్ కణాల వ్యాప్తిని (మెటాస్టాసిస్) నెమ్మదిస్తాయి. భవిష్యత్తులో క్యాన్సర్ నివారణలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో దీర్ఘకాలికంగా వాపు అనేది మధుమేహం, గుండె జబ్బులు, ఆర్థరైటిస్ వంటి అనేక వ్యాధులకు మూల కారణం. నల్ల జీలకర్రలోని శోథ నిరోధక లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. దీన్ని క్రమం తప్పకుండా.. మితంగా తీసుకోవడం వల్ల శరీరంలో కొనసాగుతున్న శోథ ప్రక్రియను నియంత్రించడంలో సహాయపడుతుంది. కలోంజీ కొలెస్ట్రాల్‌ను మాత్రమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను కూడా సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. కొన్ని పరిశోధనలు ఇది కాలేయ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుందని.. జీవక్రియ సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుందని సూచిస్తున్నాయి. డయాబెటిస్ - ఫ్యాటీ లివర్ వంటి పరిస్థితులకు ఇది సహాయక ఆహారంగా కూడా పనిచేస్తుంది. మీరు నల్ల జీలకర్ర గింజలను కూరగాయలు, పప్పులు, సలాడ్లు లేదా పిండితో కలిపి తినవచ్చు. కొంతమంది ఉదయం ఖాళీ కడుపుతో విత్తనాలను నమలడం లేదా దాని నూనెను తీసుకోవడం కూడా చేస్తారు. రాత్రి పూట నీటిలో నానబెట్టి.. ఉదయాన్నే తినవచ్చు.. అలాగే.. ఆ నీటిని తాగవచ్చు.. అయితే, మరేదైనా పదార్థాల మాదిరిగానే, దీనిని మితంగా, అవసరమైతే వైద్యుడి సలహా మేరకు తీసుకోవడం మంచిది.

# ఆరోగ్యానికి ఏ నూనె మంచిది?



కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ వర్సెస్ హాట్ ప్రెస్డ్ ఆయిల్.. ఈ రోజుల్లో కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ బాగా ప్రాచుర్యం పొందింది. కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. ఆరోగ్యంగా ఉండటానికి, మీరు నూనెను తెలివిగా ఎంచుకోవాలి. మీరు తీసుకునే నూనె మీ ఆరోగ్యాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది. అందువల్ల, మితంగా ఆరోగ్యకరమైన నూనెను మాత్రమే ఉపయోగించడం ప్రయోజనకరం. మార్కెట్లో మీరు రెండు రకాల నూనెలను చూసి ఉంటారు. కోల్డ్-ప్రెస్డ్ - హాట్-ప్రెస్డ్. ఇప్పటివరకు, చాలా మంది మార్కెట్ నుండి సాధారణ నూనెను కొన్నారు. లేదంటే మిల్లు నుండి తీయించిన నూనెను డి ఉంటారు. అయితే, ఈ రోజుల్లో, ఆరోగ్య స్పృహ ఉన్న వినియోగదారులు కోల్డ్-ప్రెస్డ్ నూనెను ఉపయోగించడం ప్రారంభించారు. ఇది సాధారణ నూనె కంటే చాలా ఖరీదైనది. కోల్డ్-ప్రెస్డ్ ఆయిల్ - హాట్-ప్రెస్డ్ ఆయిల్ మధ్య తేడా, ఏ నూనె మంచిది అని మీరు తెలుసుకోవాలి..! సాధారంగా నూనెను తీయడానికి రెండు పద్ధతులు ఉన్నాయి. కోల్డ్-ప్రెస్డ్ - హాట్-ప్రెస్డ్. ఒక పద్ధతి విత్తనాలను వేడి చేసే శక్తితో చూర్ణం చేయడం ద్వారా నూనెను తీస్తారు. మరొక పద్ధతి వేడి లేకుండా సున్నితమైన ఒత్తిడితో విత్తనాలను పదే పదే నొక్కడం ద్వారా నూనెను తీస్తారు. ఈ నూనె సాధారణ నూనె కంటే ఖరీదైనది. కోల్డ్ ప్రెస్డ్ ప్రక్రియలో, వేరుశెనగలు, ఆలివ్‌లు, సోయాబీన్స్, పొద్దుతిరుగుడు పువ్వులు, బాదం, నువ్వులు, ఇతర విత్తనాలను సహజ పద్ధతులను ఉపయోగించి రుబ్బుతారు. ఈ ప్రక్రియలో, నూనె బయటకు రావడం ప్రారంభించే వరకు విత్తనాలను చాలా తక్కువ వేడి వద్ద రుబ్బుతారు. దీని ప్రత్యేకత ఏమిటంటే నూనెలోని అన్ని పోషక అంశాలు చెక్కుచెదరకుండా ఉంటాయి. కోల్డ్ ప్రెస్డ్ నూనెలో సాధారణ నూనె కంటే ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లతో పాటు విటమిన్ సి, ఇ, కె ఎక్కువగా ఉంటాయి. అందుకే కోల్డ్ ప్రెస్డ్ నూనె మరింత ఆరోగ్యకరమైనదిగా భావిస్తారు. మరోవైపు, వేడి-ఒత్తిడి చేసిన నూనెను అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేయడం ద్వారా తీస్తారు. హైడ్రాలిక్ ప్రెస్ ఉపయోగించి విత్తనాలను నొక్కడం ద్వారా నూనెను తీస్తారు. ఈ నూనెను ఫిల్టర్ చేసి మీకు అందిస్తారు. వేడి-ఒత్తిడి చేసిన నూనెను మరింత త్వరగా, ఎక్కువ పరిమాణంలో తీస్తారు. కానీ వేడి నూనెలోని పోషకాలను నాశనం చేస్తుందంటున్నారు నిపుణులు. అందువల్ల, ఈ నూనె కోల్డ్-ఒత్తిడి చేసిన నూనె వలె ఆరోగ్యకరమైనది కాదంటున్నారు. ఆరోగ్యం విషయానికి వస్తే, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ మంచిది. ఈ నూనెలో విటమిన్లు మరియు ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. మరోవైపు, హాట్ ప్రెస్డ్ ఆయిల్ పోషకాలను నాశనం చేస్తుంది. ఇది శరీరానికి తక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. హాట్ ప్రెస్డ్ ఆయిల్‌ను మరింత శుద్ధి చేస్తే, అది మరింత హానికరంగా మారుతుంది. అందువల్ల, నూనెను తీసుకునేటప్పుడు, శరీరానికి దాని ప్రయోజనాలు అందేలా చూసుకోవడానికి కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్‌ను మాత్రమే తీసుకోండి. పరిమిత పరిమాణంలో నూనెను వాడండి.

# టమోటాలు ఎక్కువగా తింటున్నారా?



టమోటాలను చాలా మంది ఇష్టంగా తింటారు.. కూరగా అలాగా చట్నీగా తింటారు.. అలాగే.. పప్పుతోపాటు అనేక రకాల వంటల్లో టామాటాలను వేస్తారు.. ఇవి కూర రుచిని మరింత పెంచుతాయి.. అయితే.. టమోటాలు అధికంగా తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, కొన్ని ఆరోగ్య సంబంధిత సమస్యలను ఎదుర్కోవలసి రావచ్చని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. టమోటాలు పోషకాలతో నిండి ఉంటాయి. టమోటాల్లోని విటమిన్లు, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడతాయి.. కానీ టామాటలను ఎక్కువగా తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యంపై సానుకూల ప్రభావాలకు బదులుగా ప్రతికూల ప్రభావాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.. అదుకే.. కొంతమంది టమోటాలను నివారించాలని కూడా సలహా ఇస్తారు. ఎక్కువ టమోటాలు తినడం వల్ల పేగు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆమ్లత్వం - ఉబ్బరం వంటి కడుపు సమస్యలను నివారించడానికి.. పరిమితుల్లో టమోటాలు తినాలని సూచిస్తున్నారు. టమోటాలు ఎక్కువగా తినే వ్యక్తులు ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ లక్షణాలను అనుభవించవచ్చు. ఇంకా, టమోటాలు ఆమ్లత్వం, గుండెల్లో మంట వంటి సమస్యలను కూడా కలిగిస్తాయి. మీకు ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ ఉంటే, మీరు టమోటాలు తినకుండా ఉండాలి. మీకు ఎసిడిటీ, గుండెల్లో మంట ఉంటే టమోటాలు తినకుండా ఉండటం కూడా మంచిది. వాస్తవానికి టమోటాలు ఆమ్ల స్వభావం కలిగి ఉంటాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, టమోటాలను పెద్ద పరిమాణంలో తీసుకోవడం వల్ల మూత్రాశయ చికాకు వస్తుంది. మీరు అలాంటి సమస్యలతో బాధపడకూడదనుకుంటే, టమోటాలను ఎక్కువగా తినడం మానుకోండి.. లేకుంటే మీరు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. టమోటాలు సరైన పరిమాణంలో, సరైన పద్ధతిలో తీసుకుంటేనే అవి మీ ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి.టమోటా గింజలు కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే కిడ్నీలో రాళ్లు ఉన్నవారు టమోటాలకు దూరంగా ఉండటం మంచిది. ఇంకా, పెద్ద మొత్తంలో టమోటాలు తినడం వల్ల అలెర్జీ ప్రతిచర్యలు కూడా వస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే.. ఏదైనా మితంగా తీసుకుంటే మంచిదని.. ఎక్కువగా తీసుకుంటే హాని తప్పదంటూ పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు.. ఏమైనా అనారోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించడం మంచిది.

## బిజినెస్

# వచ్చే ఐదేళ్లలో ఐదు రెట్ల వృద్ధి లక్ష్యం

### బలహీన రూపాయి ప్రభావం..
### ధరలు పెంచిన మెర్సిడెస్ బెంజ్



దేశంలోని ప్రీమియం విదేశీ కార్ల తయారీ కంపెనీలు వరుసగా ధరల పెంపును ప్రకటిస్తున్నాయి. ఇటీవలే బీఎండబ్ల్యూ పెంపు నిర్ణయం తీసుకోగా, మరో లగ్జరీ కార్ల తయారీ కంపెనీ మెర్సిడెస్ బెంజ్ కూడా తమ కార్ల ధరలు పెంచుతున్నామని స్పష్టం చేసింది. ఇటీవలి పరిణామాల మధ్య యూరోతో పోలిస్తే భారత కరెన్సీ రూపాయి మారకం విలువ క్షీణించడం వల్ల దిగుమతులు, సరఫరా, ఇతర ఖర్చులు పెరిగాయని, ఆ భారాన్ని అధిగమించేందుకు వచ్చే ఏడాదిలో దశల వారీగా ప్రతి త్రైమాసికానికి ఒకసారి ధరలు పెంచుతామని కంపెనీ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యార్ తెలిపారు. జనవరి 1 నుంచి మొదటి దశలో భాగంగా అన్ని మోడళ్లపై 2 శాతం వరకు పెంపు ఉండనుంది. 2025లో యూరో-రూపాయి మారకపు రేటు నిలకడగా రూ. 100 మార్కు కంటే ఎక్కువగా ఉండటం, ఇది చారిత్రక సగటుల కంటే గణనీయంగా ఎక్కువ కావడం వంటి విదేశీ మారకపు సవాళ్లు ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని కంపెనీ పేర్కొంది.వచ్చే ఏడాది ప్రతి త్రైమాసికంలో ధరల పెంపు గురించి ఆలోచిస్తున్నాం. 18 నెలల క్రితం యూరోకు రూ. 89 ఉండేది. ఇప్పుడు రూ. 104-105కి చేరింది. అంటే 15-18 శాతం క్షీణత. జనవరిలో పెంపు తర్వాత కూడా 10-15 శాతం అంతరం ఉంటుందని సంతోష్ అయ్యర్ వెల్లడించారు.

### వచ్చే ఐదేళ్లలో టాటా మోటార్స్ నుంచి 5 ఈవీలు



ప్రముఖ దేశీయ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) విభాగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈవీ విభాగాన్ని మరింత విస్తరించాలని భావిస్తున్నట్టు తాజాగా ఓ ప్రకటనలో తెలిపింది. దీనికోసం 2030 నాటికి కొత్తగా ఐదు ఈవీ మోడళ్లను మార్కెట్లోకి తీసుకొచ్చే ప్రణాళిక సిద్ధంగా ఉందని తెలిపింది. వీటిలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రీమియం అవిన్య మోడల్ కూడా ఉంది. దీని ద్వారా దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈవీ ప్యాసింజర్ వాహన విభాగంలో స్థిరంగా 45-50 శాతం వాటాను దక్కించుకోవాలని కంపెనీ భావిస్తోంది. 2029-2030 మధ్య కాలంలో ఈవీ వ్యాపారంలోకి రూ. 16,000-18,000 కోట్ల పెట్టుబడులు పెడతామని, కొత్త మోడళ్లతో పాటు దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగా ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాలను పెంచుతామని కంపెనీ స్పష్టం చేసింది. ఇప్పటికే తాము దేశీయ ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన మార్కెట్లో ఆధిపత్యం కొనసాగిస్తున్నాం. ఈ విభాగంలోని మొత్తం అమ్మకాల్లో దాదాపు మూడింట రెండు వంతులు అంటే దాదాపు 66 శాతం వాటాతో కొనసాగుతున్నాయి. ఇతర కంపెనీలతో పోటీ పెరుగుతున్నప్పటికీ, అనుకున్న సమయానికి స్థిరమైన 50 శాతం వరకు వాటాను కొనసాగించగలమని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శైలేష్ చంద్ర అన్నారు.

నీటి నిర్వహణ, ఇండస్ట్రియల్ పార్కులు, అర్బన్ సొల్యూషన్స్ రంగాల్లో వ్యాపారాలను నిర్వహిస్తోన్న రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తన కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తోన్నట్లు ప్రకటించింది. ఇటీవల అప్పురహిత సంస్థగా మార్చినట్లు వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో రెవెన్యూలో ఐదు రెట్ల వృద్ధిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌లో రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) సునీల్ నాయర్, చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (సిఎఫ్ఒ) శ్రవంత్ రాయపూడితో కలిసి మీడియాతో మాట్లాడారు. 2025 ముగింపు నాటికి తమ కార్యకలాపాలను మరింత పటిష్టం చేసుకోవడానికి వీలుగా అప్పురహిత కంపెనీగా మార్చామన్నారు. గత ఐదేళ్లుగా చేపట్టిన పునర్నిర్మాణ ప్రక్రియ ముగిసిందని.. ప్రస్తుతం స్టాండ్‌లోన్ స్థాయిలో ఎటువంటి టర్మ్ అప్పులు లేవన్నారు. కేవలం పూర్తి చేసిన ఒక ప్రాజెక్టుకు సంబంధించి రూ.160 కోట్ల రుణం మాత్రమే ఉందన్నారు. ప్రస్తుతం కంపెనీ రెవెన్యూ రూ.2వేల కోట్ల పైగా ఉందన్నారు. ప్రతీ ఏడాది సగటున 25-30 శాతం వృద్ధితో వచ్చే ఐదేళ్లలో ఐదు రెట్ల వృద్ధితో 1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ9వేల కోట్లు) రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతర్జాతీయంగా ముఖ్యంగా ఒమన్, సౌదీ ఇతర మిడిల్ ఈస్ట్ దేశాల్లోని ఇండస్ట్రియల్ పార్కులు, నీటి ప్రాజెక్టులపై దృష్టి కేంద్రీకరించామన్నారు. మహారాష్ట్రలో లైఫ్ సైన్సెస్ సహా మరో పెద్ద ఇండస్ట్రియల్ పార్కులను నిర్మించడానికి ప్రాథమిక ఒప్పందాలను కుదుర్చుకుందన్నారు. ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రా,





వాటర్, అర్బన్ సొల్యూషన్స్ రంగాల్లో వస్తున్న అవకాశాలను అందుకోవడానికి తాము సిద్దంగా ఉన్నామని సునీల్ నాయర్ పేర్కొన్నారు. తాము రూ.2,085 కోట్ల కొత్త ఆర్డర్లను సాధించడం ద్వారా ఆర్డర్ బుక్ రూ.9,000 కోట్లకు పైగా పెరిగిందని శ్రవంత్ రాయపుడి తెలిపారు. అదనంగా సుమారు రూ.3,000 కోట్ల విలువైన ప్రాజెక్టుల కోసం కంపెనీ అత్యల్ప ధరను కోట్ చేసిన బిడ్డర్‌గా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు.

### ద్రవ్యోల్బణ డేటా కోసం ఈ-కామర్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి వివరాల సేకరణ



వినియోగదారుల ధరల సూచిక (సీపీఐ) డేటా విశ్వసనీయత, ఖచ్చితత్వం, నాణ్యతను మరింత మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కించడానికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లను కూడా సమీక్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్‌లు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి ధరలతో పాటు, రిటైల్ స్టోర్ల నుంచి ధరల సమాచారం చేర్చడం ద్వారా రిటైల్ ద్రవ్యోల్బణం లెక్కింపును మెరుగుపరచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇదే సమయంలో గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ(మోస్పీ) ద్రవ్యోల్బణం (సీపీఐ), పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ), దేశ స్థూల జాతియోత్పత్తి (జీడీపీ) లను లెక్కించడానికి ఉపయోగించే బేస్ సంవత్సరాలను కూడా మార్చాలని భావిస్తోంది. 2024ని బేస్ ఇయర్‌గా ఉన్న కొత్త ద్రవ్యోల్బణ సూచీ 2026, ఫిబ్రవరిలో విడుదల చేయనున్నారు. అయితే సవరించిన సంవత్సరాల ఆధారంగా కొత్త జీడీపీ, పారిశ్రామిక డేటా 2026 తరువాత విడుదల అవుతాయి. మెరుగైన డేటా కోసం ప్రభుత్వం విమాన టిక్కెట్లు, మొబైల్ సేవలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల వంటి వాటి కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ల నుంచి, ఇంధన ధరలు, రైల్వే ఛార్జీలు, పోస్టల్ ఛార్జీల కోసం ప్రభుత్వ విభాగాల నుంచి ధరలను సేకరిస్తుంది. 12 పెద్ద నగరాల్లో ఆన్‌లైన్ ధరల డేటాను సేకరించనుండగా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా వివరాలు సేకరిస్తారు.

### విజయ్ మాల్యా లొంగిపోతేనే పిటిషన్లు పరిశీలిస్తాం



భారత న్యాయవ్యవస్థకు లొంగిపోయే వరకు, విజయ్ మాల్యా పిటిషన్లను పరిశీలించేది లేదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల (ఎఫ్ఈఓ) చట్టానికి' వ్యతిరేకంగా వ్యాపారవేత్త విజయ్ మాల్యా దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆయన లొంగిపోయే వరకు, కోర్టు సదరు పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, న్యాయమూర్తి జస్టిస్ గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. మాల్యా భారతదేశానికి ఎప్పుడు తిరిగి రావాలని యోచిస్తున్నారని ప్రశ్నించింది. 2016 నుంచి యూకేలో నివసిస్తున్న మాల్యా, హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో ఒకటి తనను పారిపోయిన ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించిన ఉత్తర్వులను సవాలు చేశారు. 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ మరొక పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లను విచారించాలంటే, మాల్యా ముందుగా భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాలని ఆయన న్యాయవాది అమిత్ దేశాయ్‌కు కోర్టు సూచించింది. పారిపోయిన ఆర్థిక నేరస్థుడు, మన దేశ కోర్టుల పరిధిలోకి రాకుండానే, ఎఫ్ఈఓ చట్టాన్ని వ్యతిరేకిస్తూ వేసిన పిటిషన్‌ను అనుమతించకూడదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు.

## స్పోర్ట్స్

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి



దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లి మరో చరిత్ర సృష్టించాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా 16000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. విరాట్ 10, 11, 12, 13, 14, 15 వేల పరుగులను కూడా అత్యంత వేగంగా పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డుల్లో ఉన్నాడు. విరాట్ 16000 పరుగుల అత్యంత అరుదైన మైలురాయిని కేవలం 343 మ్యాచ్‌ల్లో తాకాడు. విరాట్‌కు ముందు భారత్ తరఫున సచిన్ మాత్రమే ఈ మైలురాయిని అధిగమించాడు. సచిన్ 551 మ్యాచ్‌ల్లో 21999 పరుగులు చేసి, లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో ఇంగ్లండ్ ఆటగాళ్లు గ్రహం గూచ్ (22211), గ్రేమ్ హిక్ (22059) మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. ఈ జాబితాలో విరాట్ తొమ్మిదో స్థానంలో నిలిచాడు. విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో విరాట్ 16000 పరుగుల మైలురాయిని తాకాడు. ఈ మ్యాచ్‌లో తొలి పరుగు పూర్తి చేయగానే విరాట్ ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ సెంచరీ కూడా చేశాడు. ఆంధ్ర నిర్దేశించిన 299 పరుగుల లక్ష్య ఛేదనలో 85 బంతులు ఎదుర్కొని 11 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 107 పరుగులతో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ జట్టు ఢిల్లీ గెలవాలంటే ఇంకా 79 పరుగులు చేయాలి. విరాట్‌తో పాటు నితీశ్ రాణా (37) క్రీజ్‌లో ఉన్నాడు. 27.4 ఓవర్ల తర్వాత ఢిల్లీ స్కోర్ 220/2గా ఉంది. అంతకుముందు ఢిల్లీ ఇన్నింగ్స్‌లో ప్రియాంశ్ ఆర్య సుడిగాలి ఇన్నింగ్స్ ఆడాడు. ప్రియాంశ్ కేవలం 44 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 74 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆంధ్ర తరఫున రికీ భుయ్ (122) సెంచరీ చేశాడు. ఆ జట్టు కెప్టెన్ నితీశ్ కుమార్ రెడ్డి 23 పరుగులకు ఔటయ్యాడు. ఢిల్లీ బౌలర్లలో సిమర్‌జీత్ సింగ్ 5 వికెట్లతో సత్తా చాటాడు.

# 15 సిక్సర్లు, 16 ఫోర్లతో 190 రన్స్.. వైభవ్ సూర్యవంశీ సెన్సేషనల్ సెంచరీ

**రాంచీ :** వైభవ్ సూర్యవంశీ మళ్లీ చెలరేగాడు. సిక్సర్లు, ఫోర్లతో ఊచకోత కోశాడు. విజయ్ హజారే టోర్నీలో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న వన్డేల్లో సెన్సేషనల్ సెంచరీ కొట్టేశాడు. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డ బీహారీ యువ కెరటం.. కేవలం 84 బంతుల్లో 190 రన్స్ చేసి ఔటయ్యాడు. తాజాగా ముగిసిన అండర్19 ఆసియాకప్‌లోనూ సెంచరీతో హోరెత్తించిన వైభవ్.. ఇవాళ రాంచీలో జరుగుతున్న మ్యాచ్‌లో దుమ్మురేశాడు. సూర్యవంశీ ఇన్నింగ్స్‌లో 15 సిక్సర్లు, 16 బౌండరీలు ఉన్నాయి. 226 స్ట్రయిక్ రేట్‌తో వైభవ్ తన పవర్ హిట్టింగ్ ప్రదర్శించాడు. టాస్ గెలిచిన బీహార్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. ఫస్ట్ వికెట్‌కు వైభవ్, మంగళ్ ఇద్దరూ కలిసి 158 రన్స్ జోడించారు. ఆ తర్వాత జట్టు స్కోరు 261 రన్స్ వద్ద ఉన్న సమయంలో వైభవ్ వ్యక్తిగతంగా 190 రన్స్ చేసి నిష్క్రమించాడు. 14 ఏళ్ల సూర్యవంశీ బ్యాటింగ్ రికార్డులను తిరగరాశాడు. లిస్టు ఏ మ్యాచుల్లో సెంచరీ చేసిన యువ బ్యాటర్‌గా రికార్డు క్రియేట్ చేశాడతను. వన్డే క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో 150 రన్స్ చేసిన క్రికెటర్‌గా నిలిచాడు. వన్డేల్లో డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్నాడు. తొలి బంతి నుంచే హిట్టింగ్ చేసిన సూర్యవంశీ కేవలం 36 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత 54 బంతుల్లో అతను 150 రన్స్ మార్క్ క్రాస్ చేశాడు. తాజా సమాచారం ప్రకారం బీహార్ 29 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 272 రన్స్ చేసింది.



# రోహిత్ శర్మ మెరుపు శతకం



విజయ్ హజారే ట్రోఫీ 2025-26 ప్రారంభమైన తొలి రోజే సెంచరీల మోత మోగుతుంది. తొలుత యువ చిచ్చరపిడుగు, ఆతర్వాత పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్.. తాజాగా హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ విధ్వంసకర శతకాలు బాదారు. సిక్కింతో జరుగుతున్న మ్యాచ్‌లో రోహిత్ కేవలం 61 బంతుల్లోనే 8 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేసి ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు. 91 బంతుల్లో 150 పరుగుల మార్కును కూడా దాటాడు. విజయ్ హజారే ట్రోఫీలో రోహిత్ 17 ఏళ్ల తర్వాత సాధించిన శతకం ఇది. సిక్కిం నిర్దేశించిన 237 పరుగుల లక్ష్య ఛేదనలో రోహిత్ ఈ సూపర్ ప్రదర్శన చేశాడు. టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ ఇటీవల ఆస్ట్రేలియా, సౌతాఫ్రికాపై కూడా పరుగుల వరద పారించాడు. ఆసీస్‌పై సెంచరీ, హాఫ్ సెంచరీ.. ఆతర్వాత సౌతాఫ్రికాపై రెండు హాఫ్ సెంచరీలు చేసి, 38 ఏళ్ల లేటు వయసులోనూ శభాష్ అనిపించుకున్నాడు. సిక్కింతో మ్యాచ్ విషయానికొస్తే.. రోహిత్ శతక్కొట్టుడుతో ముంబై విజయానికి చేరువగా ఉంది. 29.1 ఓవర్ల తర్వాత ఆ జట్టు వికెట్ నష్టానికి 226 పరుగులు చేసి, లక్ష్యానికి 11 పరుగుల దూరంలో ఉంది. రోహిత్ 93 బంతుల్లో 18 ఫోర్లు, 9 సిక్సర్ల సాయంతో 155 పరుగులు చేసి క్రీజ్‌లో ఉన్నాడు. అతనికి జతగా ముషీర్ ఖాన్ (25) ఉన్నాడు.

## నా బిడ్డ ఎవరో తెలుసా..?
## మైసా గ్లింప్స్‌లో అదరగొట్టేసిన రష్మిక



ఈ ఏడాది బాక్సాఫీస్‌ను రప్ప రప్పా ఆడించేసింది రష్మిక మందన్నా.. తను హీరోయిన్‌గా నటించిన ఛావా, థామా, కుబేర, ద గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలు వందల కోట్లు రాబట్టాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ మైసా అనే లేడీ ఓరియంటెడ్ ఫిలిం చేస్తోంది. బుధవారం (డిసెంబర్ 24న) ఈ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. "నా బిడ్డ సచ్చిందన్నారు. కానీ మట్టే వణికిపోయింది.. నా బిడ్డ రక్తాన్ని దాసలేక, గాలే ఆగిపోయింది.. దాని ఊపిరి మోయలేక, అగ్గే బూడిదైంది.. మండుతున్న నా బిడ్డని సూడలేక.." అన్న సంభాషణతో వీడియో మొదలైంది. నా బిడ్డను సంపలేక సావే సచ్చిపోయింది.. నా బిడ్డ ఎవరో తెలుసా.. అంటూ రష్మికను పవరల్‌ఫుల్ లేడీ వారియర్‌గా చూపించారు. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిలింస్ నిర్మిస్తోంది. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ 2026లో విడుదల కానుంది.


## నా బిడ్డ ఎవరో తెలుసా?
## మైసా గ్లింప్స్‌లో అదరగొట్టేసిన రష్మిక

ఈ ఏడాది బాక్సాఫీస్‌ను రప్ప రప్పా ఆడించేసింది రష్మిక మందన్నా.. తను హీరోయిన్‌గా నటించిన ఛావా, థామా, కుబేర, ద గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలు వందల కోట్లు రాబట్టాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ మైసా అనే లేడీ ఓరియంటెడ్ ఫిలిం చేస్తోంది. బుధవారం (డిసెంబర్ 24న) ఈ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. "నా బిడ్డ సచ్చిందన్నారు. కానీ మట్టే వణికిపోయింది.. నా బిడ్డ రక్తాన్ని దాసలేక, గాలే ఆగిపోయింది.. దాని ఊపిరి మోయలేక, అగ్గే బూడిదైంది.. మండుతున్న నా బిడ్డని సూడలేక.." అన్న సంభాషణతో వీడియో మొదలైంది. నా బిడ్డను సంపలేక సావే సచ్చిపోయింది.. నా బిడ్డ ఎవరో తెలుసా.. అంటూ రష్మికను పవరల్‌ఫుల్ లేడీ వారియర్‌గా చూపించారు. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిలింస్ నిర్మిస్తోంది. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ 2026లో విడుదల కానుంది.







## దండోరా' సెన్సార్ రిపోర్ట్.. బూతు పదంతో సహా 15 మార్పులు!

రవికృష్ణ, నవదీప్, నందు, మనికా చిక్కాల, బింధు మాధవి, రాధ్య, అదితీ భావరాజు, శివాజీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం గురువారం విడుదల కానుంది. తాజాగా ఈ మూవీ సెన్సార్ పూర్తి చేసుకుంది. సినిమా చూసిన సెన్సార్ సభ్యులు ఓ బూతు పదంతో సహా మొత్తంగా 15 మార్పులు సూచిస్తూ యూ/ఏ సర్టిఫికేట్ జారీ చేశారు. 2.16 గంటల నిడివితో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఇందులో వాడిన కొన్ని బూతు పదాలను కచ్చితంగా తొలగించాలని ఆదేశించారు. అలాగే సినిమా ప్రారంభంలో వాయిస్ ఓవర్‌తో ఇందులోని పాత్రలు కల్పితనమి పేర్కొనాలని సెన్సార్ బోర్డ్ సూచించింది. కొన్ని సన్నివేశాలను బ్లర్ చేయాలని ఆదేశించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌తో ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. రిలీజ్‌కు ముందే బిజినెస్‌ను పూర్తి చేసుకోవటం విశేషం. చిత్రాన్ని నైజాంలో మైత్రీ మూవీస్ సంస్థ రిలీజ్ చేస్తుంటే.. ఆంధ్ర, సీడెడ్, కర్ణాటక ఏరియాల్లో ప్రైమ్ షో రిలీజ్ చేస్తోంది. ఓవర్సీస్‌లో 200కు పైగా థియేటర్స్‌లో సినిమాను అథర్వణ భద్రకాళి పిక్చర్స్ గ్రాండ్ రిలీజ్ చేస్తోంది. ఓవర్సీస్‌లో అయితే నిన్ననే(డిసెంబర్ 23) ప్రీమియర్స్ పడ్డాయి.




## జపాన్‌లో 'యానిమల్' సినిమా

జపాన్‌లో ఇండియన్ సినిమాలు సత్తా చాటుతున్నాయి. ఇప్పటికే బాహుబలి మొదలుకొని కల్కి , ఆర్‌ఆర్‌ఆర్, దేవర వరకూ జపాన్‌లో విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకొన్నాయి. ఈ క్రమంలోనే తాజాగా 'యానిమల్' సినిమా విడుదల కానుంది. 2023లో విడుదలైన ఈ మూవీ ఇండియాన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. టాలీవుడ్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన ఈ చిత్రంలో రణబీర్ కపూర్, రష్మిక నటించారు. సందీప్ రెడ్డి మునుపటి దర్శకత్వం వహించిన కబీర్ సింగ్ మాదిరిగానే, 'యానిమల్' మూవీపై కూడా విమర్శలు వచ్చాయి. అయితే, ప్రేక్షకుల నుండి ఆదరణ లభించింది. ఆ ఏడాదలో అత్యంత చర్చనీయాంశమైన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు జపాన్ సినిమా మార్కెట్‌ను యానిమల్ టార్గెట్ చేస్తుంది. 2026 ఫిబ్రవరి 13న ఈ మూవీ విడుదల కానున్నట్లు టీ-సీరిస్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. బాక్సాఫీస్ కలెక్షన్స్ ట్రేడ్ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ కూడా తన సోషల్ మీడియాలో ఈ ప్రకటనను పంచుకున్నారు. యానిమల్ జపాన్‌కు చేరుకుందంటూ పేర్కొన్నారు.



## విక్రాంత్ , చాందినీ చౌదరి సంతాన ప్రాప్తిరస్తు..
## రెండు ఓటీటీల్లోనూ సూపర్ రెస్పాన్స్..!

విక్రాంత్ చాందినీ చౌదరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'.సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం నవంబర్ 14న రిలీజై మంచి రెస్పాన్స్ రాబట్టుకుంది. రీసెంట్‌గా డిసెంబర్ 19 నుంచి ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ వీడియో,జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. కాగా ఓటీటీలో కూడా అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న తెలుగు సినిమాల్లో నవంబర్ 1 ర్యాంకింగ్‌లో నిలిచినట్టు మేకర్స్ ప్రకటించారు. అంతేకాదు అమెజాన్ ప్రైం వీడియో ఇండియాలో టాప్ 10లో నిలిచింది. కథ, సంగీతం, నటీనటుల పర్‌ఫార్మెన్స్‌కు పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందడమే కాకుండా సోషల్ మీడియాలో కూడా సూపర్ బజ్ నడుస్తోంది. ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్, అభినవ్ గోమఠం, వెన్నెల కిషోర్, మురళీ ధర్ గౌడ్ కీలక పాత్రల్లో నటించారు. చైతన్య (విక్రాంత్) ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అతడు ఓ ఎగ్జామ్ సెంటర్ లో కల్యాణి (చాందిని చౌదరి)ని చూసి ప్రేమలో పడతాడు. వీరి ప్రేమను కళ్యాణి తండ్రి ఒప్పుకోకపోవడంతో ఇద్దరూ పారిపోయి పెళ్లి చేసుకుంటారు. త్వరగా ఓ బిడ్డను కనేస్తే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని భావించి చైతన్య ఓ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆశ్రయిస్తాడు. అయితే పరీక్షలు చేయించుకోగా చైతన్యకు ఓ సమస్య ఉందని తేలుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది.. ఇంతకీ ఇద్దరికీ పిల్లలు పుట్టారా.. లేదా అనే నేపథ్యంలో సాగే కథ అందరినీ ఇంప్రెస్ చేస్తూ సాగుతుంది.



## ప్రభాస్ రాజాసాబ్‌కు లాంగ్ రన్‌టైం ఫిక్స్.. మరి ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటారా..?

టాలీవుడ్ డైరెక్టర్ మారుతి-గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంబోలో వస్తోన్న చిత్రం రాజాసాబ్ హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్ ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్, రిద్ధికుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ఎస్ థమన్ మ్యూజికల్ ఆల్బమ్ నుంచి మరో సాంగ్ వస్తోంది. కాగా ఇప్పుడు రాజాసాబ్ రన్‌టైం టాపిక్ ఆసక్తికరంగా మారింది. కొన్ని సినిమాలకు కథానుగుణంగా లాంగ్ రన్ టైం ఫిక్స్ చేస్తారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇటీవలి కాలంలో వచ్చిన పుష్ప 2, అవతార్ ౩, ధురంధర్ సినిమాలు ఈ కేటగిరీలోకే వస్తాయి. ఈ సినిమాలు ౩ గంటల 20 నిమిషాలు అంతకంటే ఎక్కువ రన్‌టైంతో ఉన్నాయి. ఇదే లైన్‌లో ప్రభాస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రాజాసాబ్ ఉండబోతుందన్న వార్త ఒకటి ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. రాజాసాబ్ మేకర్స్ లాంగ్ రన్‌టైంకే ఎక్కువ ఆసక్తి చూపించారని ఇన్‌సైడ్ టాక్. ఫిలింనగర్ సర్కిల్ కథనాల ప్రకారం రాజాసాబ్ రన్ టైం 3 గంటలు ఉందట. మారుతి టీం టైటిల్స్,క్రెడిట్స్‌తో కలిపి ఈ రన్‌టైం ఫిక్స్ చేసినట్టు టాక్. అంటే మరీ సాగదీసిన ఫీలింగ్ అనిపించదని.. ఇంతకంటే ఎక్కువ రన్‌టైం ఉన్న సినిమాలను చూస్తే అర్థమవుతోంది. రన్ టైం విషయంలో యాక్షన్ ప్యాక్‌డ్ సినిమాల ట్రెండ్‌తో పోలిస్తే రాజాసాబ్ హార్రర్ కామెడీ కావడం.. గ్లామరస్ కోటెంట్‌తోపాటు రొమాన్స్, సాంగ్స్, కామెడీ ఎలిమెంట్స్‌తో ఉండే రన్‌టైంను సంక్రాంతి సీజన్‌కు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే షేర్ చేసిన రాజాసాబ్ పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్స్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రాజాసాబ్ గ్లింప్స్‌లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతూ నయా లుక్‌లో కనిపిస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌కు విజువల్ ట్రీట్ ఇస్తున్నాడు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. రాజాసాబ్‌లో సంజయ్ దత్ సంజూబాబా పాత్రలో కనిపించబోతున్నాడు.

# ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీ తగ్గింపు.. కేంద్రం స్పందన ఇదే..

**ఢిల్లీ:** దేశ రాజధాని నగరం ఢిల్లీ సహా చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్న వేళ.. ఎయిర్ ప్యూరిఫైయర్లపై 18 శాతం జీఎస్టీ కొనసాగిస్తుండటంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం తరఫున విచారణకు విచారణకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) వెంకటరమణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎయిర్ ప్యూరిఫైయర్లపై దాఖలైన పిల్‌ను వ్యతిరేకించారు. దీనిపై వివరణాత్మక అఫిడవిట్ దాఖలుకు సమయం ఇవ్వాలని కోరారు. ఎయిర్ ప్యూరిఫైయర్లను వైద్య పరికరంగా పరిగణించి.. 5 శాతం జీఎస్టీ శ్లాబులోకి తీసుకొచ్చేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఢిల్లీ కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైన విషయం తెలిసిందే. న్యాయవాది కపిల్ మదన్ దాఖలు చేసిన ఈ పిటిషనుపై కేంద్రానికి హైకోర్టు నోటీసు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వెంకటరమణ శుక్రవారం వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా.. జీఎస్టీ రేట్లను సరైన ప్రక్రియ తర్వాత జీఎస్టీ కౌన్సిల్ మాత్రమే నిర్ణయించగలదు. అలాగే, ఈ పిటిషన్‌పై స్పందించడానికి రెండు రోజుల సమయం సరిపోదన్నారు.

ఈ విషయంపై వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయడానికి పది రోజుల సమయం ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. జీఎస్టీ తగ్గింపునకు ఒక ప్రక్రియ ఉందని, ఈ ప్రక్రియను అడ్డుకోలేమని కోర్టుకు తెలిపారు. జీఎస్టీ కౌన్సిల్ ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ అని, ఇది సమాఖ్య పన్ను అని వివరించారు. ఈ ప్రక్రియలో అన్ని రాష్ట్రాలు పాలుపంచుకుంటాయని, ఏదైనా విషయంపై ఓటింగ్ జరగాలంటే అది భౌతికంగా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. పార్లమెంటరీ కమిటీ మాకు కొన్ని సిఫార్సులు చేసింది. వాటిని పరిగణనలోకి తీసుకుంటాము. ఇందులో రాజ్యాంగపరమైన అంశం ముడిపడి ఉందని చెప్పుకొచ్చారు. దీంతో, తదుపరి విచారణను జనవరి 9వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.





**చనిపోతున్నా స్పందించరా?**

అంతకుముందు.. దేశ రాజధాని నగరం ఢిల్లీ సహా చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్న వేళ.. ఎయిర్ ప్యూరిఫైయర్లపై 18 శాతం జీఎస్టీ కొనసాగిస్తుండటంపై హైకోర్టు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ గాలి శుద్ధి యంత్రాలపై జీఎస్టీ తగ్గించే అంశాన్ని ఎందుకు పరిశీలించడం లేదని కేంద్రాన్ని ప్రశ్నిస్తూ.. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. జీఎస్టీ కౌన్సిలు తక్షణం సమావేశమై గాలిశుద్ధి యంత్రాలపై పన్ను తగ్గించడం లేదా పూర్తిగా రద్దు చేయడంపై ఓ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. "మనం రోజుకు 21 వేల సార్లు శ్వాస తీసుకుంటాం. అలాంటప్పుడు గాలి కాలుష్యం వల్ల ఎంత నష్టం జరుగుతుందో ఓసారి లెక్కించండి" అని వ్యాఖ్యానించింది. పిటిషనుపై స్పందించేందుకు గడువు ఇవ్వాలన్న ప్రభుత్వ అభ్యర్థనపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. "వాయు కాలుష్యం ప్రాణాంతకంగా మారింది. వేల సంఖ్యలో ప్రజలు చనిపోయిన తర్వాత స్పందిస్తారా? ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలి అవసరం. అది అందించలేనప్పుడు కనీసం శుద్ధి యంత్రాలనైనా అందుబాటు ధరల్లో ఉంచాలి కదా! ఇలాంటి ఎయిర్ ఎమర్జెన్సీలో జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద తాత్కాలిక పన్ను మినహాయింపును తక్షణం ఎందుకు ఇవ్వకూడదు?" అని కేంద్రంపై ప్రశ్నలు కురిపించింది. ప్రజల ప్రాణాల కంటే పన్నులే ముఖ్యమా? అంటూ ప్రశ్నించింది.

# ఢిల్లీలో కాలుష్య సంక్షోభానికి వాళ్లే పరిష్కారం కనుగొంటారు

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం ఉదయం కూడా గాలి నాణ్యత సూచిక ప్రమాదకర స్థాయిలో నమోదైంది. అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైగా నమోదయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని నగరంలో తీవ్ర కాలుష్యంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలుష్య సంక్షోభానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కొనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఓ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. 'ఢిల్లీని పీడిస్తున్న వాయు కాలుష్య సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ఉపశమనం కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు అవసరం. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్న ఈ వాయు కాలుష్య సమస్యకు నిపుణులు పరిష్కారం కనుగొంటారని నాకు నమ్మకం ఉంది' అని అన్నారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. శుక్రవారం ఉదయం రాజధాని నగరంలో గాలి నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఉదయం 8 గంటల ప్రాంతంలో నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 305గా నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచిక 390గా నమోదైంది.





బవానాలో 379, నరేలా ప్రాంతంలో 356, ఆర్కే పురంలో 320గా ఏక్యూఐ నమోదైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగ్గా నమోదైంది. చీ×ు ద్వారకలో 253, అరబిందో మార్గ్ (258), మందిర్ మార్గ్ (234), ×+× విమానాశ్రయం ు3 (239)గా గాలి నాణ్యత నమోదైంది.

# కేరళలో చరిత్ర సృష్టించిన బీజేపీ, తిరువనంతపురం మేయర్‌గా వీవీ రాజేశ్

**తిరువనంతపురం:** కేరళలో బీజేపీ చరిత్ర సృష్టించింది. తిరువనంతపురం మేయర్‌గా బీజేపీ నేత వీవీ రాజేశ్ ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. మేయర్‌గా ఎన్నికైన తర్వాత రాజేశ్ మాట్లాడుతూ కలిసికట్టుగా ముందుకు వెళ్తామన్నారు. అన్ని 101 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఓ అభివృద్ధి చెందిన నగరంగా తిరువనంతపురం మారుతుందన్నారు. ఇది చరిత్రాత్మక సందర్భం అని, ఇది కేరళ రాజకీయాల్లో మార్పు తెస్తుందని, తిరువనంతపురంలో జరిగిన మార్పు.. యావత్ రాష్ట్రాన్ని మార్చేస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. కేరళలో బీజేపీ ప్రాబల్యం తక్కువే. బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న వీవీ రాజేశ్.. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కొడుంగనూరు వార్డు కౌన్సిలర్‌గా గెలిచారు. ఆ విక్టరీతో ఇప్పుడు ఆయన తిరువనంతపురం మేయర్‌గా మారారు. మరో ఆరు నెలల్లో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజేశ్‌కు కీలక బాధ్యతలు దక్కాయి. 2016లో నీమమ్ సీటు నుంచి బీజేపీ అభ్యర్థిగా రాజాగోపాల్ గెలిచారు. ఆ తర్వాత 2024లో త్రిసూరు నుంచి సురేశ్ గోపి విజయం సాధించారు. మేయర్ రేసులో రాజేశ్‌కు 51 ఓట్లు పడ్డాయి. తిరువనంతపురం మున్సిపాల్టీలో మొత్తం 100 మంది సభ్యులు ఉన్నారు. సీపీఎంకు చెందిన ఆర్పీ




శివాజీకి 29, కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ శబరినాథన్‌కు 19 ఓట్లు పోలయ్యాయి. ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి గైర్హాజరు అయ్యారు. రెండో స్వతంత్ర్య కౌన్సిలర్ పీ రాధాకృష్ణన్ ఓటు విజయంలో కీలకంగా మారింది. డిసెంబర్ 9వ తేదీన జరిగిన వార్డు ఎన్నికల్లో బీజేపీకి 50 సీట్లు దక్కాయి.

# విద్యార్థి పెన్ను దొంగిలించినట్లు ఆరోపణ.. వేధిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్లపై కేసు

**లక్నో:** ఒక విద్యార్థి పెన్ను దొంగిలించినట్లు స్కూల్ సిబ్బంది ఆరోపించారు. ఆ బాలుడ్ని వారు వేధిస్తుండటంతో అతడు భరించలేకపోయాడు. కుమారుడి ప్రవర్తనలో మార్పు గమనించిన తల్లిదండ్రులు ఆందోళన చెందారు. స్కూల్ వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. (ఖుతీుంంఅఅస్త ్ఔబుఎవత్ ాజువతీ ౖావఅ ు్షవ్రవట్) ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక ప్రైవేట్ స్కూల్‌లో 8 ఏళ్ల బాలుడు రెండో తరగతి చదువుతున్నాడు. నవంబర్ 28న ఒక స్టూడెంట్ పెన్ను చోరీ అయ్యింది. అయితే ఆ బాలుడు దొంగిలించినట్లు స్కూల్ సిబ్బంది ఆరోపించారు. డిసెంబర్ 12న ప్రిన్సిపాల్ రూమ్‌కు అతడ్ని పిలిపించారు. పెన్ను దొంగిలించినట్లు ఆ విద్యార్థితో బలవంతంగా ఒప్పించి వీడియో రికార్డ్ చేశారు. చోరీ అయిన పెన్ను ధర చెల్లించాలని బాలుడి పేరెంట్స్‌ను ఒత్తిడి చేశారు. కాగా, పెన్ను చోరీ జరిగిన రోజున తమ కుమారుడు స్కూల్‌కు వెళ్లలేదని తల్లిదండ్రులు తెలిపారు. ఆ తప్పు చేసినట్లుగా బలవంతంగా ఒప్పించి రికార్డ్ చేశారని ఆరోపించారు. నాటి నుంచి స్కూల్ సిబ్బంది తమ కుమారుడ్ని వేధిస్తున్నారని విమర్శించారు. రాత్రివేళ నిద్ర లేచి ఏడుస్తున్నాడని, 'మేడం నేను పెన్ను తీయలేదు' అని



కలవరిస్తున్నాడని తెలిపారు. బుక్స్‌తో పాటు గోడలపై 'హెల్ప్' అని రాయడాన్ని తాము గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు బాలుడి తల్లి ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. ఆ స్కూల్‌కు నోటీస్ జారీ చేశారు. అయితే పోలీస్ స్టేషన్‌కు హాజరుకాలేదని పోలీస్ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 23న స్కూల్ డైరెక్టర్ దేవరాజ్ సింగ్ రాజవత్, ప్రిన్సిపాల్ అనుప్రీత్ రావల్, టీచర్లు సంగీతా మాలిక్, స్వతంత్ర అగ్నిహోత్రిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## గడువులోగా ప్రాపర్టీ వివరాలివ్వండి



**న్యూఢిల్లీ:** ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఆఫీసర్లకు .. ఇవాళ కేంద్రం హెచ్చరిక చేసింది. నిర్దేశిత గడువులోగా తమ ప్రాపర్టీ వివరాలను వెల్లడించాలని, లేదంటే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కేంద్రం తన ఆదేశాల్లో తెలిపింది. వివరాలు పొందుపరచడంలో జాప్యం జరిగితే ప్రమోషన్లు కోల్పోయే అవకాశం ఉన్నట్లు అధికారిక ప్రకటనలో ప్రభుత్వం పేర్కొన్నది. వార్షిక స్థిరాస్తి వివరాలను వచ్చే ఏడాది జనవరి 31వ తేదీలోగా వెల్లడించాలని ఐఏఎస్ ఆఫీసర్లకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. పే నిబంధనలు వర్తించాలంటే ఐపీఆర్ ఫైలింగ్ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తన ఆదేశాల్లో తెలిపింది. పర్సనల్ అండ్ ట్రైనింగ్ శాఖ (డీఓపీటీ) .. జనవరి 2017 నుంచి ఐఏఎస్ ఆఫీసర్ల కోసం ఆన్‌లైన్ ఐపీఆర్ ఫైలింగ్‌కు అవకాశం కల్పించింది. స్పారో మాడ్యూల్‌లో ఆ ప్రక్రియ చేపట్టారు. అయితే జనవరి 31వ తేదీన ఆన్‌లైన్ మాడ్యూల్ ముగిసిపోతుందని, ఐఏఎస్‌లు అందరూ నిర్దేశిత గడువులోగా తమ ఐపీఆర్ ఫైల్ చేయాలని అన్ని రాష్ట్రాల సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు.

## వినియోగదారుల భద్రతే లక్ష్యం



దేశంలో అగరుబత్తీల (ధూప్ స్టిక్స్) నాణ్యత, భద్రతను పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల ఆరోగ్యం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కొత్త ప్రమాణాలను విడుదల చేసింది. 'జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025' సందర్భంగా శుక్రవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి "ఐఎస్ 19412:2025 – అగరుబత్తీల స్పెసిఫికేషన్" పేరుతో ఈ నూతన ప్రమాణాలను ఆవిష్కరించారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం, అగరుబత్తీల తయారీలో పలు హానికరమైన పురుగుమందులు, సింథటిక్ సువాసనల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. అలత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మె త్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి పురుగుమందులతో పాటు బెంజైల్ సైనైడ్, ఇథైల్ అక్రిలేట్ వంటి రసాయనాల వాడకంపై ఆంక్షలు విధించారు. వీటిలో చాలా రసాయ నాలు మానవ ఆరోగ్యం, గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంతర్జాతీ యంగా నిషేధంలో ఉన్నాయి. ప్రపంచంలోనే అగరుబత్తీల ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశంలో ఏటా రూ. 8,000 కోట్ల పరిశ్రమ ఉండగా, సుమారు 150 దేశాలకు రూ. 1,200 కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఈ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని ఎందరో చేతివృత్తుల వారికి, మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. కొత్త ప్రమాణాల ప్రకారం అగరుబత్తీలను యంత్ర నిర్మిత, చేతితో తయారు చేసినవి, సాంప్రదాయ మసాలా రకాలుగా వర్గీకరించారు. ముడిసరుకులు, మండే విధానం, సువాసన వంటి అంశాల్లో నాణ్యతను నిర్దేశించారు. ఈ ప్రమాణాలకు అనుగు ణంగా ఉన్న ఉత్పత్తులకు 'బీఐఎస్ స్టాండర్డ్ మార్క్' లభిస్తుంది. దీనివల్ల వినియోగదారులు నాణ్యమైన, సురక్షితమైన ఉత్పత్తులను సులభంగా గుర్తించవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం వినియోగదారుల నమ్మకాన్ని పెంచడంతో పాటు, భారత అగరుబత్తీలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత ఆదరణ లభిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా సైనికులకు టీ, లస్సీ అందించిన బాలుడు.. దక్కిన బాల పురస్కార్ అవార్డు



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పదేళ్ల బాలుడు తన వంతుగా సైనికులకు సేవలందించాడు. టీ, స్నాక్స్, పాలు, లస్సీ వంటివి వారికి అందజేశాడు. నాటి నుంచి ప్రశంసలు పొందిన ఆ బాలుడికి బాల పురస్కార్ అవార్డు దక్కింది. పంజాబ్ ఫిరోజ్‌పూర్ జిల్లాలోని సరిహద్దు ప్రాంతంలో నివసించే శ్రావణ్ సింగ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ ప్రదానం చేశారు. కాగా, బాల పురస్కార్ అవార్డు తనకు రావడం చాలా సంతోషంగా ఉన్నదని శ్రావణ్ సింగ్ తెలిపాడు. తనకు ఈ అవార్డు దక్కుతుందని ఎప్పుడూ ఊహించలేదని చెప్పాడు. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా సైనికులకు చేసిన సేవల గురించి వివరించాడు. 'పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనప్పుడు సైనికులు మా గ్రామానికి వచ్చారు. వారికి సేవ చేయాలని నేను అనుకున్నా. నేను రోజూ వారి కోసం పాలు, టీ, మజ్జిగ, ఐస్ తీసుకెళ్లేవాడిని' అని మీడియాకు తెలిపాడు. మరోవైపు ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులతో సహా 26 మందిని ఉగ్రవాదులు కాల్చి చంపారు. దీనికి ప్రతీకారంగా మే నెలలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగడంతో పాకిస్థాన్ భారీ నష్టాన్ని చవిచూసింది. పాక్ కీలక ఎయిర్‌బేస్‌లు ధ్వంసం కావడంతో కాళ్లబేరానికి దిగి వచ్చింది. చివరకు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నది.

## హెచ్-1బీ వీసా అంశంపై స్పందించిన భారత్



అమెరికా హెచ్–1బీ వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఈ విషయాన్ని తాము అమెరికా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఆయన వెల్లడించారు. ఇది అమెరికా సార్వభౌమాధికార పరిధిలోని అంశమే అయినప్పటికీ, తమ ఆందోళనలను అమెరికాకు తెలియజేశామని ఆయన పేర్కొన్నారు. కెనడాలో గుండెపోటు కారణంగా భారత సంతతికి చెందిన వ్యక్తి ఇటీవల మరణించిన ఘటనపై కూడా భారత్ స్పందించింది. మృతుడు భారత సంతతికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, అతనికి కెనడా పౌరసత్వం ఉందని స్పష్టం చేసింది. ఈ విషయంలో కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొంది. తీవ్ర ఛాతి నొప్పితో తన భర్తను ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ, చికిత్స కోసం దాదాపు ఎనిమిది గంటలు వేచిచూడాల్సి వచ్చిందని, దీని కారణంగానే తన భర్త ప్రాణాలు కోల్పోయాడని మృతుడి భార్య ఆరోపించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137